[illegible]

2007 [illegible]

# సాహిత్యోపన్యాస సంకలనం



సంకలనకర్త :

బి. యస్. రెడ్డి (భూమన్)

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జాతీయ సాహిత్య సదస్సు

2007 జనవరి 3,4 తేదీలు

# సాహిత్యోపన్యాస సంకలనం


సంకలనకర్త:

**బి.యస్. రెడ్డి (భూమన్)**

సంచాలకుడు, తి.తి.దే. "శ్వేత", తిరుపతి



ప్రచురణ

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

**2007**

SĀHITYOPANYĀSA SAṄKALANAM

Complied by

**BHUMAN (B.S. REDDY)**
DIRECTOR
"SVETA", T.T.D., TIRUPATI.

TTD "SVETA" Religious Publications Series No :7

© All Rights Reserved

First Edition: 2007

Copies : 2000

Price :

Published by
**K.V. RAMANACHARI,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
TIRUPATI - 517 507

Printed at
**Sri Parasarya Press**
Sri Vyasasramam
Ph: 08578-287528

# నా మాట

శ్రీనివాసుణ్ణి కావ్య కుసుమాలతో ఆరాధించి, తరించిన సాహితీమూర్తుల్లో అగ్రగణ్యయైన మహాకవయిత్రి  మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ.

ఆ స్వయంవ్యక్త అర్చామూర్తియొక్క నామధేయాన్నే సవదరించి, ఆ దేవదేవుని సాన్నిధ్యంలో సహస్ర మాసాల నిండు జీవితాన్ని సార్థకంగా పండించుకొన్న ఈ సుకృతి రచన లన్నింటినీ సముద్ధరించే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆమె పేరున ఒక వాఙ్మయ ప్రాజెక్టును శాశ్వతంగా నెలకొల్పింది.

"శ్వేత" సంస్థ సంచాలకులు శ్రీ భూమన్ గారి నేతృత్వంలో ఈ వాఙ్మయ ప్రాజెక్టు అచిర కాలంలోనే ఏడెనిమిది పుస్తకాల ప్రచురణలను, ఎంపికచేసిన పాటల ఆరు సి.డి. లను ఆవిష్కరింప చేయడం చాలా ముదావహమైన విషయం.

ఈ వాఙ్మయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ ఏడాది - అనగా జనవరి 3,4 తేదీలలో ఈ మహాకవయిత్రి సాహిత్యంపై తిరుపతిలో నిర్వహించిన జాతీయ సాహిత్య సదస్సులో ప్రముఖ పరిశోధకులు సమర్పించిన ప్రసంగ వ్యాసాల సంకలనం ఈ రీతిని ముచ్చటగా రూపొందింది. ఈ ఉపన్యాసాల సమాహారం సహృదయ సాహితీ లోకాన్ని అలరింప చేయగలదని మా ఆశయం.

ఇదే రీతిగా ఈ వాఙ్మయ పరిష్కరణ ప్రాజెక్టు ఈ భాగవత కవయిత్రి రచనలను అన్నింటినీ సుపరిష్కృత రూపంలో ప్రచురింపచేయవలెనని కోరుతున్నాను.

శ్రీనివాసుని దివ్యానుగ్రహంచేత ఈ వాఙ్మయ పరిష్కరణ ప్రాజెక్టు ఇతోధికంగా వాఙ్మయ ఫలాలను సహృదయ పాఠక లోకానికి అందజేయగలదని మా ఆశంస.

తిరుపతి
జూన్ 4, 2007

**కె.వి. రమణాచారి**
శ్రీకార్యనిర్వహణాధికారివర్యులు
తిరుమల తిరుపతి దేవస్థానములు.

# మనవి

తెలుగులో అన్నమయ్య తరువాత రాశిలోనూ, వాసిలోనూ విష్ణు సాహిత్యాన్ని విరివిగా అందించిన మహాకవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. వెంగమాంబ 'తెలుగు మీరా'గా సుప్రసిద్ధురాలై, పోతనతో సాటియైన భక్తకవయిత్రిగా ప్రస్తుతింపబడింది.

శ్రీనివాసుణ్ణి రసరమ్యములైన కావ్యకుసుమాలతో పూజించి తరించిన సుమధుర సారస్వతమూర్తి తరిగొండ వెంగమాంబ. ఈ కవయిత్రి రచనలు శ్రీవేంకటేశ్వరుని సాహితీ మందిరంలో వెలిగించిన అఖండ దీపాలు. ఆ దీప కళికల కాంతులు ఈనాటికీ నిరంతరం ఆ తిరుమలేశుని దివ్య వైభవాన్ని అక్షరంగా ప్రకాశింప జేస్తున్నాయి.

తిరుపతికి పశ్చిమాన 100 కి.మీ. దూరంలో తరిగొండ గ్రామంలో ప్రభవించి, మధురకవితా సుధాధారలతో శ్రీ వేంకటేశుని అభిషేకించి తరించిన తెలుగు కవయిత్రి, అఖిలాంధ్ర జనయిత్రి తరిగొండ వెంగమాంబ.

సాంఘిక దురాచారాలపై సమరం ప్రకటించి, బాల వితంతువులపై ఆ నాడు జరిగే అన్యాయాలను ప్రతిఘటించి- తనకోసం కాదు- తనవంటి అభాగినులపై సంప్రదాయం పేరిట జరిగే అమానుష కృత్యాలను ఎదిరించి, తిరుగుబాటు బావుటా ఎగురవేసిన విప్లవవనిత వెంగమాంబ.

అనేకానేక ప్రక్రియలలో శతకాలు, యక్షగానాలు, ద్విపదలు, తత్త్వ సంబంధమయిన రచనలు, శ్రుతి, లయ సమన్వితములైన వేదాంతగీతాలు వెలయించటమేగాక, శ్రీ వేంకటాచలమాహాత్మ్యంవంటి బృహత్కావ్యములను రచించిన విదుషీమణి వెంగమాంబ.

శ్రీతరిగొండ వెంగమాంబ విశిష్ట వ్యక్తిత్వాన్ని పసిగట్టిన అప్పటి తిరుమల-తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, గౌరవనీయులు, సంస్కారి శ్రీ ఏ.పి.వి.యన్.శర్మ, ఐ.ఏ.యస్., గారు ఈ కవయిత్రి రచనలను పరిష్కరించి, ప్రచురించుటకుగాను 'తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్టు'ను ఏర్పరచి అందుకు పరిష్కర్తగా శ్రీ కె.జె.కృష్ణమూర్తిగారిని నియమించినారు. ఆ ప్రాజెక్టు "శ్వేత" ఆధ్వర్యంలో

పనిచేసేట్టుగా ఆదేశించినారు. స్వయాన సాహితీప్రియుణ్ణి అయిన నాకు తరిగొండ వెంగమాంబను గురించి తెలుసుకునే అవకాశం ఈ రకంగా కలిగింది.

ఈ కవయిత్రి సాహిత్యంమీద 2007 జనవరి 3,4 తేదీలలో రెండు రోజులు జాతీయ సాహితీసదస్సు ఘనంగా నిర్వహించినాము. నాకు తెలిసి చరిత్రలో ఇది తొలి సదస్సు. అనంతరం 2007 ఏప్రిల్ 29,30 తేదీల్లో వెంగమాంబ జయంతి ఉత్సవాలను ప్రప్రథమంగా రెండు రోజుల పాటు తరిగొండ, తిరుమల, తిరుపతులలో పెక్కు సంగీత, సాహిత్య కార్యక్రమాలతో వైభవోపేతంగా నిర్వహించటం జరిగింది. ఈ జయంతి ఉత్సవాలలో వెంగమాంబ రచించిన ఐదు పుస్తకాలను ఐదు పాటల ఆడియో సి.డి.లను ఘనంగా ఆవిష్కరింపచేయడం జరిగింది.

జనవరి 3,4 తేదీలలో నిర్వహించిన జాతీయ సాహిత్యసదస్సులో పరిశోధకులు సమర్పించిన పత్రాలను ఇప్పుడు పుస్తకంగా తీసుకొస్తున్నాము. ఈ పుస్తకాన్ని తీసుకురావటంలో మా ప్రియతమ కార్యనిర్వహణాధికారి, ఉత్సాహవంతులు, మంచి చొరవ కలిగిన సాహిత్యాభిలాషి, సహృదయులు శ్రీమాన్ కె.వి. రమణాచారి, ఐ.ఏ.యస్., గారు చక్కని ప్రోత్సాహాన్నిస్తున్నారు. ఇలాంటి సదస్సులు అనేక చోట్ల జరపటానికి చొరవ చూపిస్తున్నారు. తరిగొండ వెంగమాంబ సాహిత్యాన్నిగూర్చి ఊరూర ప్రచారం చేయటానికి ఇటువంటి సదస్సులు బాగా ఉపకరిస్తాయి. తరిగొండ వెంగమాంబ సదస్సుల నిర్వహణలోనే కాకుండా, తరిగొండను తిరుమల తిరుపతి దేవస్థానం దత్తత తీసుకోవటంలోనూ విశేషమైన చొరవ తీసుకొన్నవారు శ్రీ కె.వి. రమణాచారిగారు. వారికి నా ధన్యవాదాలు.

ఈ బృహత్ కార్యక్రమము సఫలీకృతం కావటానికి కారకులైన మా ప్రియతమ కార్యనిర్వహణాధికారి. శ్రీ కె.వి. రమణాచారిగారికి తెలుగు సాహితీ, సంగీత ప్రియుల పక్షాన ధన్యవాదాలు.

**బి.యస్. రెడ్డి**
సంచాలకులు
**"శ్వేత"**

# సాహిత్యోపన్యాస సంకలనం

## విషయ సూచిక


| విషయము. | | పుట. |
|---|---|---|
| నామాట | | iii |
| మనవి | | iv |
| 1. భక్త కవయిత్రి తరిగొండ వెంగమాంబ కాలంలోని సామాజిక నేపథ్యం–వెంగమాంబ విశిష్ట వ్యక్తిత్వం<br>- శ్రీ కె. రామిరెడ్డి, ఐ.ఏ.యస్., (రిటైర్డ్) | ..... | 1 |
| 2. శ్రీ తరిగొండ వెంగమాంబ ప్రబోధించిన వేదాంతం<br>- డా॥ సముద్రాల లక్ష్మణయ్య | ..... | 6 |
| 3. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సాహిత్య సదస్సు<br>- శ్రీ సింగరాజు సచ్చిదానందం | ..... | 16 |
| 4. దాక్షిణాత్య భక్త కవయిత్రులు ఆండాళ్ – వెంగమాంబ<br>- శ్రీమాన్ పి. ఆర్. రంగరాజన్ | ..... | 18 |
| 5. భక్తనారి మీరాబాయి – భక్త కవయిత్రి తరిగొండ వెంగమాంబ<br>- ఆచార్య కె.జె. కృష్ణమూర్తి | ..... | 22 |
| 6. వెంగమాంబ భక్తి కవితా తత్త్వం<br>- డా॥ వెలుగోటి భాస్కరసాయికృష్ణ యాచేంద్ర | ..... | 39 |
| 7. తాళ్లపాక తిమ్మక్క – తరిగొండ వెంగమాంబ<br>- డా॥ ఆర్. అనంత పద్మనాభరావు | ..... | 41 |
| 8. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ దానపత్రాల్లోని ధార్మిక సామాజిక దృక్పథం<br>- శ్రీ గోపికృష్ణ | ..... | 53 |
| 9. తిరుమల వేంకటేశ్వరుడు – తరిగొండ వెంగమాంబ<br>- శ్రీ జొలకంటి బాలసుబ్రహ్మణ్యం | ..... | 68 |

# భక్త కవయిత్రి తరిగొండ వెంగమాంబ కాలంలోని సామాజిక నేపథ్యం - వెంగమాంబ విశిష్ట వ్యక్తిత్వం

-- శ్రీ కె. రామిరెడ్డి, ఐ.ఏ.యస్., (రిటైర్డ్)

క్రీ.శ. 1565లో జరిగిన తళ్లికోట యుద్ధంతో విజయనగర సామ్రాజ్యం పతనమయింది. క్రీ.శ.1675లో చంద్రగిరిలోని విజయనగర రాజుల పాలన అంతమయింది. 1673లో తంజావూరు నాయక రాజుల పరిపాలన ముగిసింది. దీనితో పటిష్ఠమైన ఆంధ్రరాజుల ప్రభుత్వాలన్నీ కూలిపోయాయి. ఆంధ్రప్రజలకు క్షీణదశ ఆరంభమయింది.

క్రీ.శ.1724లో ఔరంగజేబ్ మరణానంతరం అసఫ్‌జాహీవంశస్థులు స్వతంత్రం ప్రకటించుకొని హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రాంతాన్ని ఏలసాగారు. వీళ్ళు ప్రాంతీయ పాలెగాళ్ళకు నిరంకుశమైస సర్వాధికారాలూ కట్టబెట్టి, ప్రజలయోగక్షేమాలు పట్టించుకోవడం మానేశారు. ఆ కాలంలో రాయలసీమ ప్రాంతంలో అరాచకత్వం రాజ్య మేలింది. ఒక వైపు మొఘల్ సేనల దోపిడీ, రెండో వైపు మహారాష్ట్ర సైన్యాల దండయాత్రలతో, మూడవవైపు తూర్పు ఇండియా కంపెనీ వాళ్ళ దురాక్రమణలతో మరోవైపు పాళెగాళ్ల అరాచకాలతో, కంపెనీవాళ్ళ దురాక్రమణలతో ఆంధ్రప్రాంతం అతలాకుతల మయింది.

సాంఘిక సంక్షేమం పూర్తిగా నశించిన ఈ సంధియుగంలో ఆర్థిక విచ్ఛిత్తితో పాటు, సమాజంలో కులభేదాలు, మూఢాచారాలు, అనైతికధోరణులు మితి మీరి పోయాయి. ఈ నిస్సహాయస్థితిలో ప్రగాఢమైన దైవభక్తి ధోరణి పుట్టుకొచ్చి, ప్రజల్లో విపరీతంగా చోటుచేసుకొంది.

తిరునాళ్ళు, జాతరలు, ఉత్సవాల పేరిట దేవుణ్ణి నిరంతరం స్మరిస్తూ, సేవిస్తూ ప్రజలు బాధలు మరచిపోయి, ఆత్మవిశ్వాసం కూడగట్టుకొనే ప్రయత్నం చేశారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో క్రీ.శ.1730లో వెంగమాంబ జన్మించారు.

అప్పటికే రాజాదరణ కరువైన ప్రబంధసాహిత్యం మూలబడింది. భక్తిప్రధానమైన శతకవాఙ్మయం దినదినాభివృద్ధి చెందింది. ఈ శతకాలలో దైవభక్తి చాటున ఆనాడు ప్రజలు పడుతున్న అనేకమైన ఈతిబాధలు, మానసిక హింసలు ప్రతి బింబించాయి. క్రీ.శ. 1800లలో రాయలసీమ, అంతకుముందు కోస్తా ఆంధ్ర బ్రిటిష్ వాళ్ళ పరిపాలనలోకి వచ్చేదాకా తెలుగునేల అంతటా ఇదే పరిస్థితి కొనసాగింది. అస్థిరత్వం రాజ్యమేలింది.

క్రీ.శ.17వ శతాబ్దం నాటికే బౌద్ధ, జైన మతాల ప్రాబల్యం తెరమరుగయింది. వీరశైవం వెర్రితలలు వేయసాగింది. దీనిలో 18వ శతాబ్దంలో ఆంధ్రదేశమందటా వైష్ణవ భక్తి విస్తృతంగా, ఉద్ధృతంగా వ్యాపించింది. పాత సమాజం శిథిలమైపోతున్నది. కొత్త సమాజం ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. ఇటువంటి స్థితిలో "భారమంతా నీదే స్వామీ!" అన్న ధోరణిలో భక్తివాఙ్మయం కొనసాగింది. ఆనాటి శతకవాఙ్మయమే ఇందుకు నిదర్శనం.

ఈ సంధియుగంలో శతకాలు, గేయాలు, యక్షగానాలు మొదలైన రూపాలలో సాహిత్యం వికసించింది. ప్రజావాణి ఈ విధంగా కవుల రచనల్లో వ్యక్తమయింది; ప్రతిఫలించింది.

క్రీ.శ.18వ శతాబ్దిలో నివసించిన మాతృశ్రీ వెంగమాంబ రచనలు కూడా ఇదే పంథాలో వెలువడ్డాయి. వైష్ణవ భక్తిప్రధానమైన శతకాలు, యక్షగానాలు, ఆధ్యాత్మిక గేయాలుగా వారి కృతులు రచింపబడ్డాయి.

ఆ నాటి చిల్లరమల్లర పాళెగాళ్ళ, ఇతర పాలకుల అజ్ఞానాన్నీ, అనైతికతనూ 17వ శతాబ్దం పూర్వార్ధంలో జీవించిన యోగివేమన తీవ్రంగా ఖండించి ఎండ గట్టిన విధంగానే, యోగిని వెంగమాంబకూడా తన నృసింహశతకంలో తూర్పార బట్టారు. కడుపుకూటికోసం అప్పటి విద్యాంసులు ఎంతటి దైన్యస్థితికి దిగజారిపోయారో స్పష్టంగా వివరించారు:

**వేమన-**

"తోటకూరకైన, దొగ్గలికైనను
తవిటికుడుముకైన, తవిటికైన,
కావ్యములను చెప్పు గంద్యాలు ఘనమైరి ॥విశ్వ॥

**వెంగమాంబ-**

"బొందియె శాశ్వతంబనుచు బోరున రొక్కము గూర్చు లోభినిం
పొందcగనూరిలోc గినిసి భోజుడవంచును భట్లు వేడినన్
ఎందుకు వీరు వచ్చి? రిదియేమి మహాప్రళయం? బటంచు బల్
గొందుల దూరునయ్య, తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!

తెలుగు సారస్వతంలో గొప్ప కవులకు సరితూగగల కవయిత్రి మాతృశ్రీ వెంగమాంబ. అష్టాదశగ్రంథకర్త్రి. ఈమె రచించిన కృతులన్నింటిలోనూ మకుటాయమానమైనది "శ్రీవేంకటాచలమాహాత్మ్యము".

తెలుగు సాహిత్యంలో ఆది కవయిత్రి అయిన తాళ్ళపాక తిమ్మాంబ, మహాకవయిత్రి అయిన తరిగొండ వెంగమాంబ వీరిరువురూ తిరుమల క్షేత్రవాసులుగా పునీతులు కావడం ఒక దైవిక విశేషం. తిరుపతి వాసుల పుణ్యఫలం.

## వెంగమాంబ వ్యక్తిత్వం :

ప్రశంసనీయమైన సంయమనం, అచంచలమైన ఆత్మవిశ్వాసం, ప్రతికూల పరిస్థితులు చుట్టుముట్టి పట్టిపీడించినప్పుడు ఏ మాత్రం మొక్కవోని ధైర్యంతో, ఆత్మనిగ్రహంతో, అకుంఠిత సంకల్పబలంతో ముందుకు సాగి తమ ప్రతిభకు పూర్ణత్వాన్ని, తమ జన్మకు సార్థక్యాన్ని చేకూర్చుకొన్నవాళ్ళే ప్రపంచంలో ఆదర్శప్రాయు లవుతారు. (good role models). అమరు లవుతారు. మార్గదర్శకులుగా మిగిలిపోతారు.

కైకేయి కొన్ని వింత కోర్కెలు కోరగానే చేష్టలుడిగిపోయి ముప్పిరిగొన్న శోకావేశంతో కుప్పగూలి ప్రాణాలు విడిచిన దశరథమహారాజుగానీ, ప్రసవ సమయంలో ప్రాణప్రదంగా ప్రేమించిన అర్ధాంగి ముంతాజ్‌మహల్ ప్రాణాలు విడిచిందని తెలియగానే, అదుపు తప్పిన దుఃఖంతో అంతఃపురంలో ఏకాంతంగా ఏడు రోజులు రోదించి, హరించి పోయిన ఆరోగ్యంతో బయటపడి, కన్నబిడ్డలను, రాజ్యపాలనను అలక్ష్యంచేసిన షాజహాన్ చక్రవర్తిగానీ మనకు జీవితంలో మార్గదర్శకులు కారు. ఆత్మబలం విషయంలో ఆదర్శప్రాయులుకారు. అసమాన శూరుడైన ఆత్మజుడు అభిమన్యుడు హతు దయ్యాడని తెలిసినా అర్జునుడు అని మొన నుంచి అడుగుకూడా వైదొలగలేదు. తన విధ్యుక్త ధర్మాన్ని విస్మరించలేదు. కురుక్షేత్రంలో కడవరకూ పోరాడి శత్రునిర్మూలనం చేశాడు. అంతిమంగా అనుకొన్న లక్ష్యాన్ని సాధించాడు. అందరికీ ఆదర్శంగా నిలిచాడు. అమరుడయ్యాడు, మహాత్ముల కోవకు చెందిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ఉదాత్తమైన వ్యక్తిత్వానికి ఉత్కృష్టమైన ప్రతిరూపం. ధీరోదాత్తతకు మారుపేరు. ఆ నాటి సాంఘిక దురాచార మైన బాల్యవివాహానికి ఆమె బలి అయింది. దురదృష్టవశాత్తు యుక్తవయస్సులోనే వైధవ్యం అనుభవించింది. స్త్రీలను, అందులోనూ వితంతువులను చులకనగా చూసి, వాళ్ళలోని ప్రతిభావ్యుత్పత్తులను నిర్దాక్షిణ్యంగా, నిరంకుశంగా, కర్కశంగా కాలరాసే ఆనాటి సమాజ వ్యవస్థలో ఆమె అనేకమైన అవమానాలను, బాధలను భరించింది. ఎన్నో అవరోధాలను అధిధామించింది.

తనలో పసిప్రాయంలోనే పాదుకొన్న పవిత్రమైన దైవభక్తికి తన విశిష్టమైన కవితాప్రతిభ అనే పరిమళసుగంధాన్ని అనంతంగా అలదింది. అమూల్యమైన అష్టాదశ కృతులను మనకు అందించింది. జన్మను సార్థకం చేసుకొంది. ఆంధ్రభాషలో ఆధ్యాత్మిక సారస్వతాన్ని సుసంపన్నంచేసింది. ఆరాధ్య మహిళామణిగా అమరజీవి అయింది.

పరిస్థితులు తీవ్రంగా ప్రతికూలించినప్పుడూ, సాటి మానవులు పనిగట్టుకొని కసిగా వ్యతిరేకించినప్పుడూ, అలజడికీ, ఆందోళనకూ, ఆవేదనకూ,

విరక్తికీ, వైరాగ్యానికీ లోనుగాకుండా, ఆత్మ బలం కోల్పోకుండా. అనుకొన్న లక్ష్యాన్ని సాధించే వరకూ విశ్రమించనటువంటి ఉద్వేగ పరిణతి (emotional maturity) ఉన్నవాళ్ళకే జీవితం ఫలప్రదమవుతుంది. సార్థక మవుతుంది. అటువంటి అచంచలమైన ఆత్మ విశ్వాసంతో కూడిన ఉన్నతమైన వ్యక్తిత్వంగల ఉదాత్త చరిత శ్రీవెంగమాంబ.

ధీరోదాత్తులైన వాళ్ల వ్యక్తిత్వ లక్షణాలు ఎలా ఉండాలి? – అన్న విషయాన్ని వెంగమాంబ తన తత్త్వకీర్తనల ద్వారా మనకు ఆ నాడే స్పష్టంగా ప్రబోధం చేశారు.

**"దూషణంబులు విని దుఃఖింతువేలా?**
**భూషణంబులు గని పొంగెదవె బేలా!**
**ద్వేషులే హితులని తెలియవే బాలా!**
**రోషమును త్రుంచి పోరుట మాను మబలా!"**

పొగడ్తలకు పొంగిపోకుండా, తెగడ్తలకు క్రుంగిపోకుండా, అరిషడ్వర్గాలకు అతీతంగా ఎదిగినప్పుడూ, ఆత్మబలంతో, ఉన్నతాశయాలతో ఉదాత్తగుణంతో, ఉద్వేగ నియంత్రణ చేసుకొంటూ ధీరోదాత్తంగా ముందుకు సాగినప్పుడు సామాన్యులు కూడా అసామాన్యులుగా ఎదగవచ్చు; అద్భుతాలు సాధించవచ్చు. భగవత్ప్రసాదితాలైన ప్రతిభా వ్యుత్పత్తులను ఆవేశాలకు అర్పితం కాకుండా, పరిపూర్ణంగా ఫలప్రదం చేసుకోవచ్చు. అందరికీ ఆదర్శంగా జీవించవచ్చు. ఇదే మాతృశ్రీ తరిగొండ వెంగమాంబగారి వ్యక్తిత్వంనుంచి మనం గ్రహించవలసిన అమూల్యమైన ఆదర్శం. ఆ ఆదర్శాన్ని అనుసరించి జీవించడమే మనం ఆ మహామనీషికి ఈనాడు అర్పించవలసిన నీరాజనం!

# శ్రీతరిగొండ వెంగమాంబ ప్రబోధించిన వేదాంతం

--డా॥ సముద్రాల లక్ష్మణయ్య

తిరుమల క్షేత్రంలో అతిప్రాచీనకాలాన ఎందరో మహర్షులు తపస్సు చేసినట్లు పురాణవాఙ్మయమునుండి తెలుస్తున్నది. ఆ కాలంలోనే కాక, చరిత్రకందిన ఇటీవలి కాలంలోకూడ తిరుమలలో మహనీయు లనేకులు తపోదీక్షాపరులై ఉండినట్లు స్పష్టమే. పదకవితాపితామహుడైన తాళ్లపాక అన్నమాచార్యులు, హత్తీరాం బావాజీ, తరిగొండ వెంగమాంబ, మలయాళస్వామి- వీరందరు క్రీ.శ. 15వ శతాబ్దికి తరువాతివారే. అందరూ వేంకటాచలపతి పరమానుగ్రహమునకు పాత్రులైనవారే. భగవదనుభవమును పొందినవారే.

అన్నమయ్య సృష్టించిన సంకీర్తన సారస్వతం సుప్రసిద్ధమే. అది వేదాలకు మారు రూపంగా వెలుగొందింది. భక్తాగ్రగణ్యురాలైన వెంగమాంబ కూడ విశాలమైన సారస్వతాన్ని సృష్టించింది. అందులో వేదాంత తత్త్వాన్ని విస్తరించి చెప్పింది. ఆమె మొత్తం పదునెనిమిది గ్రంథాలు వ్రాసినదనీ, అందులో కొన్ని లుప్తమైపోయాయనీ పరిశోధకుల అభిప్రాయం.

వివిధప్రక్రియలలో ఆమె రచించిన గ్రంథాలలో శ్రీవేంకటాచలమాహాత్మ్యం, వాసిష్ఠరామాయణం మున్నగునవి ప్రసిద్ధిపొందాయి. ఆమె రచించిన యక్షగానాలలో కూడ సందర్భానుసారంగా వేదాంతార్థాలు గోచరిస్తాయి.

వేదతత్త్వాన్ని వివరించడానికే పురాణేతిహాస కావ్యాది వాఙ్మయం ఆవిర్భవించిందని సంప్రదాయజ్ఞు లంటారు. కథలలో కూడ వేదాంత తత్త్వాన్ని విశ్లేషించి వివరించేవారున్నారు. ఉదాహరణకు సీత జీవాత్ముడనీ, శ్రీరాముడు పరమాత్ముడనీ, విడిపోయిన వారిరువురినీ కలిపే ఆచార్యుడుగా అంజనాతనయుడు తనవంతు కర్తవ్యం నేరవేర్చాడనీ ప్రతిపాదిస్తారు. అట్లే, కురుక్షేత్రం హృదయమని, పాండవులు సద్గుణాలకూ, కౌరవులు దుర్గుణాలకూ ప్రతిరూపాలనీ, చివరకు మంచే జయిస్తుందనీ మహాభారత తత్త్వాన్ని విడమరచి చెప్పిన విబుధ్ధులూ ఉన్నారు. ఇక, భాగవతములో వేదాంతార్థాలకు కొదువ లేదు. అందలి కథలు విజ్ఞాన

వైరాగ్య వివక్షతోనే చెప్పబడినాయనీ, వాగ్వైభవం ముఖ్యం కాదనీ భాగవతమే చెప్పింది.

అందుచేత సారస్వతంలో వేదాంత తత్త్వముయొక్క స్థానం ఎంతో మహనీయమైనది. అట్టి తత్త్వాన్ని వెంగమాంబ రచనలలో మనం అడుగడుగునా గ్రహించవచ్చు. ఆమె మహాభక్తురాలు. భక్తిపరాకాష్ఠకు వస్తే జ్ఞానంగా పరిణమిస్తుంది. ఈ భక్తి, జ్ఞానాల సమన్వయం వెంగమాంబలో పరిపూర్ణంగా నెలకొనివున్నది.

బాల్యంలోనే వైధవ్యం పొందిన ఈ మహాసాధ్వి సాంసారిక ప్రవృత్తికి దూరమై ఆధ్యాత్మిక మార్గంలో అడుగుపెట్టింది. మదనపల్లికి చెందిన శ్రీసుబ్రహ్మణ్యస్వామి అనే గురువువద్ద వేదాంతతత్త్వాన్ని ఆకళించుకొన్నది. తన వేదాంత విజ్ఞానాన్ని రచనలలో పుష్కలంగా నిబద్ధం చేసింది. నాటికి ఇతరకవు లెవ్వరూ స్మరించని అన్నమాచార్యులవారిని ఈమె పేర్కొనడంవల్ల, ఈమెకు ఆయన పద సారస్వతంతో పరిచయమున్నట్లు అవగతమవుతున్నది.

20వ శతాబ్దం ప్రథమపాదంలో గోగర్భగుహలో తపస్సు చేసిన శ్రీమలయాళస్వాములవారు 'శుష్కవేదాంత తమోభాస్కరము', 'బాలయోగిని'- మున్నగు రచనలలో ఈమెను పలుమార్లు స్మరించియున్నారు. ఆమె భక్తివల్ల తృప్తినొందక, జ్ఞానమును ప్రసాదించవలెనని శ్రీవేంకటేశ్వరస్వామిని కోరినట్లును, భగవద్భక్తి వలననే ఆమె జ్ఞానమును పొందినట్లునూ శ్రీస్వాములవారు తెలిపి వున్నారు.

పోతనామాత్యుడు భాగవతరచనా కర్తృత్వమును తనమీద వేసికొనక, 'పలికించెడువాడు రామభద్రుండట' అని చెప్పుకొన్నాడు. అన్నమాచార్యులవారు కూడ తన నాలికపై నిలిచి భగవంతుడే నానా సంకీర్తనలు పలికించినాడని చెప్పినాడు. వెంగమాంబకూడ శ్రీతరిగొండ నారసింహదేవుడు ఆనతి యిచ్చినట్లు తాను పలుకుతున్నానని, తనలో సామర్థ్యమేమీ లేదని చెప్పుకొన్నది.

"చేరి తరిగొండపుర నారసింహదేవుఁ
డానతిచ్చిన రీతిగ నేనిమిత్త
మాత్రమై పల్కుదున్ స్వసామర్థ్యమిప్పు
డరసి చూచినఁగాని నాయందు లేదు."

(వేంకటాచల మాహాత్మ్యము 1-21)

అంతేకాదు; వీణను గాయకుడు పలికించినట్లు పురుషోత్తముడు తన జిహ్వపైవసించి పలికించిన రీతిగా భాగవతం ద్విపదకావ్యంగా పలుకుతున్నానని ఆమె చెప్పుకొన్నది. దయాశతకకర్త శ్రీవేదాంతదేశికులవారు ఈ రీతిగానే పూర్వం చెప్పుకొని తన భక్తి వినయాతిశయమును ప్రకటించుకొన్నారు. ఇది వేదాంత విజ్ఞతకు పరాకాష్ఠ. వేదాంతతత్త్వం తెలిసినవాడు తనపై కర్తృత్వం వేసుకోడు.

"అహంకార విమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే" (3-27)

అని గీతలో చెప్పినట్లు మూఢాత్ముడే కర్మ కర్తృత్వం వహిస్తాడు. వెంగమాంబ సిద్ధాంతరూపంలోనేకాక, నిజజీవితంలోకూడ వేదాంతాన్ని ప్రయోగాత్మకంగా పాటించిందని ఆమె మాటల నుంచి గ్రహించవచ్చు.

వేదాంతప్రబోధం శిష్యుడు గురువుద్వారా గ్రహించాలి. అజ్ఞానాంధకారాన్ని తొలగించే భాస్కరుడే గురువు. ఈ గురుశిష్య సంబంధాన్ని వెంగమాంబ సుప్రసిద్ధమైన 'నారాయణశతకం'లో ఇలా పేర్కొన్నది. -

"వేదాంతవేదియైన-సద్గురుని-పాదపద్మముల చెంది,
ఆ దయానిధి కరుణచే-సద్బోధ-మందవలె నారాయణా!॥

ఏ విద్యకైన- గురువు లేకున్న-ఆ విద్య పట్టువడదు.
కావునను అభ్యాసికి-గురుశిక్ష-కావలెను నారాయణా!॥"

అని ఆమె గురువుద్వారా వేదాంతాన్ని అభ్యసించవలెనని నొక్కి వక్కాణించింది. గురువు ఎలా వుండాలి? అని వివరిస్తూ-

"నిరపేక్షకుడు సదయుడు-వేదాంత-నిపుణుడౌ నాచార్యుడు
దొరకు టపురూప, మపుడు-గురుతైన గురి యొప్పు నారాయణా!॥
అట్టి సద్గురుని వెదకి దర్శించి-ఆ మహాత్ముని పదములు
పట్టి కృతకృత్యు డౌను సాధకుడు-గట్టిగా నారాయణా!"

అని చెప్పి శిష్యుని కవసరమైన సాధన చతుష్టయ సంపత్తిని కూడ ఆమె-

'మొగి సాధనములు నాల్గు గల నరుఁడు ముఖ్యాధికారి యగును'

అని వివరించింది.

జరాయుజములు, అండజములు, స్వేదజములు ఉద్భిజ్జములు అని ప్రాణులు నాలుగు రకాలు. అందులో జరాయుజ జాతికి చెందిన మానవుడు శ్రేష్ఠుడు. అందువల్ల, మానవ జన్మమును వేదాంత విజ్ఞాన సమపార్జనతో సఫలం చేసుకోవాలి. ఈ విషయాన్నే ఆమె ఇలా చెప్పింది-

"ఈ చతుర్విధ భూతములందు కడు-హెచ్చు మానవజన్మము
నీచమని చూడరాదు తథ్యమీ-నిర్ణయము నారాయణా!॥

ఈ రీతిగా వేదాంతతత్త్వాన్ని వివరిస్తూ ఆమె సమకూర్చిన నారాయణ శతకం అనన్య సామాన్యమైన ప్రచారం పొందింది. అందులో సచ్చిదానంద స్వరూపమైన పరతత్త్వాన్ని కూడ వివరించింది.

ఆత్మజ్ఞానం కలిగిన తరువాత అట్టివానికి పాప మంటదనీ, అతడు ఏమి చేసినా పరవాలేదనీ శుష్కవేదాంతులు చెప్పే మాట. ఈ అభిప్రాయాన్ని శ్రీమలయాళ స్వాములవారు తమ 'శుష్కవేదాంత తమోభాస్కరం'లో నిశితంగా ఖండించారు. వెంగమాంబ కూడ సద్గురునివద్ద శిష్యత్వం వహించి జ్ఞానియైన తరువాత, పాప కార్యాలు చేయరాదని వేంకటాచలమాహాత్మ్యంలో ఖచ్చితంగా చెప్పింది-

"ఎన్ని పాపము లొనరించి యున్నఁగాని
సద్గురుని చేరి శరణన్న సమయమందె
భూరిదురితము నశియించి పోవు, గురుని
శిష్యుఁడై పాపమావల చేయరాదు."

(వేంక.మాహా. 3-71)

ఈ ప్రబోధము నిజంగా మిక్కిలి శ్రేష్ఠమైనది. తెలియక చేసిన తప్పులను గురుడు పరిహరిస్తాడు. తెలిసి చేసిన తప్పులను ఆయన నిగ్రహించలేడు. పైగా ఆ పాపాలు గురునికే అన్వయిస్తాయి- అని కూడ ఆమె వివరించింది.

ఆమె అనుష్ఠాన వేదాంతి అనడానికి ఎన్నో నిదర్శనా లున్నాయి. లోకంలో సామాన్య మానవులు పొగిడితే పొంగిపోతారు. తెగిడితే క్రుంగిపోతారు. కాని తత్త్వజ్ఞుడైనవాడు స్తుతి నిందలను, మానావమానములను సమానంగా చూస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి.

"తుల్యనిన్దాస్తుతి ర్మౌనీ" (భ.గీ. 12-19)

"మానావమానయో స్తుల్యః" (భ.గీ. 14-25) అని భగవద్గీత స్తుతినిందల పట్ల, మానావమానములట్ల తత్త్వజ్ఞుడు సమంగా ఉంటాడని చెప్పింది. వెంగమాంబ ఈ ఉత్తమస్థితిని అందుకొన్నది- అనుటకు ఆమె జీవిత చరిత్ర నిదర్శనము. ఆమె ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొన్నది. లోకనిందకు గురియైంది. అయినా చలించకుండా తన స్థితిలో తాను ఉండిపోయింది. ఈ విషయాన్ని తన రచనలలో తెలియపరచింది కూడా. ఈ క్రింది పాటను గమనించండి-

"చెడుదంటే నేమి? మంచిది అంటే నేమి?
తడబడుచును నీవు నింత తపియించే దేమి?
దేహము జూచి నిందించితేనేమి?
దేహి నెవ్వరు చూచి తిట్టిరి భూమి?

సాహసికులకు నీకు సంవాదమేమి?
సాహాయ్యుడీస్వామి సర్వాంతర్యామి ॥చెడు॥

చిత్తమా నిన్ను చూచిన వారున్నారా?
చిత్తు లక్షణము లక్షించి కన్నారా?
సత్తు అసత్తుల విచారించినారా,?
ఉత్తమాటల కింత ఉలికేది మేరా ॥చెడు॥

దూషణంబుల విని దుఃఖించేవేలా?
భూషణంబులఁ గని పొంగెదవె బేలా!
ద్వేషులే హితులని తెలియవే బాలా!
రోషము త్రుంచి పోరుట మాను మబలా! ॥చెడు॥

ఆశకన్నా శత్రు వవనిలో లేదు
క్లేశమూలము దాని గెలువగారాదు,
నా శత్రువీ యాశ నను వీడలేదు
శ్రీశుడే దాని శిక్షింపక పోదు" ॥చెడు॥

పై పాటలో ఆమె సాధనదశలో అనుభవించిన అంతర్మథనం కూడా వ్యక్తమవుతున్నది. సిద్ధదశకు వచ్చిన తరువాత ఆమె సంపూర్ణంగా స్థితప్రజ్ఞు రాలయింది. తన్ను తర్జించిన పుష్పగిరి పీఠాధిపతులపై ద్వేషము వహింపక ఆ సాధ్వీమతల్లి శంకరాచార్యగురుని సన్నుతింపరే- అని తనయొక్క ఉదాత్తతను వెల్లడించింది.

ఆమె మహాభక్తురాలయినా కూడా తనది అద్వైత సంప్రదాయమని కంఠోక్తిగా చెప్పింది. 'శివనాటకం'లో :

"ధరవెలయు నద్వైత పరమై ప్రకాశించి
గురుతరంబైన మాకులము గురుకులమే' అని చెప్పుకొన్నది.

'ఏకం సత్ విప్రా బహుధా వదన్తి'- అని వేదవచనం. ఉన్న సత్యతత్త్వం ఒక్కటే. దానిని వేదాంతులు నానావిధాల ప్రతిపాదిస్తారు. భిన్నత్వంలో ఏకత్వం చూస్తారు. కాని, శివకేశవ భేదాలు భక్తులలో విజృంభించిన సందర్భాలు లేక పోలేదు. శివుడే గొప్ప, లేదా కేశవుడే గొప్ప- అని తగవులాడుకొన్న భక్తులున్నారు. ద్వైతులు, అద్వైతులు, విశిష్టాద్వైతులు పరస్పరం నిందించుకుంటూ గ్రంథాలు కూడా వ్రాశారు. కాని వెంగమాంబకు ఈ జాడ్యం అంటలేదు. ఆమె శివకేశవులను అభిన్నంగానే చూచింది.

"జలజాక్ష నీవును శర్వాణి విభుదు
బలవంతు లానంద భరితు లన్నిటను,
ఒక్కరొక్కరికన్న నుత్తమోత్తములు
తక్కక మీకు భేదములేదు గనుక"

అని రమాపరిణయంలో వ్రాసినది.

"శివుడంటే నేమి? కేశవుడంటే నేమి?
శివకేశవుల చిత్తస్థితి భేదమేమి?

ఆ మహాదేవుడే అచ్యుతుడాయె,
శ్రీమహావిష్ణువే శివరూపమాయె,
ఈ మహాతత్త్వార్థమిది నిత్యమాయె.
సోముడు నరసింహనాము దతడాయె."

అని ఒక తత్త్వకీర్తనలో కంఠోక్తిగా శివకేశవుల అభేదాన్ని ప్రకటించింది.

శ్రీవేంకటాచల మాహాత్మ్యంలో ఆమె వ్రాసిన ఈ క్రింది పద్యం ఆమెకు గల తత్త్వపరిజ్ఞానాన్నీ, అభేద భావాన్నీ స్పష్టంగా వ్యక్తం చేస్తున్నది.

"ధీరమతుల్ వాసుదేవుని విజ్ఞాన
సురుచిర భక్తుల చూడఁగాను

ఉపనిషత్తులు చెప్పుచో స్మార్త లాహారిం
జిత్స్వరూపముగ లక్షింపగాను
ద్వైతవాదులును భేదశ్రుతిసారమీ
దేవోత్తముండని తెలుపగాను
మొనసి వేదాంతంబు లొనరగా చదువు వై
ష్ణవులు మాధవభక్తి సలుపఁగాను
చెలఁగి హరికీర్తనల్ కవుల్ సెప్పఁగాను
పండితులు విని శ్లాఘించుచుండఁగాను,
బ్రాహ్మణస్త్రీలు పాటలు పాడి హరికి
నెయ్యమున మంగళారతు లియ్యఁగాను" (2-130)

దీనిని బట్టి వెంగమాంబకు ద్వైతాద్వైతాది సమస్త వేదాంతాల సారం గోచరించిందని నిస్సంశయంగా చెప్పవచ్చు. 'రాజయోగసారం' అనే గ్రంథంలో ఆమె చక్కగా అద్వైతభావాలను నిరూపించింది. బంగారు ఒక్కటే, ఆ భరణాలు పలువిధాలు. మట్టి ఒక్కటే, కుండలు పలురకాలు. బ్రహ్మం ఒక్కటే, ప్రపంచం బహుముఖం. ఉపనిషత్తులలో ఈ తత్త్వం విస్తృతంగా నిరూపించబడింది.

"బంగారమొకటియె బహుభూషణములు
శృంగారముల చేత చిత్రంబులైన
హేమరూపంబు లెన్నగ వేరులైన
హేమంబునకు భేదమెందైన గలదె?"

రజ్జుసర్ప భ్రాంతి, మరుమరీచికా భ్రాంతి- ఇత్యాదులు వేదాంతశాస్త్రంలో ఎక్కువగా ప్రస్తావించబడుతాయి. ఈ విషయా లన్నింటినీ గ్రహించిన వెంగమాంబ తన రచనలలో ఎడనెడా వేదాంతార్థాలను బోధించింది.

భాగవతాన్ని ద్విపదకావ్యంగా వ్రాసేటప్పుడు అందలి తత్త్వార్థములను పామరులకు తెలియపరచటానికే తా నారచన చేసినట్లు చెప్పింది.

వేదాంత శాస్త్రములో తాను చేసే కర్మలను భగవత్పరం చేయాలి- అని చెబుతారు.

"మత్కర్మకృ న్మత్పరమో మద్భక్తః సంగవర్జితః" అని భగవద్గీత (11-55)

రాజయోగసారంలో వెంగమాంబ ఈ విషయాన్నే ఇలా చెప్పింది-

**"తను తానె వెదకుచు తన మనంబునను**
**పనిపూని ఈశ్వరార్పణము చేయుచును**
**విగత సంకల్పుండై విహితకర్మముల**
**తగ సల్పుచును భూతదయగలవాడు."**

అన్నింటినీ మించి, వెంగమాంబ ద్విపదలో అనువదించిన యోగవాసిష్ఠం మహోత్కృష్టమైన రచన. యోగవాసిష్ఠం సంస్కృతంలో 32,000 శ్లోకాలు గల గ్రంథం. వసిష్ఠుడు రామచంద్రునికి చేసిన బోధ ఇది. దీనికి సంక్షిప్తంగా వచ్చిన అనువాద రచనలు చాలా వున్నాయి. ఇది అద్వైత వేదాంత ప్రతిపాదకమైన గ్రంథం. దీని నామె అతిసంగ్రహంగా, చక్కని రచనా సౌందర్యంతో ద్విపదలలో నిబంధించింది. బంధం సంకల్పం వల్ల కలుగుతుందనీ, సంకల్పం లేకుంటే ముక్తి లభిస్తుందనీ, చిత్పురుషుడు ఒక్కడే ఉన్నాడనీ యోగవాసిష్ఠం చెబుతున్నది:

**"అవిచ్ఛిన్నచిదాత్మైకః**
**పుమానస్తీహ నేతరత్,**
**సంకల్పాజ్జాయతే బంధః**
**నిస్సంకల్పో విముచ్యతే."**

దీనికి వెంగమ్మ చేసిన అనువాద మిది-

**సులలిత చిత్పురుషుం డొక్కరుండు**
**దక్క నన్యము లేదు తత్త్వార్థ మింత**

నిక్కంబు నీవు దీనికి సంశయింప
వల దాత్మసంకల్పవాంఛ బంధంబు
వెలయు సంకల్పంబు విడుచుటే ముక్తి."

తనకు తెలిసిన వేదాంత తత్త్వాన్ని పామరజనులకుకూడా అర్థమయ్యే విధంగా పద్యాలలో, పాటలలో, ద్విపదలలో, యక్షగానాలలో ఇమిడ్చి లోకాని కందించిన వెంగమాంబ ధన్యజన్మురాలు. తెలుగు కవయిత్రులలో తొలిసారిగా అద్భుతంగా కవిత వ్రాసిన ఘనత ఆమెదే. ఆ కవితను ఏ కథలకో పరిమితం చేయక, భక్తిని, జ్ఞానాన్ని, పరమార్థాన్ని లోకానికి తెలియచెప్పటానికై వినియోగించి తరిగొండ వెంగమాంబ ఆంధ్రవాఙ్మయ చరిత్రలో శాశ్వతస్థానం సంపాదించు కొన్నది.

మరుగున పడిన ఆమె రచనలన్నీ వెలుగుచూచి త్వరలో లోకమంతటా వ్యాపించే శుభసమయ మాసన్నమగుగాక!

# మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సాహిత్య సదస్సు

-- శ్రీ సింగరాజు సచ్చిదానందం

సహృదయ వరేణ్యులారా! సాహితీరసజ్ఞ శేఖరులారా!

తిరుమల తిరుపతి దేవస్థానము యాజమాన్యము వారి యాదరముతో, శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యాశీస్సులతో శ్రీవేంకటేశ్వర ఉద్యోగుల శిక్షణ (శ్వేత) సంస్థ ఆధ్వర్యంలో భక్తకవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సాహిత్యమును గూర్చిన పరిశోధనాత్మకమగు జాతీయసదస్సును నిర్వహించుటకు ప్రేరకుడగు ప్రత్యక్షదైవము, తిరుమలనాయకుడగు శ్రీవేంకటేశ్వరస్వామికి తొల్త నా నమస్కారము లర్పిస్తున్నాను. ఈ సదస్సును రెండు దినములు శ్వేత ఆధ్వర్యములో నిర్వహించుటకు ఆమోదమును తెల్పిన తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి అధ్యక్షుడు చిరంజీవి భూమన కరుణాకరరెడ్డిగారినీ, శ్రీ కార్యనిర్వాహకులు శ్రీ ఏ.పి.వి.యన్. శర్మగారినీ, సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ జి. బలరామయ్యగారినీ అభినందిస్తున్నాను. ఈ భక్తిసాహితీ సదస్సు నిర్వహణమునకై ఒక చక్కని ప్రాతి పదికను తీర్చిదిద్దిన శ్వేత సంచాలకుడు ఆత్మీయమిత్ర సోదరుడు శ్రీ భూమన సుబ్రహ్మణ్యంరెడ్డిగారి దీక్షాదక్షతను సంభావిస్తున్నాను.

స్వామిని సర్వాత్మనా భక్తితత్త్వముతో సేవించి, కావ్యములు రచించి, నాటి సమాజము నందలి ఆటుపోట్లను ఎదుర్కొని, కొండ కోనలలో తప మాచరించి సిద్ధినందిన తల్లి మాతృశ్రీ తరిగొండ వెంగమ సాహిత్యమును సమీచీనముగా పరిశీలించి చర్చించుటకై దాదాపు రెండువందల ఏండ్లకు ఈ సదస్సును నిర్వహించుట, అందు మనము పాల్గొనుట మన యదృష్టవిశేషముగా నేను భావిస్తున్నాను.

ఈ సందర్భమున మహాయోగిని తరిగొండ తల్లి జీవిత విశేషములను, ఆమె కవితాకుసుమసౌరభమును సమగ్రముగ పరిశీలించి పరిశోధన గావించి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయమునుండి పిహెచ్.డి., పట్టానుపొందుటయే గాక

పరిశోధన విషయమును గ్రంథముగా ప్రకటించి, తెనుగున కావ్యసృష్టిలో వివిధ ప్రక్రియలను ప్రదర్శించిన ఆ మాతృమూర్తి రచనాశక్తిని కొండాడిన డా॥ కరణం జూలకంటి కృష్ణమూర్తిని విశ్రాంతాంధ్రభాషాచార్యుని అభినందిస్తున్నాను. వెంగమాంబ పదకవితామహుని అనుసరించి కృతులు వ్రాసినారు, ఆయన ఇల్లాలు తిరుమలాంబ(తిమ్మక్క) సుభద్రా పరిణయమువలె రమాపరిణయమును రచించినది. బహుపురాణ సముచ్చయముగా వేంకటాచల మాహాత్మ్యమును రచించినది. యక్షగానములను, చెంచునాటకమును, వీథినాటకముగా ప్రదర్శన యోగ్యముగా రచించినారు. అధ్యాత్మతత్త్వ గీతములను, యోగవాశిష్ఠాది కావ్యములనూ రచించినారు. ఆనాడు తిరుమల స్వామిని దర్శించిన పిమ్మట ఆమె దర్శనము కానిదే భక్తులు తిరుమల దిగువారు కారంటే ఆ తల్లి మహత్త్వమెట్టిదో మనము ఊహించుకోవలసియున్నది. ఆ దినములలో సాంఘికముగా ఆమెను బాధించిన తామే ఆచారవిదుల మనుకొన్నవారిని తలచుకొన్న, వేమనగారి "ఆత్మశుద్ధిలేని యాచారమడి యేల? నన్న పద్యము తలపున కొస్తున్నది.

ఇక, నేటి ఈ సదస్సులో మాతృశ్రీ వెంగమాంబను గూర్చి మాటాడబోవు వారిలో డా॥ వేదాంతం రాజగోపాలచక్రవర్తిగారు వైభానసాగమములను ఆపోశనముపట్టిన అగస్త్యుడంటే అతిశయోక్తి కాదు– తరువాత డా॥ ఆర్ అనంత పద్మనాభరావుగారు స్వయముగ అష్టావధాని, విమర్శకులు. ఇక డా॥ భాస్కర సాయికృష్ణ యాచేంద్రులు సంగీతగేయధారస్రష్ట." స్వయముగా వాగ్గేయకారులు.

నా కీ యవకాశమును కల్గించి, ఈ త్రిమూర్తుల సాహితీసదస్సున కాధ్యక్ష్యము వహింపజేసిన ఆత్మీయమిత్ర సోదరుడు డా॥ భూమన సుబ్రహ్మణ్యంరెడ్డి గారికి నా కృతాజ్ఞతాంజలులు; సెలవు.

# దాక్షిణాత్య భక్త కవయిత్రులు

## ఆండాళ్ - వెంగమాంబ

-- శ్రీమాన్ పి.ఆర్. రంగరాజన్

భూదేవియొక్క అంశముగా "శ్రీవిల్లిపుత్తూర్"లో "పెరియాళ్వార్" (విష్ణుచిత్తుని) కుమారితగా, అయోనిజగా ఆండాళ్ అవతరించినారు. తులసి ఏ విధంగా అయితే అణువణువునా సువాసన కలిగి వుంటుందో, ఆ విధంగా ఆండాళ్ చిన్నతనమునుండియే భగవద్భక్తితో ఉండినారు. శ్రీవైష్ణవ సంప్రదాయంలో శ్రీ వైష్ణవ ఆచార్యులు ఏకగ్రీవంగా చెప్పే మాట ఒకటి వుంది. ఒక వ్యక్తియొక్క మహిమను వర్ణించినపుడు ఆ వ్యక్తియొక్క భగవత్ సంబంధాన్ని తెలియపరచడం వాళ్ళ అలవాటు. యామునాచార్యులవారు నాథముని అనే వైష్ణవ ఆచార్యులను వర్ణించినపుడు భగవంతునియందు అతనికి వున్నటువంటి భగవద్భక్తిని గుర్తించే విధంగా "అగాధ భగవద్భక్తి సింధవే" అని పేర్కొంటున్నారు. ఆండాళ్ శ్రీమహా విష్ణువుయొక్క దివ్యపత్ని కనుక, ఆమెకు భగవంతునియందు స్వభావంగానే ప్రేమాతిశయం వుంటుంది.

"అత్యన్త భక్తియుక్తానాం నైవ శాస్త్రమ్ నచ క్రమః" (అత్యంత భక్తి గలిగిన వారికి శాస్త్రము, క్రమపద్ధతి అంటూ వుండదు) అన్నట్టు మనుష్య జన్మను పొందిన ఆండాళ్ భగవంతుణ్ణి వివాహం చేసుకోవడానికి తగిన ఉపాయములను అనుష్ఠించినది.

ఆండాళ్ శ్రీమత్ భాగవతంలో పదకొండవ స్కంధములో ఉన్నటువంటి ఒక వృత్తాంతమును తెలుసుకొన్నారు. రాసక్రీడ అయిన తర్వాత శ్రీకృష్ణుడు గోపికా స్త్రీలకు కనుమరుగైనాడు. శ్రీ కృష్ణుణ్ణి చూడకుండా దుఃఖించిన గోపికాస్త్రీలు శ్రీకృష్ణ సందర్శనంకొరకు హేమంతఋతువులో ధనుర్మాసంలో "కాత్యాయనీ వ్రతం" అనుష్ఠించి శ్రీకృష్ణ సాక్షాత్కారమును పొందినారు. ఇదే విధంగా ఆండాళ్ హేమంతఋతువుయొక్క మొదటి మాసమైన ధనుర్మాసంలో "పావై" నోమును అనుకారపద్ధతి ద్వారా నోచినది. దూడతో కూడిన ఆవు తన దూడకు పాలిచ్చినట్లు,

అదే విధంగా ఆవు కసవుదూడను చూస్తూ పాలను ఇచ్చినట్లు, గోపికాస్త్రీలను అనుగ్రహించిన శ్రీకృష్ణుడు మనుష్య జన్మలో వుండే ఆండాళ్‌ను అనుగ్రహించడం- కసవు దూడను చూస్తూ పాలిచ్చినట్లు- అని శ్రీవైష్ణవ ఆచార్యులు పేర్కొంటారు.

ఆండాళ్ "పావై" నోమును పూర్తి చేసి, శ్రీరంగనాథుని దివ్య ఆస్థానంలో, గర్భ గృహంలో స్వామితో కలిసిపోయారు- అని ఆమె చరితం తెలియజేస్తుంది.

శ్రియః పతి అయిన సర్వేశ్వరుని దివ్యానుగ్రహంతో దివ్య జ్ఞానాన్ని పొందిన వారు ఆళ్వార్లు. భగవంతుని నిర్హేతుక కృపావిశేషమువలన జ్ఞానవికాసాన్ని పొందినవారు ఆళ్వార్లు. వాళ్ళందరికి అభిమాన పుత్రిలాగా ఆండాళ్ అవతరించినట్లుంది- అని చెప్తారు. శ్రీకృష్ణుడు గీతాశాస్త్రాన్ని ఉపదేశించినట్లు ఆండాళ్ ఉత్తమోత్తమమైన "తిరుప్పావై" అనే గొప్ప శాస్త్రాన్ని లోకానికి అందించి నారు. ఆండాళ్ వ్రాసిన "తిరుప్పావై"లో "పరతత్త్వం" శ్రీమన్నారాయణుడు అని, అతని దివ్య చరణారవిందాన్ని ఆశ్రయించడం మన కర్తవ్యమని, భక్తి ద్వారా, లేదా ప్రపత్తి (శరణాగతి) ద్వారా అతణ్ణి మనం పొందవచ్చని తిరుప్పావైలో పేర్కొన్నారు. నరసింహ, వామన, రామ, కృష్ణ, అవతారాలను తమ పద్యములలో ఆండాళ్ కీర్తించినారు. "తిరుప్పావై" మాదిరి గల మరో దివ్య ప్రబంధమైన "నాచ్చియార్ తిరుమొళి" అనే దివ్య ప్రబంధాన్ని ఆండాళ్ రచించారు.

"పద్మావతీ కళ్యాణం" జరిగే ముందుగా దేవతలు, మహర్షులు తిరుమల చేరారు. వాళ్లకు ఆహారం సిద్ధమైనది. బ్రహ్మదేవుడు వేంకటేశ్వరుని ఎదురుగా వచ్చి 'అందరికి వడ్డించవచ్చా?' అని అడిగినాడు. అప్పుడు వేంకటేశ్వరస్వామి 'భగవంతునికి నైవేద్యమైనదా?' అని అడిగారు. బ్రహ్మదేవుడు దానిని విని ఆశ్చర్య చకితుడైనాడు. వేంకటేశ్వరస్వామి బ్రహ్మదేవుని చూసి 'నేను క్షత్రియకులంలో అవతరించివున్నాను. ఈ జన్మలో నాకు కులదైవం అహోబలనరసింహస్వామి. అతనికి నైవేద్యం చేసి అందరికి వడ్డించండి' అని చెప్పారు.

"అహోబల నృసింహస్య పూజాం కృత్వా నివేదయ"- అని అన్నారు.

ఈ వృత్తాంతం భవిష్యోత్తర పురాణంలో వున్నది. ఆండాళ్ కూడ తమ పాశురం (పద్యం) ద్వారా నరసింహ భక్తిని ప్రకటించినారు.

"అరిముగన్ అచ్యుతన్ కైమేల్ యెన్కైవైత్తు" అని ఒక పాశురం (నాచ్చియార్ తిరుమొళి) చెబుతున్నారు. అనగా, ఒక రోజు ఆండాళ్ కల గన్నారు. ఆ కలలో నరసింహస్వామి పెళ్ళికొడుకుగా వచ్చి, పెళ్ళికూతురుగా వుండే తన చేతిని పట్టుకొని బొరుగులతో హోమం చేసినట్లు పేర్కొన్నారు. దీని వలన నరసింహస్వామియందు ఆండాళ్కున్న భక్తి గోచరమవుతున్నది. తిరుప్పావైలో గోపికా స్త్రీగా మారిన ఆండాళ్ శ్రీకృష్ణుని దర్శించిన తరువాత, శ్రీకృష్ణుడు నరసింహస్వామివలె వున్నట్టు ఒక పాశురంలో పేర్కొంటున్నారు. ఆ పాశురంలో 'వర్షాకాలంనందు కొండ గుహలలో శయనించిన శౌర్యము గల సింహము తెల్లవారినదని తెలుసుకొని, నిద్రనుండి మేల్కొని ఉగ్రముగా చూచి, లేచి వచ్చినట్లు కృష్ణా! నువ్వు ఇక్కడనుండి లేచి ఎదురుగా కనపడే సింహాసనములో కూర్చొనవలయును'- అని పేర్కొంటున్నారు.

తరిగొండ వెంగమాంబ కూడా నరసింహస్వామి యందలి భక్తితో వ్రాసిన పద్యములు ఎన్నో! తరిగొండ నరసింహస్వామి మీద ఆమె వ్రాసిన పద్యములు భక్తులకు మనోరంజకముగా, హృదయాకర్షకముగా వున్నవి అనుటలో సందేహం లేదు. తరిగొండ నరసింహ స్వామికి, ఆచార్యులకు అభేధమును ప్రకటిస్తూ వెంగమాంబ వ్రాసిన పద్యాన్ని చూద్దాం:

**"గురునకు నీ కభేదములు కోరి పఠించితి నంచుఁ జిత్తమం**
**దరయఁ గఁ గోపమున్ వలదు; అంబుజబాంధవ, సోమనేత్ర! నీ**
**కరుణను నిన్ను నేఁడు పొడఁగాంచితి నిం కనుమాన మేల? మ**
**ద్గురుఁడవు నీవె కావె? తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!"**

ఆండాళ్ "నాచ్చియార్ తిరుమొళి" అనే ప్రబంధంలో ఇలా పేర్కొంటున్నారు: 'నన్ను వేంకటేశ్వర స్వామికి అప్పగించండి'- అని ఆమె అంటుంది. అంటే ఆమెకు

వేంకటేశ్వరస్వామియందు అంత భక్తి. మరోచోట తమ స్నేహితురాళ్లతో ఇసుకలో ఆడినప్పుడు 'వేంకటేశ్వరస్వామిని చేరాలి'- అని ప్రార్థిస్తున్నారు.

ఆండాళ్ లాగ తరిగొండ వెంగమాంబ కూడా తిరుమలలో వుండే జల పాతమైన తుంబురుకోనకు విచ్చేసిన వేంకటేశ్వర స్వామిని చెంచిత ద్వారా ఈ విధంగా వర్ణించినది:

> **"వినరన్న నేఁజూచు వేంకటేశ్వరుఁడు- మినమినమని చాల మెరిసేటి దేమొ**
>
> **ఘట్టిగా తలమీఁద గదియించి దాని-చుట్టు పూదండలు చుట్టుకున్నాఁడు**
>
> **............................................నా వేంకటేశ్వరుఁడు"**

అని చెంచునాటకము 15,16 పుటలలో చెప్పడం జరిగినది.

దాక్షిణాత్య భక్త కవయిత్రి వెంగమాంబ పద్యములు తెలుగు సాహిత్యంలో ఉన్నతమైన స్థానంలో వుంటూ అందరియొక్క మనస్సును ఆకర్షిస్తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయ మేమిటంటే తిరుమల కోవెలలో స్వామి వారికి ఉదయం ఆండాళ్ "తిరుప్పావై" పారాయణం జరుగుతుంది. రోజు రాత్రిపూట తరిగొండ వెంగమాంబ హారతితో పూజ పూర్తవడం గమనార్హం.

ఈ విధంగా ఈ యిరువురు దాక్షిణాత్య భక్తకవయిత్రులకు గల పోలికలు సంగ్రహంగా వెల్లడింపబడినాయి.

# భక్తనారి మీరాబాయి - భక్త కవయిత్రి తరిగొండ వెంగమాంబ

-- ఆచార్య కె.జె. కృష్ణమూర్తి

సాహితీప్రపంచంలో సుప్రసిద్ధులయిన ఇరువురు కవయిత్రీ శిరోమణుల జీవితచరిత్రలలోను, వాళ్ల రచనల్లోను సన్నిహితములైన పోలికలు గోచరించటం అరుదైన విషయమే అయినా, అపూర్వ విషయమేమీ కాదు. ఇద్దరు సారస్వత మూర్తుల నడుమ కానిపించే అలాంటి పోలికలకు ముఖ్యకారణం ఆ యిరువురి యొక్క సంస్కార విశేషమేనని నిశ్చయంగా చెప్పవచ్చు.

క్రీ.శ. పదహారవ శతాబ్దిలో రాజాస్థాన్‌లో విలసిల్లిన భక్తనారి మీరాబాయి, క్రీ.శ. పదునెనిమిది-పందొమ్మిది శతాబ్దుల్లో ఆంధ్రదేశంలో వర్ధిల్లిన కవితాతపస్విని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ- ఈ ఉభయులు అలాంటి సాదృశ్యం సహజంగా జతపడిన సారస్వతమూర్తులు.

ఈ యిరువురి జీవిత గాథల్లోను, కృతులయందూ కానవస్తున్న సన్నిహిత సామ్యాల్లో అత్యంత ముఖ్యమైనవాటిని ఆవిష్కరించటం ఈ పరిశోధనవ్యాసం యొక్క ప్రధానోద్దేశ్యం.

మీరాబాయి రాజపుటానాలోని మేవాడ్ రాజ్యానికి చెందిన మేరతా సంస్థానంలోని "కుటికీ"- అనే గ్రామంలో క్రీ.శ. 1504లో జన్మించింది. రాఠోర్ రాజపుత్ర వంశానికి చెందిన కమలారాణి, రావు రతన్ సింగ్ ఆమె తల్లిదండ్రులు. దైవభక్తి, ధార్మిక తత్పరత గల ఉత్తమ సంస్కార సంపన్నులు, ఆ దంపతుల ఏకైక పుత్రిక ఐన మీరాబాయికి శ్రీకృష్ణభక్తి మిగుల సహజంగా అలవడింది.

మీరా నాలుగైదేళ్ల వయస్సులో ఉండగా ఆమె జీవితంలో మరపురాని సంఘటన ఒకటి జరిగింది. పెండ్లి ఊరేగింపు వీథిలో వాళ్ల భవనంముందుగా వెళ్లుతూవుండింది. ఆ ఉత్సవాన్ని చూచి, బాలిక అదేమని తల్లిని ప్రశ్నించింది. తల్లి పెండ్లివేడుకనుగూర్చి, వధూవరులనుగురించి తగినట్లు క్లుప్తంగా కూతురికి వివరించింది. ఆ చిన్నారి అమాయకంగా 'నాకు ఎప్పుడు పెళ్లౌతుంది? నా

పెండ్లికుమారు డెవరు?'- అని అడిగింది. తల్లి గారాబంగా కూతురును దగ్గరకు తీసికొని, తమ భవనంలోని గిరిధరగోపాలమూర్తి విగ్రహాన్ని చూపించి, 'ఆయనయే నీ పెండ్లికొడుకు'- అని ఆప్యాయతతో, చిఱునవ్వుతో పల్కింది. తల్లి అలవోకగా అన్న ఆమాట బాల మీరా మనస్సుపై గాఢమైన ప్రభావాన్ని ముద్రింపజేసింది.

తల్లి అలా పల్కిన అనంతరం ఆ బాలిక తమ మందిరంలోని గిరిధర గోపాలుని విగ్రహంవద్దకు వెళ్లి, క్రొత్త పెండ్లికూతరులాగా మేలిముసుగు సవరించు కొంటూ, లజ్జతోకూడిన వినయాన్ని ప్రదర్శించింది. ఆమెలో అజ్ఞాతంగా ఉండిన మధుర ప్రణయభక్తిభావన ఆ విధంగా అంకురించి, ఆనాటినుండి క్రమక్రమంగా పెంపొందుతూ వచ్చింది.

ఇలా ఉండగా, మీరా తండ్రియైన రావ్‌రతన్‌సింగ్ మేవాడ్ రాజ్యాధీశుడైన సంగ్రామసింహుని పక్షాన బాబరుయొక్క మొగలాయిసేనలతో పోరాడుతూ వీరస్వర్గ మలంకరించాడు. అందువల్ల మీరాబాయి కుటికీ గ్రామాన్ని వీడి, మేరతాపట్టణంలో తాతగారైన రావుదూదాజీ యొక్క సంరక్షణలో పెరిగింది. తాతగారి హైందవధార్మిక దృక్పథం మీరాబాయి యొక్క భక్తిభావనకు మిక్కిలి దోహదకారి అయింది.

మీరా పదేళ్ల బాలికగా ఉన్నప్పుడు మాధవదాసు అనే సాధుపుంగవుడు శిష్య, పరివారసహితంగా రావు దూదాజీ గృహానికి వేంచేశాడు. ఆయనవద్ద గిరిధరగోపాలదేవుని అందమైన కంచువిగ్రహం ఉండేది. ఆ సాధుపుంగవుడు ఆ అర్చామూర్తికి ప్రతిదినం చక్కగా పూజలు నిర్వహించేవాడు. ఆ విగ్రహం బాలికయైన మీరాను అమితంగా ఆకర్షించింది. ఆ సాధువు కొన్నాళ్లకు అచ్చటి నుండి వెళ్లే ప్రయత్నంలో ఉండగా, ఆ విగ్రహం తనకు కావాలని పట్టుబట్టి మీరా మారాము చేసింది. మాధవదాసు ఆ విగ్రహాన్ని ఇవ్వటానికి నిరాకరించి, తన దారిన తాను వెళ్లిపోయాడు. మరల కొన్ని రోజులకు దూదాజీ యింటికి వచ్చాడు. 'గిరిధర గోపాలుడు తనకు కలలో కనిపించి, ఆ విగ్రహాన్ని మీరాకు

ఇవ్వవలసిందని తనను ఆజ్ఞాపించాడని చెప్పి, మీరాకు ఆ అందమైన కంచు విగ్రహాన్ని ఇచ్చి, ఆ బాలికను మనసారా దీవించి వెళ్లాడు.

అటు పిమ్మట కొంతకాలానికి మీరాబాయి తాతయైన దూదాజీ వృద్ధాప్యం కారణంగా పరమపదించాడు. ఆయన పెద్దకుమారుడూ, మీరాకు పెదతండ్రీ అయిన వీరమదేవు మేరతాపట్టణ పాలకు డయ్యాడు. అతడు తన తమ్ముని కూతురైన మీరాను మేవాడు రాజ్యాధిపతియైన సంగ్రామసింహుని కుమారుడైన భోజరాజుకు ఇచ్చి వివాహం చెయ్యటానికి నిశ్చయించాడు.

మీరాబాయి 'చిన్ననాడే తనకు గిరిధరగోపాలునితో వివాహనిశ్చయం 'జరిగిందనీ, 'తెల్లవారు జామున ఆదేవునితో తనకు కల్యాణమైనట్లు కలవచ్చింద'నీ, అందువల్ల మనుష్యునితో తనకు వివాహం అక్కలే'దనీ చెప్పి, తల్లిని బ్రతిమాలింది. 'చైతన్యంలేని విగ్రహంతో యథార్థమైన పెండ్లి పొసగ'దని 'అమాయకురాలైన బాలికవు కాబట్టి, ఇంకా నీకు పరిస్థితులు తెలియవు'- అని తల్లీ, సన్నిహిత బంధువులూ నయభయాల మీరాబాయిని సముదాయించి నిరుత్తరను కావించారు. మీరా వాళ్లందరి నిర్ణయాన్ని కాదనజాలక, 'అన్నిటికీ ఆ గోపాలుడే దిక్కు'- అని విశ్వసించి మౌనం వహించింది.

మీరా కలలో తనకు జరిగిన కల్యాణాన్ని ఒక గేయంలో సొంపుగా వర్ణించింది. ఆమె రచించిన హిందీగేయానికి డా॥ సి. నారాయణరెడ్డిగారి అనువాదం ఇలా సాగింది-

**"కల్యాణమాడెనమ్మా!-అమ్మా! కమలలోచనుడు కలలో నన్నే కల్యాణమాడెనమ్మా!**
**॥పల్లవి॥**

**కోటిదేవతలు కొలువుతీర్చగా గోపశిరోమణి వరుడాయెనే**
**నవతోరణములు ముంగిట విలసిల్ల, నా కేలు గ్రహియించి నడయాడెనే**
**కల్యాణమాడెనమ్మా!-అమ్మా! కమలలోచనుడు కలలోనన్నే కల్యాణమాడెనమ్మా!**
**పూర్వ జన్మముల పుణ్యము పండీ, పొందెను మీరా గిరిధరుని**

మురళీలోలుని కలలో పెండ్లాడి, ముత్తైదువాయెను ఆ తరుణి
కల్యాణమాడెనమ్మా!-అమ్మా! కమలలోచనుడు కలలో నన్నే కల్యాణమాడెనమ్మా!"

-మీరాబాయి, పుట 43, 6వ సంఖ్యగల గేయం.

మేవాడ్ రాకుమారుడైన భోజరాజుతో మీరాబాయి వివాహం వైభవంగా జరిగింది. మీరాబాయి సాధువు తనకు ఇచ్చియున్న గోపాలవిగ్రహాన్ని అందంగా అలంకరించి, పెండ్లిలో తనవెంటే ఉంచుకొన్నది. మంగళసూత్ర ధారణ సమయంలో ఆ విగ్రహానికి పూలమాలవేసి, మరల ఆ పూలమాలను తన కంఠసీమలో అలంకరించుకొని, తనకూ గిరిధరగోపాలునికీ ఆ శుభముహూర్తంలో వివాహం జరిగినట్లు విశ్వసించి, ఆనందించింది. మీరాబాయియొక్క ఈ చర్యను గమనించిన తల్లి, తరువాత కూతురును మందలించింది. అనంతరం మిరా తనకు అరణంగా ఇచ్చిన అమూల్య వస్త్రాభరణాదులకంటె మిన్నగా, ఆ గిరిధరగోపాల మూర్తి విగ్రహాన్నే తల్లి నడిగి ఇప్పించుకొని, భర్తవెంట అత్తవారియింటికి పయనించింది. అప్పటికి ఆమె వయస్సు ఇంచుమించు పదహారు సంవత్సరాలు.

అత్తవారి వంశాచారాన్ని అనుసరించి నూతన దంపతులు దుర్గాదేవిని పూజించవలసివుండింది. మీరాబాయి 'గిరిధరగోపాలుణ్ణి తప్ప, ఇతర దైవాలను పూజించటానికి ఇష్టపడ'నని అత్తగారికి స్పష్టంగా విన్నవించింది. అందువల్ల ఆదిలోనే అత్తింటివాళ్లందరికీ మీరా యెడల ప్రేమాదరాలకు మాఱుగా ఆగ్రహమే కలిగింది. ఆ సందర్భంలోనే మీరా ఈ క్రింది గేయాన్ని ఆశువుగా పలికినదట!

"మేరే తో గిరిధర గోపాల, దూసరో నకోయీ
జాంకే సిర మోరముకుట మేరే పతి సోయీ
తాత మాత భ్రాతబంధు ఆపనో నకోయీ
ఛాండిదయీ కులకీఖానీ కాహా కరిహై కోయీ
సంతన డిగ బైఠి బైఠి లోకలాజ్ ఖోయీ"

- మహాభక్తవిజయము (మీరాబాయి), పుట 22

'నాకు గిరిధర గోపాలుడే దైవం. ఇతరు లెవ్వరూ కారు. శిరమున నెమలి పింఛపు కిరీటం భాసిస్తున్న అతడే నాపతి. ఆయనకన్నా వేరే తల్లీ, తండ్రీ, సోదరుడూ, తదితర బంధువులు ఎవ్వరూ లేరు. ఆతని దయనిమిత్తమై క్షుద్రమైన కుల గౌరవాన్ని త్యజించాను. ఇక నన్ను ఎవ్వరూ ఏమి చేయలేరు'.

మీరాబాయి మామగారైన సంగరాణా తమ కుటుంబంలో తలయెత్తిన అభిప్రాయభేదాలు తొలగి శాంతి నెలకొనేందుకై, కోడలికి ప్రత్యేకగదిని కేటాయింప జేశాడు. మీరా నిరంతరం ఆ గదిలో గిరిధరగోపాలుని కైంకర్యంలో నిమగ్నురాలై వుంటూ, తరచుగా పరధ్యానంలో ఉన్నట్టు కనిపించేది. ఈ ధోరణి యువకుడైన భోజరాజు మనస్సును కల్లోలపఱచింది.

భోజరాజుకు ఉదయాబాయి అనే సోదరి ఉంది. ఆవిడ ఒకనాడు మీరా తన గదిలో ఏం చేస్తున్నదో చూడాలని వెళ్లింది. గది తలుపులు మూసి వున్నాయి. లోపల ఎవరో పురుషుడు మాట్లాడుతూవున్నట్లు వినిపించింది. వెంటనే ఆమె అన్నవద్దకు వెళ్లి, మీరా నిజంగా భక్తురాలు కాదనీ, ఆమె గదినుండి ఎవరిదో పురుషకంఠధ్వని వినవస్తూవుందనీ, చిత్తోడు రాజ్యంయొక్క పేరు ప్రతిష్ఠలు, శిశోదియావంశంయొక్క గౌరవం నేలపాలు కావించటానికికే మీరా కంకణం కట్టుకొన్నట్టు కనిపిస్తున్నదనీ చాడీలు చెప్పి, యువరాజును మీరాపైకి పురికొల్పింది. ఆ పల్కులు విన్న భోజరాజు ఆగ్రహోదగ్రుడై కత్తి పట్టుకొని మీరా గదివద్దకు వచ్చాడు. కోపం పట్టజాలక, తటాలున తలుపు తీసి లోపల ప్రవేశించాడు. మీరాబాయి గిరిధరగోపాలుని విగ్రహాన్ని ఒడిలో ఉంచుకొని, భక్తిపారవశ్యంలో తన్మయురాలై కానిపించింది. ఆ దృశ్యాన్ని చూచి భోజరాజు ఆశ్చర్యపడ్డాడు. అంతవరకు గదిలో మాట్లాడుతూవుండిన పరాయి వ్యక్తిని గురించి ఆమెను గద్దించి అడిగినాడు. అందుకు సమాధానంగా ఆమె తనయెదుట ఉన్న గిరిధరుని విగ్రహాన్ని చూపించింది.

ఉదయాబాయి అంతటితో ఊరుకొనక, దాసీల సాయంతో మీరా పిచ్చిదనే

పుకారు పుట్టించి, ప్రచారచేయించ సాగింది. యువరాజు కోరిక ననుసరించి, ఆస్థానవైద్యులు మీరాను పరీక్షించి, ఆమె భక్తి సరియైనదేయని ఆమె పిచ్చిది కాదని తేల్చి చెప్పినారు. అందువల్ల, మీరా నిర్దోషియని నిశ్చయించుకొని భోజరాజు తమకోటలో ఆమెకు శ్రీకృష్ణమందిరాన్ని నిర్మించియిచ్చాడు. అప్పటినుండి మీరాబాయి ఎక్కువ సమయం ఆ మందిరంలోనే ఇష్టదైవాన్ని సేవిస్తూ ఉండేది. సాధువులు, సన్యాసులు, భక్తులు మున్నగువారు అనేకులు ఆ భక్తి కవితాగానాన్ని ఆసక్తితో వినటానికి, భజనగోష్ఠులలో పాల్గొనటానికి నిత్యం వస్తూవుండేవారు.

ఇలా ఉండగా, భర్తయైన భోజరాజు హృద్రోగంతో ఆకస్మికంగా మరణించాడు. ఆనాటికి మీరా వయస్సు ఇఱువదిమూడు వత్సరాలు. సహగమనం చెయ్యవలసిందని బంధుగణం బలవంతంచేశారు. గిరిధరగోపాలుని సేవయే తన జీవితధ్యేయమనే నిశ్చితాభిప్రాయంతో మీరా సహగమనం చేయక, సన్యాసినీ వేషాన్ని ధరించి, సంపూర్ణంగా భగవత్సేవలో నిమగ్నురాలై జీవితం గడుపసాగింది.

మఱికొంత కాలానికి మామయైన సంగరాణా పరమపదించినాడు. అందువల్ల మీరాబాయి మరదియైన విక్రమజిత్తు రాణాపదవిని చేపట్టాడు. అప్పటినుండి మీరాబాయి కష్టాలు ఇనుమడించినాయి. మీరా సాధువులతో గోష్ఠులు, భజనలు నిర్వహించడం, అందరు చూస్తూవుండగా మందిరంలో అర్చా మూర్తియెదుట పాటలు పాడుతూ నృత్యం చెయ్యడం- ఇలాంటి పద్ధతుల్ని మాన్పించటానికి ఎంతో ప్రయత్నించి, విక్రమజిత్తు విఫలుడైనాడు. అందువల్ల, అధికార గర్వంతో కూడిన ఆగ్రహంతో ఆతడు కాలకూటవిషాన్ని శ్రీకృష్ణచరణామృత తీర్థమనే పేరట పంపించాడు. గోపాల సాలగ్రామమనే నెపంతో కాలసర్పాన్ని బరిణెలో పెట్టి పంపినాడు. ఆమెను కత్తుల శయ్యమీద పరుండేటట్లు ఆజ్ఞాపించాడు. ఇటువంటి అగ్నిపరీక్షలకు గుఱికావింపబడిన్నప్పటికీ, మీరాబాయి నందకిశోరుని దివ్యానుగ్రహంచేత ఆ కడగండ్ల నన్నిటినీ అధిగమించి, క్షేమంగా నిలువగలిగింది. ఆ సందర్భంలో ఈ కవయిత్రి భక్తి పూర్వకమైన సంతోషాన్ని వెల్లడిస్తూ ఒక గేయాన్ని రచించింది. ఆ హిందీ గీతాన్ని డా॥సి.నారాయణరెడ్డిగారు ఇలా తెలిగించారు. -

"హరిగుణగణముల గానముచేసీ పరవశించినది మీరా ॥పల్లవి॥
విషపాత్రను రాణా పంపగ అది విమలామృతమై విలసించె
ఆ విషమును తా నారగించగా, అమృతరూపమే సిద్ధించె
॥హరిగుణగణముల గానముచేసీ పరవశించినది మీరా॥
సర్పపేటికను రాణా పంపగ, చల్లగ మీరా గ్రహియించె
స్నానమాడి ఆ పేటిక విప్పగ సాలగ్రామము అగుపించె
॥హరిగుణగణముల గానముచేసీ పరవశించినది మీరా॥
శూలశయ్యపై పవళించగ ఆ సుదతిని రాణా శాసించె
శూలశయ్యపై మీరా చేరగ, పూలశయ్యగా భాసించె
॥హరిగుణగణముల గానముచేసీ పరవశించినది మీరా॥
ఆశ్రితావనుడు మీరాప్రభువే అంతరాయముల తొలగించె
మేఘసుందరుని గానములోనే మీరానిరతము పులకించె
॥హరి గుణగణముల గానముచేసీ పరవశించినది మీరా॥

తనను ఏ విధంగానైనా అంతమొందించాలని ప్రయత్నిస్తున్న వాళ్ల అధికారం చలామణి అవుతూవున్న చిత్తూరు దుర్గాన్ని విడిచిపెట్టడానికి మీరా సంకల్పించింది. 'స్వస్థలం ముఖ్యమా? స్వామి ముఖ్యమా?'– అనే తన ధర్మసందేహాన్ని తెలియజేస్తూ, ఈ సంకటసమయంలో తనకు కర్తవ్యాన్ని ఉపదేశించవలసినదిగా మీరాబాయి తులసీదాసుకు ఉత్తరం వ్రాసిందట! అందుకు సమాధానంగా ఆ మహాభక్తకవి ఈ క్రిందిరీతిగా ప్రత్యుత్తరం పంపినాడట!

"సీతారాములకు వ్యతిరేకులైనవారు ఎట్టి బంధువులైనా, అట్టివారిని శత్రువులుగానే భావించాలి. వారు నివసించే ప్రదేశాన్ని పరిత్యజించితీరాలి. దైవభక్తికి అడ్డుపడేవాళ్లను– వాళ్లు ఎంత పెద్దవాళ్లయినా– శీఘ్రంగా పరిత్యజించాలి. ప్రహ్లాదుడు తండ్రిని, బలిచక్రవర్తి గురువును, భరతుడు తల్లిని, విభీషణుడు అన్నను, వ్రజాంగనలు అత్త మామలను త్యజించి, దైవానుగ్రహానికి పాత్రు లయ్యారు.

కాబట్టి, మన పరమార్థానికి బాధకులయ్యేవాళ్లను తత్క్షణమే విడిచిపెట్టాలి". తులసీదాస మహాకవి సందేశం మీరాకు కొండంత ధైర్యాన్ని ప్రసాదించింది!

అనంతరం మీరాబాయి ఒకనాటి రాత్రి శ్రీకృష్ణమందిరానికి తుదిసారిగా భక్తితో నమస్కరించి పాదచారిణియై చిత్తూరునుండి బయలుదేరింది. తొలుత తాను బాల్యంలో నివసించిన మేరతా పట్టణం చేరింది. అక్కడినుండి ఆ యా పుణ్యక్షేత్రాలను, తీర్థాలను మార్గంలో సేవిస్తూ, కొన్నాళ్లకు బృందావనం చేరింది. యమునాతీరంలోని ఆ క్షేత్రంలో ప్రవేశించగానే ఆమెకు అంతకు పూర్వ మెప్పుడో ఆ ప్రదేశాలను సందర్శించివున్నట్లుగా అనిర్వచనీయమైన దివ్యానుభూతి సంప్రాప్తించింది!

ఆ కాలంలో జీవగోస్వామి అనే శ్రీకృష్ణోపాసకుడు– శ్రీకృష్ణచైతన్యమహాప్రభువుయొక్క శిష్యపరంపరలోనివాడు– ఆశ్రమం నిర్మించుకొని శిష్యసమేతంగా ఉంటున్నాడు. మీరాబాయి ఒకనాడు ఆయనను దర్శించడానికి వెళ్లింది. ఆశ్రమ ద్వారంలో ఆయన శిష్యులు తటస్థపడి 'మాగురువుగారు స్త్రీలముఖం చూడరు. కాబట్టి, మీకు ఆయన దర్శనం లభించదు'– అన్నారు 'అయితే ఈ బృందావనంలో శ్రీకృష్ణుడుగాక, మరో పురుషుడు కూడా ఉన్నాడన్నమాట' అని పలికి, మీరాబాయి అచ్చటినుండి వెనుదిరిగింది.

మీరా పలుకులను శిష్యుల ద్వారా తెలిసికొన్న జీవగోస్వామి ఆ వచ్చిన మహిళ శ్రీకృష్ణభక్తాగ్రగణ్యయని గ్రహించి, త్వరగా ఆశ్రమం వెలుపలికి వచ్చి, సగౌరవంగా మీరాబాయిని ఆశ్రమంలోకి ఆహ్వానించాడు. అందువల్ల, మీరా ఆ ఆశ్రమంలో కొన్నాళ్లు ఉండింది. ఆ సమయంలో ఆయన మీరాబాయివల్ల శ్రీకృష్ణప్రేమ తత్త్వానికి సంబంధించిన అనేక ఆధ్యాత్మిక విశేషాలను తెలిసికొన్నాడు.

అటుపిమ్మట మీరాబాయి బృందావనంలో ఒక శ్రీకృష్ణమందిరాన్ని నిర్మించి, అందులో ఇష్టదైవాన్ని ఉపాసిస్తూ, భక్తిగీతాలను రచిస్తూ, మధురభక్తి సామ్రాజ్యంలోని ఉన్నతసీమలను సాధిస్తూ ఉండింది. అత్తవారింటిలో ఉన్నకాలంలో నందగోపాలుని

మహిమవల్ల మీరాబాయికి లభించియుండిన గోపాలసాలగ్రామం నేటికీ బృందావనంలోని మీరామందిరంలో ఉన్నట్లు చరిత్ర చెపుతూవుంది.

ఒకనాడు స్వప్నంలో గిరిధరగోపాలమూర్తి సాక్షాత్కారించి, మీరాను ద్వారకకు వెళ్లవలసిందిగా ఆదేశించాడు. ఆరాధ్యదైవంయొక్క ఆనతి ననుసరించి మీరాబాయి క్రమేణ ద్వారకను చేరుకొని, ఆ ద్వారకాధీశుణ్ణి మధురాతిమధురాలైన పదాలతో ఆరాధిస్తూవుండింది. ఇంకా, గీతగోవిందటీకా, రుక్మిణీమంగళ నాటక్, రాగ గోవింద్- మొదలైన గ్రంథాలను రచించి, ఆ స్వామికే అంకితం కావించి, అనేక విధాల సేవిస్తూవుండింది.

ఈ మధ్యకాలంలో మేవాడ్ రాజ్యంలో అంతఃకలహాలు, ఈతిబాధలు, విప్లవాలు, శత్రువుల దాడులు మొదలగు సంక్షోభాలు మితిమీరాయి. చివరకు విక్రమజిత్తు సింహాసనం విడిచి పారిపోయాడు. అతని తమ్ముడు ఉదయసింహుడు రాణా అయ్యాడు. మీరాబాయి రాజధానిని, రాజ్యాన్ని విడిచిపోయినందువల్లనే రాజ్యానికి అట్టి దుఃస్థితి దాపురించిదని ప్రజానీకం ఘోషింపసాగారు. రాణా ఉదయసింహుడు ప్రజాభిమతాన్ని మన్నించి, మీరాబాయిని చిత్తూరుకు పిలిపించ టానికి నిశ్చయించాడు. అందుకొరకై కొంతమంది బ్రాహ్మణులను ద్వారకకు పంపాడు.

ఆ బ్రాహ్మణులు ద్వారకకు వెళ్లి, మీరాబాయిని సందర్శించి, ఉదయసింహుని విజ్ఞాపనను వివరించి, చిత్తూరికి విచ్చేయవలసినదిగా ప్రార్థించారు. వాళ్ల అభ్యర్థనను ఆలకించి, మీరా ఇలా పల్కింది. "అయ్యలారా! మేవాడ్ రాజవంశపు కోడలైన మీరా ఏనాడో చనిపోయింది. ఇప్పుడు ఇక్కడ ఉన్నది కేవలం శ్రీకృష్ణచరణదాసి మాత్రమే. ఈ దాసీకి శ్రీకృష్ణుడు తప్ప, తదితరులతో అవసరం లేదు".

వాళ్లు ఆమె పల్కులను అంగీకరించక, "మీరు చిత్తూరుకు రావడానికి అంగీకరించేంతవరకు మేమందరం ఈ ద్వారకాధీశుని మందిర ప్రాంగణంలో

నిద్రాహారాలుమాని, ప్రాయోపవేశం చేస్తాము"- అన్నారు. అప్పుడు గత్యంతరం లేక, మీరాబాయి వారితో ఇలా పల్కింది. "అయ్యా! అలా అయితే మీ మాటే పాటిస్తాను; ఒక పర్యాయం స్వామిదర్శనం చేసికొని వస్తాను. మీరు ఇక్కడే ఉండండి!"- అని చెప్పి, ఆమె ఆలయంలోపలికి వెళ్లింది.

ఆ గాయకయోగిని స్వామివారి సన్నిధికి వెళ్లి, మనసారా ధ్యానించింది. 'గోవర్ధనగిరిధారీ! శౌరీ! మురారీ! ఇహలోకపు బాధలనుండి నన్ను విముక్తురాలిని కావించి నీలో లీనం చేసికోవలసింది'- అని పరిపూర్ణ భక్తిభావంతో ప్రార్థించింది. ఆ మఱుక్షణంలో స్వామిచరణాలపై సొమ్మసిల్లి పడిపోయింది. ఒక జ్యోతిః పుంజం ఆమె దేహంనుండి వెలువడి ద్వారకాధీశునిలో సంలీనమయింది. అనంతరం విచిత్రంగా ఆమె భౌతికశరీరంకూడా అదృశ్యమయింది! ఆమె ఉత్తరీయం ద్వారకాధీశునికి చుట్టుకొనివుండటం అచ్చటివారికి గోచరించింది. మహితసాహితీ మూర్తియై వెలుగొందిన మీరాబాయి ఆ రీతిగా క్రీ.శ. 1547వ సంవత్సరంలో పరాత్పరునియందు ఐక్యమయింది.

గిరిధర గోపాలుని ముగ్ధమోహన స్వరూపాన్ని కనులకు కట్టినట్లుగా చిత్రిస్తున్న ఒక గీతం మీరా కవితామాధురికి నిదర్శనంగా ఈ సందర్భంలో ఉదాహరింపదగివుంది-

**"బసో మేరే నయననమే నందలాల్**
**మోహనీ మూరత సావరీసూరత నయనా బనే బిశాల్**
**అధర సుధారస మురళీరాజత, ఉర బైజంతీమాల్**
**క్షుద్రఘంటికా కటితట శోభిత, నూపుర శబ్ద రసాల్**
**మీరా కే ప్రభు సంతన సుఖదాయీ భక్తవత్సల గోపాల్॥**

-(మహాభక్త విజయము (మీరాబాయి). పుట 41)

ఈ మధుర గీతానికి డా॥ సి. నారాయణరెడ్డిగారి అనువాదం ఇలా జాలువారింది-

"నా కన్నులలో నివసించుమోయీ! నందనందనా! ॥పల్లవి॥
శిఖిపించముతో చెలువొందువాడా!
చెంపకు చేరెడు కన్నులవాడా!
కోమల వదనము, శ్యామల రూపము
ముద్దులు చిలికే మురిపాల తేడా! ॥నాకన్నులలో॥ 1

కమ్మని మోవిని వేణువు మ్రోయగ
కంఠసీమ వైజయంతి విరియగ
కటితటమున చిఱుగంటలు చెలగగ
అందెల రవళులు అందము లొలుకగ
సాధుజనాళికి మోదము గూర్చి
చల్లగ కాచే, హే మీరాప్రభు! ॥నాకన్నులలో॥ 2

–'మీరాబాయి' పుట 52, 22వ సంఖ్యగల గేయం.

## మూడు జీవిత దశలు :

మీరాబాయికి రెండున్నర శతాబ్దుల అనంతరం ఆంధ్రావనిలో అవతరించిన ఆధ్యాత్మిక కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. ఈ భక్తవయిత్రి యొక్క పవిత్రజీవితం ప్రధానంగా మూడుదశలుగా గోచరిస్తూవుంది.

ఈ మూడు దశలలో మొదటి దశ వెంగమాంబ జన్మించిన నాటినుండి తిరుమల పుణ్యక్షేత్రం చేరేంతవరకు వ్యాపించివుంది. ఈ మొదటి దశ ఆమెకు ఇంచుమించు ఇరువదేండ్ల వయస్సు వచ్చేటంతవరకు విస్తరిల్లివుంది. ఈ కాలాన్ని ఆమె జీవితంలో ప్రాథమిక దశ– అని చెప్పవచ్చు. ప్రాథమిక దశ అంటే, వెంగమాంబ అటు తరువాత తిరుమలలో కొనసాగించబోయే ఆధ్యాత్మిక సాహితీ వ్యాసంగానికి పునాదిగా, ప్రాతిపదికగా ఉన్న దశ– అని అభిప్రాయం.

రెండవ దశ వెంగమాంబ తిరుమల చేరిన నాటినుండి తుంబురుకోనలో దాదాపు ఆఱేండ్లు తపస్సాధన చేసేంతవరకు విస్తరించివుంది. ఈ రెండవ దశను

దాదాపు పదహేఱు సంవత్సరాల పరిమితి కలదిగా భావించవచ్చు. అంటే, ఈ రెండవదశ 36 ఏండ్లప్రాయంవరకు పెంపొందినదని స్థూలంగా పరిగణించవచ్చు. వెంగమాంబ సారస్వతజీవితంలో ఈ రెండవదశను 'సాధనదశ'గా భావించవచ్చు. అనగా, ఈ రెండవదశలో ఆమె విద్యాధిదేవతయైన హయగ్రీవస్వామియొక్క మంత్రాన్ని ఉపాసించటము, శ్రీమద్భాగవత, వేంకటాచలమాహాత్మ్యాది పురాణాలను పరిశీలించటము, వీటన్నింటిని మించి తుంబురుకోనలో ఒక గుహలో తీవ్రంగా తపస్సాధన చెయ్యటము– ఇత్యాది అంశాలన్నీ ఇమిడివున్నందువల్ల, ఈ రెండవ దశను 'సాధనదశ'– అని పేర్కొనడం జరిగింది.

ఇక, మూడవ దశ వెంగమాంబ తుంబురుకోననుండి తిరుమలకు మరలి వచ్చిన నాటినుండి క్రీ.శ. 1817కు సరియైన ఈశ్వరసంవత్సర శ్రావణమాసంలో పరమపదాన్ని అలంకరించేంతదాకా ఇంచుమించు 50 సంవత్సరాలు కొనసాగిన సుదీర్ఘమైన దశ. ఈ మూడవదశ ఈ భక్తకవయిత్రియొక్క మహనీయ జీవితంలో అన్ని విధాలా పరిపక్వత గడించిన మహోన్నతమహానుభావవదశ. అటు యోగవిద్యా విషయంలోనూ, ఇటు సాహిత్యరచనా విషయంగానూ, వేదాంతవిద్యాప్రావీణ్యంలోనూ ఉత్తమస్థాయిని అందుకొన్న దశ అన్నమాట. అందువల్లనే ఈ మూడవ దశ వెంగమాంబ జీవితంలోని 'సిద్ధిదశ'గా పరిగణింప బడింది.

ఇల్లాగే మీరాబాయి జీవితంలోనూ సరిగ్గా మూడు ముఖ్య దశలు గోచరిస్తూ వుండటం ఒక విశేషం. మీరాబాయి మేరతా సంస్థానికి చెందిన 'కుటికీ' గ్రామంలో జన్మించిననాటినుండి వివాహానంతరం మేవాడ్ సామ్రాజ్యంలోని చిత్తూరు కోటలో నివసించేంతవరకు గడచిన కాలం ఆమె జీవితంలో ప్రథమ దశ. చిత్తూరును వీడి బృందావన క్షేత్రాన్ని చేరుకొని, అచ్చట భక్తిసాధన సాగించిన కాలం రెండవదశ. ఈ రెండవ దశలో మీరాబాయి అనేక పుణ్యక్షేత్రాలను, తీర్థాలను, మహాత్ములను సందర్శించి మధురభక్తి సాధన కావించియున్నందున, ఇది ఆమె వాఙ్మయ జీవితంలోనూ, అలాగే నిజజీవితంలోనూ 'సాధనదశ'గా

చెప్పదగివున్నది. మీరాబాయి బృందావనంనుండి ద్వారక చేరుకొని ద్వారకాధీశుణ్ణి ఆరాధించిన కాలం మూడవదశ. ఈ సుదీర్ఘదశ మీరా ద్వారకనాథునిలో ఐక్యమయ్యేంతవరకు విస్తరిల్లింది. ఈ మూడవదశ వెంగమాంబ జీవితంలోవలెనే అన్ని విధాలా పరిపూర్ణాతనందిన 'సిద్ధి' దశ.

బాల్యంలో వెంగమాంబ ప్రదర్శించిన భక్తి పారవశ్యాన్ని ఆనాటి సమాజంలోని కొంతమంది అది ఒకరకమైన ఉన్మాదస్థితిగా భావించినట్లే, మీరాబాయి విషయంలోను జరిగింది. ఈ అంశాన్నే మీరాబాయి ఒక గేయంలో-

**"బంధువు లన్నారు కులనాశిని యని**
**పలికిరి లోకులు ఉన్మాదినియని**
**ఎరుగలేరు వీరెవరూ మీరా**
**హరి చరణాంబుజ దాసియని"**

-మీరాబాయి, పుట 44, 8వ సంఖ్యగల గేయం.

అని స్పష్టంగా ప్రకటించింది.

## బలవంతంగా వివాహం :

మానవ జీవితంలో అత్యంతముఖ్యమైనేదిగా పరిగణింపబడే 'వివాహం' ఈ యిరువురు కవయిత్రుల జీవిత గతిలో విషాదానికి బదులు విరక్తిభావాన్నే మిక్కిలిగా పెంపొందించింది.

"భగవంతుడే నా భర్త; నాకు ఈ వివాహం అక్కరలేదు".- అన్న స్వతంత్ర భావ ప్రకటన ఈ యిరువురు కవయిత్రుల జీవితాల్లోనూ సమానంగా గోచరిస్తున్నది. వీరి ఈ స్వతంత్ర భావనను, చిత్తసమున్నతిని సవ్యంగా అర్థం చేసికోలేక, చిన్నపిల్లల అమాయికపు ప్రేలాపనగా భ్రాంతిపడి తల్లిదండ్రులు, బంధువులు వీరలకు బలవంతంగా వివాహం చేశారు. సమున్నత ఆధ్యాత్మిక జీవనవిధానానికి, సామాన్య లౌకిక సంసారబంధాలకు పొత్తు కుదరక పోవడం ఒక్కొక్కప్పుడు సహజమేనని ఈ యిర్వురి వివాహగాథలు చాటుతున్నాయి.

వివాహానంతరం ఈ యిద్దరిలో 'భక్తిపిచ్చి' పెద్దలు తలంచిన విధంగా తగ్గకపోగా, అతిశయించటం విశేషం.

## ఇరువురూ కృష్ణభక్తురాండ్రు :

మీరాబాయి తన గీతావళిద్వారా శ్రీకృష్ణుని ఉపాసించిన విధంగానే. భాగవత కవయిత్రియైన వెంగమాంబ తన కృతులలో శ్రీకృష్ణావతారానికి పెద్దపీట వేసి, ఆ మూర్తియెడల విశేషభక్తి ప్రచారాలను ప్రదర్శించింది.

ఈ యిద్దరు సాహితీమూర్తులు సాటి మానవులతో సంభాషించినంత చనువుతో, చొరవతో ఇష్టదైవమైన శ్రీకృష్ణునితో ముఖాముఖిగా మాటలాడే ఆత్మీయమైన స్తోమతగలవాళ్లు. ఇందుకు వెంగమాంబ రచించిన ఈక్రింది పద్యం ఒక ఉదాహరణ:

**"శృంగారాకృతితోడ వచ్చి పదముల్ శృంగారసారంబుతో**
**డం గూడంబుగఁ జెప్పు నీవనఁగ, నట్లా చెప్పలేనన్న, నన్**
**ముంగోపంబునఁ జూచి, లేచి యట నే మ్రొక్కంగ మన్నించి, తత్**
**శృంగారోక్తులు తానె పల్కికొను నా శ్రీకృష్ణు సేవించెదన్"**

-శ్రీవేంకటాచల మాహాత్మ్యము, 1 అశ్వా., 13 ప.

శ్రీకృష్ణుడు ఒకనాడు శృంగారవేషంతో ముస్తాబై వెంగమాంబవద్దకు వచ్చాడు. నీవు రచించే వేంకటాచలమాహాత్మ్యకావ్యాన్ని శృంగారరసాత్మకములైన పదాలతో రచించమని ఆజ్ఞాపించి వెళ్లాడు. శ్రీకృష్ణునితో ఈ కవయిత్రికి గల చనువు అలాంటిది! ఇక, మీరాబాయి భక్తిభావభరితంగా రచించిన అనేక గీతాలలో ఇటువంటి సన్నివేశాలు కొల్లలు!

## మధురభక్తి మార్గంలో ఇరువురికీ సౌకర్యం:

ఈ భక్త కవయిత్రు లిరువురును మధురభక్తి భావనా ప్రపంచంలో ఉన్నత శిఖరాలను చేరుకున్న ధన్యజీవులు. పుట్టుకచేత మహిళలు కావడంకూడా వీరిరువురి మధుర ప్రణయభావనా పరిపక్వమైన మానసిక స్థితికి దోహదం కల్గించింది. మీరాబాయియొక్క ప్రణయభక్తికి ఈ క్రింది గీతం ఒక నిదర్శనం-

"మాయింటికి విచ్చేసెనే
మనసెరిగిన చెలికాడే ||పల్లవి||

తనుతాపము ఆరెను; జీ
వనగీతము మ్రోగెను లే,
మబ్బు రవళి విన్ననెమలి
మాదిరి మది ఆడెను లే. 1

ప్రభుని చెంత నిలిచినంత
భవ భయములు వీడెనులే
నెలరాయని గన్న కలువ
వలె తనువే విరిసెను లే. 2

భక్తపారిజాతమైన
ప్రభువె నాకు దొరికెను లే
విరహ విధురయౌ మీరా
వెతలన్నీ తొలగెనులే! 3

-మీరాబాయి, పుట 60, 37వ సంఖ్యగల గేయం.

వెంగమాంబ 'శ్రీకృష్ణమంజరి' అనే కావ్యంలో తనకు శ్రీకృష్ణునికి 'బాధ్యం' అంటే వైవాహికమైన బాంధవ్యం- ఉన్నట్లు ఈ క్రింది పంక్తులలో వెల్లడించింది:

"నీవు నా స్వామిని, నీ సొమ్మునేను
కావున బాధ్యమెక్కడఁ బోదు కృష్ణ!
శేషభూతను నేను శేషిని నీవు
కావున బాధ్య మెక్కడఁ బోదు కృష్ణ!
పావనుండవు నీవు, పతితను నేను
కావున బాధ్య మెక్కడఁ బోదు కృష్ణ!
నేటికైనను గాని నీకటాక్షమున
నీ బాధ్యమెతీగితి నిజముగా కృష్ణ!"

–శ్రీకృష్ణమంజరి 48, 49, 50, 53 ద్విపదలు.

మొత్తంమీద మీరా మధురభక్తి వ్యక్తంగాను, వెంగమాంబ మధురభక్తి ఇంచుక అవ్యక్తంగాను వారి వారి రచనలలో గోచరిస్తూవుంటుంది. అలాగే, భక్తి, జ్ఞానమార్గాల సమన్వయం, సగుణ నిర్గుణోపాసనల సామరస్యం– ఇరువురి కృతుల్లోను చక్కగా సాక్షాత్కరిస్తుంది.

## కష్టాలను గూర్చిన సూచనలు :

జీవితంలో తామెదుర్కొనిన కష్టాలను, ఆపదలనుగూర్చి ఈ యిర్వురు తమ రచనలలో ఎడనెడ సూచించియున్నారు. తమకు ఎన్ని ఇబ్బందులు, క్లేశాలు కలిగినా, భక్తిభావభరితమైన ఆధ్యాత్మిక స్ఫూర్తితో ఇరువురూ మనశ్శాంతిని పొందినారు. తమకు కష్టాలను కలిగించినవాళ్లు చివరికి పశ్చాత్తాపంతో తమను క్షమాపణ వేడటం ఈ యిద్దరుసారస్వతమూర్తుల జీవితాల్లో కనిపిస్తుంటుంది.

## సహజమైన భాష :

ఈ యిరువురు కవయిత్రులు తమతమ రచనలలో ప్రయోగించిన భాష తమ తమ దేశకాలాల్లో వాడుకలో ఉండిన విశిష్ట వ్యావహారిక భాష. ఈ విధంగా నిసర్గమైన భాషాసౌందర్యానికి ఈ యిరువురి కృతులు మిగుల ప్రసిద్ధి గాంచాయి.

## రచనల ధ్యేయం :

ఈ యిరువురు కవయిత్రులు రచనా వ్యాసంగాన్ని చేపట్టడంలో ప్రధానమైన లక్ష్యం భగవంతుని అనుగ్రహము, తదనుసారంగా మోక్షము. అంతేగాని, కీర్తి నుద్దేశించి గాని, ఐహికసౌఖ్యాల్ని ఉద్దేశించిగాని ఈ యిరువురు గ్రంథరచనా వ్యాసంగం చెయ్యలేదు. ఇరువురూ తమ తమ రచనలో వినయగుణాన్ని సమయోచితంగా ప్రదర్శించియున్నారు.

## పూర్వకవుల ప్రభావం :

మీరాబాయి రచనలపై జయదేవుడు, సూరదాసు మున్నగు పూర్వకవుల కవితాప్రభావం ప్రసరించియున్నట్లే, వెంగమాంబ రచనలపై బమ్మెరపోతనా మాత్యుడు, తాళ్లపాక అన్నమాచార్యులు మున్నగు కవీశ్వరుల రచనల ప్రభావం సుందరంగా ప్రతిఫలించివుంది.

## చరమదశ :

భక్తనారి మీరాబాయి సప్తమోక్షపురులలో ఒకటైన ద్వారకలో భగవానునిలో ఐక్యమైన విధంగానే, భక్తకవయిత్రి తరిగొండ వెంగమాంబ కలియుగ వైకుంఠంగా ప్రశస్తిగాంచిన తిరుమల పుణ్యక్షేత్రంలో సజీవసమాధి ద్వారా శ్రీనివాసునిలో ఐక్యమయింది.

ఈ రీతిగా ఈ యిరువురు సాహితీమూర్తులు అత్యంత సన్నిహితమైన సాదృశ్యం కలవారై విరాజిల్లుట ఆ 'గోవిందుని' లీలావిశేషంగా భావించి, భక్తితత్పరులమై వారి సారస్వతాన్ని ఆరాధించి, ఆనందించి తరింతము గాక!

# వెంగమాంబ భక్తి కవితా తత్త్వం

-- డా॥ వెలుగోటి భాస్కరసాయికృష్ణయాచేంద్ర

ఆమె కవనం- ధాతుమాతు సమ్మేళనం! ఆమె శైలి- సౌందర్యపదబంధ కేళి నిసర్గరమణీయహేళి. పదమైనా, పద్యమైనా, ద్విపదయైనా మాధురీ బంధురం రసమయ సుందరం! భక్తిభవనామందారం! శ్రీనివాసునితో సంభాషించి, సంతోషించి, సరస కవితలు వినిపించి ప్రత్యక్షానుభూతి పొందిన ధన్యజీవి. పాటలతోనే కాదు, పాటల కవిత్వ పాటవముతో, పద్యములతోనేకాదు, అనవద్య హృద్యతాత్త్విక విద్యతో వేంకటేశుని వినుతించి, నివాళులర్పించిన బహుముఖీన ప్రజ్ఞాశాలి.

యక్షగాన రచనలో సమగ్ర కథనచాతుర్యం, సృజనాత్మక కవితాకైంకర్యం, ప్రశంసనీయం! పాత్రోచితభాష ప్రవేశపెట్టడం ఒక ప్రత్యేకత. బాలభాష, మాండలికాల యాస ఈమె విశిష్టత. వేదాంత సంబంధములైన రాజయోగసారం, యోగవాసిష్ఠం వంటి రచనలలో మిన్నుముట్టిన తాత్త్వికత. భక్తిభావనలో, శృంగార యోచనలో పరాకాష్ఠ ఈమె భావుకత. తన కవిత్వంతో స్వామిని మెప్పించుట ఈమె ఘనత. ప్రతిరోజు ప్రభుని సన్నిధిలో వెలిగేది ఈమె కర్పూర హారతి!! ఈ మహాయోగిని దివ్యప్రాణజ్యోతికి అదే జన్మసార్థకత. వాయల్పాడు సమీపంలో గల తరిగొండ గ్రామంలో ప్రభవించి, మధురకవితా సుధాధారలతో శ్రీవేంకటేశుని అభిషేకించి, తరించిన తెలుగు కవయిత్రి అఖిలాంధ్రజనయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ.

సాంఘిక దురాచారాలపై సమరం ప్రకటించి, బాలవితంతువులపై ఆనాడు జరిగే అన్యాయాలను ప్రతిఘటించి, తన కోసముకాదు- తనవంటి అభాగినులపై నాడు సంప్రదాయం పేరిట జరిగే అమానుష కృత్యాలను ఎదిరించి తిరుగుబాటు బావుటా ఎగురవేసిన విప్లవవనిత వెంగమాంబ.

సహజంగా అలవడిన కవితాశక్తి, గురూపదేశంవలన కలిగిన పాండిత్య స్ఫూర్తి, బహుగ్రంథ పఠనంవలన లభించిన జ్ఞానదీప్తి- ముప్పేటలుగా అల్లుకున్న

మూర్ధన్యమూర్తి శ్రీవెంగమాంబ. తన వాఙ్మయజీవితం తిరుమలాధీశునికి ముత్యాల హారతి చేసిన భక్తశిఖామణి ఈ తరుణి.

అనేకానేక ప్రక్రియలలో శతకాలు, యక్షగానాలు, ద్విపదలు, తత్త్వసంబంధమైన రచనలు, శ్రుతిలయ సమన్వితములైన వేదాంతగీతాలు వెలయించడమే కాక, శ్రీవేంకటాచలమాహాత్మ్యమువంటి బృహత్కావ్యమును విరచించిన విదుషీమణి వెంగమాంబ.

తిరుమల వేంకటేశ్వరుడు, తరిగొండ నరసింహుడు అభేదమూర్తులని భావించి, సంభావించి, ఆత్మార్పణ గావించి, సహస్రచంద్ర దర్శనం చేసి, సజీవ సమాధిలో ప్రవేశించి సప్తగిరీంద్రునిలో సమైక్యమొందిన సిద్ధయోగిని, మహాతపస్విని శ్రీ తరిగొండ వెంగమాంబ.

ఆమె రచనలలోని కొన్ని ఆణిముత్యాలు। మీా కందించే ఈ నిత్యసత్యాలు.

ఓం

# తాళ్లపాక తిమ్మక్క - తరిగొండ వెంగమాంబ

-- డా॥ ఆర్. అనంతపద్మనాభరావు

తిరుమలాంబ అనబడే తిమ్మక్క సుభద్రాకల్యాణాన్ని భక్తిమయ గేయరచనగా ద్విపదల్లో వ్రాసింది. సంగీతసాహిత్యాలలో చతుర అయిన ఈ కవయిత్రి ఇల్లాలు అన్నమయ్యకు లభించడం అదృష్టం. పూర్వజన్మసుకృతం.

"సంగీతము, సాహిత్యము,
శృంగారము, చక్కఁదనము, శీలముగల పు
ణ్యాంగనకుం బ్రియుఁడగు కవి
పుంగవు ఁడరయంగ నెంత పుణ్యాత్మకుఁడో!

మంజరీ వికారమైన గేయరచనలో స్త్రీ, బాల, పామరాదులు కంఠపాఠంగా నేర్వదగిన విధంగా తిమ్మక్క వ్రాసింది. పాడుకొనేందు కనువుగా వుంది.

తిమ్మక్కకు ముందు ద్విపదలలో గోనబుద్ధారెడ్డి రంగనాథ రామాయణం, పాల్కురికి సోమన బసవపురాణ, పండితారాధ్యచరిత్రలు ప్రసిద్ధాలు. సుభద్రాకల్యాణం ఆంధ్రమహాభారతంలో నన్నయ్యభట్టు చెప్పారు. అర్జునుడు సమయపాలనకై తీర్థయాత్రలు చేస్తూ ద్వారకకు వచ్చి, సన్యాసిరూపంలో సుభద్రను శ్రీకృష్ణుని సహాయంతో చేపట్టాడు. ఆదిపర్వంలో అష్టమాశ్వాసంలో 55 గద్యపద్యాలలో క్లుప్తంగా సుభద్రార్జునుల వివాహం పరిసమాప్తమవుతుంది.

సుభద్రను నన్నయ అచ్చపు తెనుగింటి ఆడపడుచుగా వర్ణించాడు-

"క్వణదణు కింకిణీ కలితకాంచన కాంచికలాపమున్, రణ
న్మణి కలనూపురంబులు సమధ్వని నొప్పఁగ, భక్తిబాదచా
రిణి యయి కన్యకాజన పరీత సుభద్ర, తదద్రిపూజన
ప్రణతులుసేసె నింద్రసుతుఁ బార్థునిజేవ్వరుఁగా ఁదలంచుచున్.

సుభద్రార్జునుల తొలి సమావేశాన్ని కవి ఇలా ఊహించాడు. ఈ పద్యం పెద్దన చెప్పిన-

**"చూచి ఝుళంఝుళత్కటకసూచిత వేగపదారవిందయై**
**లేచి కుచంబులున్, తురుము, లేనడు మల్లలనాడునయ్యెడన్**

పూచిన యొక్క పోఁకనను బోదియ చెంత"ను జేరిన వరూధినిని తలపిస్తోంది.

సుభద్రకల్యాణాన్ని 1950లో వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వేంంకటేశ్వర ప్రాచ్య పుస్తకభాండాగారం పక్షాన ప్రచురించి 12 అణాలకు- అంటే 1 రూపాయకు విక్రయింపజేశారు.

ప్రారంభ ద్విపద ఇలా సాగింది-

**"శ్రీరమావల్లభులు శ్రీకృష్ణులెలమి**
**ద్వారకా పట్టణము తమరేలుచుండ**
**శ్రీకాంతపతి కృపను జెలఁగి పాండవులు**
**ప్రాకటంబుగను ద్రౌపదిని పెండ్లాడిరి"-** అని మొదలుపెట్టింది.

అందులోని 'శ్రీరమావల్లభులు' అనే తొలి పదబంధం ఆధారంగా శ్రీరమా పరిణయాన్ని వెంగమాంబ అదే ద్విపద ధోరణిలో భక్తిరసమయ కావ్యంగా రచించింది. ఈ గ్రంథాన్ని కూడా పరిశోధనా పరమేశ్వరులు వేటూరి ప్రభాకర్‌శాస్త్రిగారు శ్రీవేంకటేశ్వర లఘుకృతుల సంకలనంలో చివరగా చేర్చారు.

ఇందులో వివాహవేడుకలు అచ్చపు తెనుగింటి పెళ్లివేడుకలు. బువ్వంబంతి, విందుముచ్చట్లు అతిసుందరంగా వెంగమాంబ వర్ణించారు. అంతకుముందు వచ్చిన సుభద్రాకల్యాణాన్ని ఆమె బాగా అధ్యయనం చేసింది కావడం, వల్ల తత్ప్రభావం మనకు వెంగమాంబరచనలో ప్రస్ఫుటమవుతుంది. 400 ద్విపదలలో కథ చకచకా సాగిపోతుంది. క్లుప్తంగా కథ ఇది:

శ్రీమన్నారాయణుడు యోగనిద్రలో వున్నపుడు బ్రహ్మాదులు వచ్చి ప్రార్థించారు. విష్ణువు మేల్కొని 'మీరు వచ్చిన కారణం చెప్పు'మన్నాడు. 'మిమ్మల్ని పతిగా పొందాలన్న రమాదేవిని పరిణయమాడ'మని వాళ్లు వేడుకొన్నారు.

వేంకటాద్రిపై వేంకటేశ్వరుడనే పేర వెలసిన విష్ణువు లగ్నం నిశ్చయించేందుకు బ్రహ్మేదుల్ని సముద్రుడి దగ్గరకు పంపాడు. సముద్రుడు పెళ్లిముహూర్తం నిర్ణయించి బ్రహ్మేదుల్ని సగౌరవంగా వీడ్కొలిపాడు.

శ్రీవేంకటేశ్వరుడు గరుడ వాహనం ఎక్కి, సముద్రుని వద్దకు వచ్చి, విడిది చేరాడు. వరపూజ, పేరంటాలు, మంగళస్నానం, స్నాతక వ్రతం, కాశీ యాత్ర పూర్తి చేశారు. శాస్త్రోక్తంగా జరిగే అయిదు రోజుల పెళ్లిళ్లు పాతకాలాల్లో ఆచార బద్ధంగా చేసేవారు. తెలుగునాట వెలసిన ఆ పెళ్లి వేడుకలన్నీ వెంగమాంబ పరిచయం చేసింది. కశ్యప మహర్షి పెండ్లి పురోహితుడుగా రమా వేంకటేశ్వరుల పరిణయం వైభవోపేతంగా జరిగింది. నాలుగో రోజు రాత్రి బువ్వంబంతి, భోజనాలు కాగానే పెళ్లికొడుకు అత్తవారికి తెలియకుండా వాళ్ల యింట్లో ఏదో ఒక వస్తువు దొంగిలించాలి. వేంకటేశ్వరుడు బంగారు కలశం ఎత్తుకొని విడిదింటి కెళ్లాడు. ఆ విషయం తెలిసి, పెళ్లికూతురు వచ్చి, 'తిరిగి యివ్వ'మని ప్రాధేయపడుతుంది. ఇప్పటికీ 'దొంగచెంబు'పేరుతో ఈ ఆనవాయితీ కొనసాగుతుంది. అలకపాన్పు పేరుతో అల్లుడి అలకతీర్చడం యిప్పటికీ రివాజు.

వేంకటరమణుడు అత్తమామల్ని, బంధువుల్ని వేంకటాచలానికి ఆహ్వానించాడు. మరులుపెళ్లిలాంటిది. విందులు, వినోదాలు పూర్తికాగానే సముద్రుడు కూతుర్ని అల్లుడి యింటిలో వదలిపెట్టి వెళ్లిపోయాడు. వేంకటేశ్వరుడు రమాదేవిని అలమేల్మంగ అనే పేరుతో వక్షఃస్థలంపై ధరించి ఆనందనిలయంలో సుఖంగా వున్నాడు.

ఈ కథ భాగవతంలో వుంది. దేవదానవులు పాల సముద్రాన్ని మథించగా లక్ష్మీదేవి ఆవిర్భవించింది. ఆమె స్వయంగా శ్రీమన్నారాయణుని వరించింది. వెంగమాంబ ఆ కథను తీసుకోలేదు. 'విష్ణువు లక్ష్మిని పెండ్లాడెను'- అనే పురాణ గాథను గ్రహించి, భవిష్యోత్తర పురాణంలోని పద్మావతీ వేంకటేశ్వర కల్యాణకథను తీసుకొంది.

కథావస్తువు చాలా పరిమితమైంది. అయితే, పాత్రలు ఎక్కువ ఉన్నాయి. బ్రహ్మాది దేవతలు, కథానాయకులు రమా వేంకటేశ్వరులు, కన్యాదాత సముద్రుడు, బంధువులు పార్వతీ పరమేశ్వరులు, పెంపుడు తల్లి వకుళమాలిక పాత్రలు. ఇందులో దివ్యపాత్రలకు మానుషభావాలను ముద్దు మురిపెంగా ఆరోపింపజేసింది కవయిత్రి. పాత్రల స్వరూప స్వభావాలను మాటల ద్వారా, చేష్టల ద్వారా సమున్మీలనం చేశారు.

శ్రీమహావిష్ణువు తాను వేంకటాచలపతిగాను, శ్రీసతి అలమేలుమంగగాను జన్మిస్తామని బ్రహ్మాదులకు విష్ణువు అనుగ్రహించాడు-

"భూలోకమున శేషభూధరమందు
నే లీల దీపింప నిలిచి యచ్చోట
వేంకటేశ్వరుఁడన విఖ్యాతి ఁబొంది
పొంకంబుగానుందు భూపాలు కరణి
మచ్చిక నలమేలు మంగాభిధాన
మిచ్చి సంప్రీతి నా యిందిరాసతిని
నే శీఘ్రముగను పాణిగ్రహణంబు
ఔసెదనని పల్కె చిరునవ్వునవ్వి"

మన శ్రోత్రియ వివాహాలలో జరిగే వరపూజను కవయిత్రి అద్భుతంగా వర్ణించింది. పెండ్లికి ముందు రోజు రాత్రి ఈ కార్యక్రమం యిప్పటికీ జరుపుతున్నారు. పెండ్లి కొడుకుకు కాబోయే అత్తమామలు నూతన వస్త్రాలు సమర్పిస్తారు. (సూటు, బూటు). బావమరది కాళ్లు కడుగుతాడు. ఆ సమయంలో వధూవరులు దండలు మార్చుకొంటారు. పేరంటాలకు పిలుస్తారు.

ఇక్కడ స్వామికి మెడలో పుష్పహారం వేసినట్లు, పేరంటాళ్లను పిలిచినట్లు చెప్పారు. పెండ్లి యేర్పాట్లు ఘనంగా చేశారు. విశ్వేశ జలజాసనాదులు సభికులు. పార్వతీ భారతీ ప్రముఖులు పెండ్లి ముత్తైదువలు. మంగళస్నానాలు వధువుకు

చేయించారు. పుణ్యాహవాచనం అయిన తర్వాత స్నాతకం జరిపించారు. స్నాతవ్రతం అంటే యిప్పటి మన పట్టభద్రులను ప్రకటించడం వంటిది. తర్వాత కాశీయాత్ర. ఈ తంతు యిప్పటికీ జరుగుతున్నది. పెండ్లికొడుకు పావుకోళ్ళు ధరించి, గొడుగు పట్టుకొని కాశీ యాత్రకు బయలు దేరుతారు. వధువు తమ్ముడు బావగారి కాళ్లు కడిగి కన్యాదానం చేస్తామని బ్రతిమాలి కాశీయాత్ర ప్రయత్నం విరమింపజేస్తాడు. 'మా అక్కయ్యను చేసుకొని, దంపతులు ఇద్దరూ వెళుదురు లె'మ్మని కోరుతాడు. వరుడు 'సరే కానీలే' అని అంగీకరిస్తాడు.

**"విలసితస్నాతక వేదవ్రతములు**
**చేసి, కాశీ యాత్ర శ్రీహరిచనఁగ**
**వాసిగా తోయధి వచ్చి ప్రార్థించి ( సముద్రుడు)**
**కపటనాటక! నీవు కాశికేగెదవె?**
**ఇపుడు నా సుతను నీ కిచ్చెద ననుచు"**

సుభద్రా కల్యాణములో ఇంత విస్తృతంగా కల్యాణవర్ణన కనిపించదు. దానికి కారణం అర్జునుడు సుభద్రను బలవంతంగా తీసుకెళ్ళిపోయాడు.

"అనుచు బుద్ధులు చెప్పి అరుగు మరదల్ని
అర్జును చేతి కొయ్యన నప్పగించి" రుక్మిణి ఆశీర్వదించింది.
"అలరెడి వేడుకల ననుగు మరదలిని
హేమపీఠమ్మున నునిచిరివారు
అక్షతల్ శిరసుపై నా యిర్వు రుంచి
ముత్య రత్నములు ముగుదయొడినిడిరి " ఒడిబియ్యం కడతారు.
ఈనాటికీ తిమ్మక్క చేసిన వివాహవర్ణన సమయోచితంగా ఉంది.

సుభద్రార్జునుల శోభనాన్ని తిమ్మక్క విస్తారంగా వర్ణించింది. ఈ వర్ణనలు తర్వాతి నాయక రాజుల కాలంలోని ముద్దుపళని వంటివారి వర్ణనలకు తలస్పర్శిగా ఉన్నాయి. రంగాజమ్మ తన ప్రియుడైన విజయరాఘవుని గూర్చి ఆశువుగా చెప్పిన పద్యం బాగా ప్రశస్తం.

"ఏవనితల్ మమున్ దలప నేమి పనో? తమ రాదువారు కా
రో వలపించు నేర్పెరుగరో? తమ కౌగిలిలోన నుండగా
రావది యేమిరా? విజయరాఘవ యంచిలుదూరి బల్మిమై
తీవరకత్తెనై పెనగి తీసుకవచ్చితినా తలోదరీ!

శోభన మందిరానికి వెళ్ళే సుభద్రను తిమ్మక్క సుదీర్ఘంగా వర్ణించింది. రాధికా సాంత్వనంలో ఇలాంటి వర్ణన కన్పిస్తుంది. తన భర్తకు వేరొక వనితతో రెండో వివాహం అయితే, మాత్సర్యం లేకుండా కొత్త పెళ్ళి కూతుర్ని సింగారించి భర్త దగ్గరకు పంపడానికి ఎంత గుండె నిబ్బరం కావాలో ఊహించవచ్చు.

"చనుదెంచెపాంచాలి సంభ్రమమ్మునను
భద్రేభగమన సుభద్ర!రమ్మనుచు
చేడె శృంగారమ్ము చేయంగఁ దలఁచె
పన్నీటస్నానంబు బాగుగా నార్చి
తడిబోసి కట్టించె ధవళ వస్త్రమ్ము
విసనకర్రల గాలివీచె నిరుదెసల (మన Hair Dryer లాంటివి లేవు).
పొసగగా తడియార్చె పొలతిశిరస్సు
ధూపవాసనలతో దులిపెనల్లార్చి
గొజ్జంగి రేకులు కొప్పున దురిమె
ఒడ్డాణమును బెట్టె నూగాదు మొలను
బిళ్లల మొలనూళ్లు బిగిసి మ్రోయఁగను
ఘంటల మొలనూళ్లు ఘల్లున మొరయ
కంఠహారమ్ములు కౌస్తుభమణులు
కాలి పెండెము గూర్చె ఘనతతోడుతను
అందెల దిద్దె నా యతివ సుభద్ర
తళుకు మించిన సందిదండలపైని

నెలవంక తాయెతుల్ నెరివుట్ట గట్టి
శ్రీకారములతోడ బెలగాడు చెవుల
కమలాక్షి పంజుల కమ్మలే పెట్టి
సొమ్ము లన్నిటిమీద శోభిల్లు నట్టి
మూడు వేలుంజేయు ముక్కర పెట్టి
కుంకుమ గంధము కూర్చె నాయింతి
గోవకస్తురి బూసె కొమరాలిమేన"

ఇది నూత్న వధువు సర్వాంగ శోభనాలంకృతవర్ణన. కళ్లకు ఒక 'ఐశ్వర్యారాయ్' కనిపించే వర్ణచిత్ర సమ్మేళనం. సుభద్రకు అరణంగా శ్రీకృష్ణుడు విశేష రథ,గజ,తురగ,పదాతులు సమర్పించాడు. ఇప్పుడు కట్నకానుకల రూపంలో కారు, ఆభరణాలు ఇవ్వడం ఆనవాయితీ! ఇక్కడ రమాపరిణయములో వెంగమాంబ-

"సహజంబుగాను శ్రీసతికి వేడుకను
పరంగముత్యపు టొడిబ్రాలు గట్టించి
మురిపంబుమీఱ నా ముద్దుపట్టికిని
అరణంబుగాను దివ్యాశ్వబృందములు
కరిరథావళులను గల పదార్థముల
దాస దాసీజన తతులతో నిచ్చి
వాసుదేవుని వెంట వచ్చె నత్తరిని."

వివాహశోభ కూడా పాణిగ్రహణంతో పూర్తి అయింది. సముద్రుడు తన తనయ అయిన రమాదేవిని -

"నవ్యభూషణములు నవ్యవస్త్రములు
దివ్యగంధంబులు దివ్యమాల్యములు

కమలాక్షునకు రమాకన్యకామణికి
ప్రమదంబుతో సమర్పణ మొప్పంజేసి
ఘనముగా నారమాకన్యకామణిని
కరుణించి హరి కరగ్రహణంబు చేసె
నిరుపమంబగు దరనిభకంఠమందు
సురుచిరమంగళ సూత్రంబు కట్టె"

తలంబ్రాలు పోసుకోవడం, లాజహోమం వంటివి జరిపారు. నాలుగో రోజు రాత్రి బువ్వము బంతి జరిగింది. ఈ తంతు యిప్పటికీ జరుగుతోంది వరుస అయిన బావమరదళ్లు ఒకరి నొకరు ఎత్తిపొడుపు మాటలతో కవ్విస్తారు. భార్యాభర్తలు ఒకరి విస్తట్లో మరొకరు ఎంగిలి అన్నం వేసుకొంటారు. ఇప్పటికీ పెళ్లి ముందు రోజు రాత్రి తొలి బువ్వము, మర్నాడు హరి బువ్వము - సరసమృదులోక్తులతో సాగుతాయి. బువ్వంబంతిలో వడ్డించిన భోజన పదార్థాల ఘుమఘుమలు చవిచూద్దాం-

"పరంగ నచ్చట పైండి పళ్లెరా లుంచి
గరిమతో పాత్రాభిఘోరంబు చేసి (అభిఘరణ యిప్పటికీ వుంది).
బహువిధ భక్ష్యముల్ పక్వశాకములు
తరచైన ఘృతము, దుగ్ధములు, తేనియలు
పెరు, గూరుగాయలు ప్రియముగా తెచ్చి
వరుసగా వడ్డించి, వాసించు జలము
కరమొప్ప సౌవర్ణ కలశాళినిండ -"
పెండ్లి విందు భోజనం మనమూ రుచి చూశాము.

ఈ సందర్భంలో కృష్ణరాయల వర్ణన యందలి భోజన సమయ ప్రియోక్తులు గుర్తుకు వస్తాయి. విష్ణు చిత్తుడు అతిథులకు భోజనాలు పెట్టి ఇలా అనేవారు-

"ఆ నిష్ఠానిధి గేహసీమ నదురే యాలించినన్ మ్రోయు నెం
తే నాగేంద్రశయాను పుణ్యకథలున్ - దివ్య ప్రబంధాను సం
ధాన ధ్వానము నాస్తిశానక బహుతా నాస్త్యుష్ణతా నాస్త్యపూ
నాస్త్యోదన సౌష్ఠవంచ కృపయా భోక్తవ్యమన్ మాటలున్"

ఏమైనా తెలుగువారి భోజన పరాక్రమం శ్రీనాథుడి మొదలు అందరూ వర్ణించారు.

ఇక సరసోక్తులు బువ్వంబంతిలో ఎలాకొనసాగాయో చూద్దాము.

శంకరుడు తన భుక్త శేషాన్ని వేంకటేశ్వరుని పళ్ళెంలో వేసినపుడు ఆ యిద్దరి మధ్యసాగిన సరససంభాషణలు, పార్వతీ పరమేశ్వరులు సరసమాడుకొన్నారట)

"జలజాక్ష! వినుము నీచపలత్వసరణి
కనుకొన గోపసుందరులకే తెలుసు
నే నిందు చెప్పిన నిన్ను నవ్వెదరు
కాన చెప్పను రమాకన్యను జూచి
కాచెద నేడు నీ గౌరవంబనుచు
సూచింప, హరి హరుఁజూచియిట్లనియె:
నిటలాక్ష! వినుము నీ నిశ్చలత్వంబు
దిటవైన మోహినీ దేవికే తెలుసు
చలపాది నీ కామ సంకల్పసరణి
లలిమీర బ్రహ్మాదులకు నెల్ల దెలుసు
చెలఁగి యిందామాట చెప్పిన నీకు
తలవంపులని నేడు తాళియున్నాడ"

ఈ విధంగా హరిహరుల సరసోక్తులు కొనసాగాయి.

ఏకసెక్కము లాడడంలో స్వామి దశావతార వర్ణనను వెంగమాం
గంభీరంగా వర్ణించింది–

"పొసఁగ నాకలిదీర భుజియింపవోయి
మీనరూపముదాల్చి మెండుగా జలము
పానంబుఁజేసినప్పటి వలెగాదు
ఈ నిర్మలాన్నంబు లిచ్చుట నీవు
పూని ఆకలిదీర భుజియింపవోయి
పరఁగతాఁబేలివై స్వల్పజంతువుల
నరుదుగా భక్షించినటువలెఁగాను
అలర నీకుడుములు నతిరసంబులును
పాలుపొంద తృప్తిగా భుజింయింపవోయి
దొరకొని పందివై తుంగ గడ్డలను
గరగరన్ నమలిన క్రైవడిగాదు
కరజికాయలు వడల్ గారె లిడ్డెనలు (ఇడ్లీసాంబారు)
పొరిపొరి రుచులుగా భుజియింపవోయి
పూని నృసింహరూపున దైత్యు రక్త
పానంబు జేసినప్పటిరీతి గాదు
తెలివితో నిప్పుడు తేనె పానకము
నలువొప్ప నీవు పానము సేయవోయి
సలలితంబుగ బ్రహ్మచారి వ్రతముల
అలసి యీవరకు, గృహస్థుడైనావు
విమలాత్మ! నియమముల్ విడిచి యీ వేళ
భ్రమదీర నన్నియు భక్షింపవోయి
లలిని బ్రహ్మఋషిత్వ రాజ ఋషిత్వ

ముల కాయ పండ్లు నిమ్ముగ మెక్కి, దాన
తనియక వెన్న ముద్దలు మ్రుచ్చిలించి
తిని దిగంబరుడవై తిరిగిన నాటి
బడలిక దీర నీ పరమాన్నమెల్ల
తొడరి నీ వాచేరతో ద్రావవోయి
కలికితనమున నాకలి తీరఁబోదు
కులుకుచు నిపుడు సంకోచింపవలదు
ముజ్జగంబుల కాదిమూలమైనట్టి
బొజ్జనిండఁగ నీవు భుజియింపవోయి"

ఎంతటి భావగర్భితమైన వర్ణన!-

వేంకటాచల మాహాత్మ్యంలో ఇదే వివాహ సందర్భంలో వెంగమాంబ ఒకే సీసపద్యంలో పెళ్ళి తంతు జరిపించింది.

సి. "ఆ చక్రి కాచమనార్ఘ్యముల్, మధుపర్క
మిచ్చి, పద్మావతి నివలఁబిలిచి
జగదీశుఁ దవలనుండఁగ నిర్వురకు మధ్య
మున తెరగట్టించి, మొదట నత్రి
యనుమతంబున నృపుఁ "దత్రి గోత్రజ సువీ
రక్షమానాథపుత్రక సుధర్మ
రాజాత్మజుఁడ నభోరాజాత్మజుఁడను నేను
నా కన్య నిచ్చెద నీకుఁ గరుణ
అగ్ని సాక్షిగ చేపట్టు మంబుజాక్ష!
అనఁగవిని చక్రి సంతోషమతిశయింప
సకల సురముని ముఖ్యులు సాక్షిగాఁగ
నా వసిష్ఠానుమతి నిట్టు లనియె నపుడు.

వ. వసిష్ఠ గోత్రోద్భవ శూరసేనాత్మజ వసుదేవపుత్రుండనై వాసుదేవా భిధానంబునొంది శ్రీ వేంకటేశ్వరుండనైన నేను ఈ అత్రిగోత్ర సంజాతయైన పద్మావతి నగ్ని సాక్షిగా పాణిగ్రహబుఁ జేసెదనని పల్కె."

వెంగమాంబ శారదామూర్తిని ప్రసన్నురాలిని చేసుకొన్న ధన్యజీవి. శారదాస్తుతిని ఆమె మూడు పద్యాలలో వేంకటాచల మాహాత్మ్య అవతారికలో చేసింది-

"అలఘనభంబునుండి విమలాక్షర పంక్తులరీతి వచ్చి నే
నలసతఁ జెందియున్న తరి నాననమందు వసించి, జ్ఞానమున్
కలుగఁగఁజేసి మానసవికారములన్ తొలఁగించి, జిహ్వపై
నిలిచి నటించు శారదను నిత్యము సన్నుతి సేయుచుండెదన్.

అక్షీణాక్షర పంక్తిరీతి మును మధ్యాహ్నంబునన్ నాకుఁబ్ర
త్యక్షంబై, గురు నాది పూరుషునిఁ బ్రత్యక్షంబు గావించి, చి
త్సాక్షే బ్రహ్మమటంచుఁ జూపుచుఁదర్థంబున్ గృపం జెప్పి, నన్
రక్షింపన్ పనిఁబూను భారతిని గీర్వాణిన్ ప్రశంసించెదన్

పంకేజాసను డనే పద్యంతో భారతీ ప్రశంస 3 పద్యాల్లో సాగింది.

వెంగమాంబ హయగ్రీవుని, విష్వక్సేనుని, గోవిందరాజస్వామిని, కోదండరాముని, శ్రీకృష్ణుని, వరాహస్వామిని, నారసింహుని, వేంకటేశ్వరుని స్తుతించింది.

"తిరమై శ్రీ అలమేలు మంగ యురమందే నిల్చి దీపింపఁగా
జరమైశ్వర్య ధురంధరుండగుచు నా పాలన్ కృపన్ నిల్చి, సుం
దరదివ్యాకృతి నప్పటప్పటికి మోదంబొప్పఁగాఁ జూపి, మ
ద్వరదుండై తగు వేంకటాచలపతిన్ వర్ణింతు నశ్రాంతమున్"

# మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ

# దాన పత్రాల్లోని ధార్మిక సామాజిక దృక్పథం

-- శ్రీ గోపికృష్ణ

మంత్రరాజాయ విద్మహే ! మహామంత్రాయ ధీమహి । తన్నోయంత్రః ప్రచోదయాత్ । ఉగ్రంవీరం మహావిష్ణుం । జ్వలంతం సర్వతోముఖమ్ । నృసింహం భీషణం భద్రం మృత్యు (మృత్యు) మృత్యుం నమామ్యహమ్। ఇది నృసింహమంత్రం. ఒక 'మృత్యు' పదం ఎక్కువగా వుంది. శిల్ప పొరబాటు కావచ్చు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ యీ నృషింహ మంత్రాన్ని జపించేవారు. రాగి (తామ్ర) ఇత్తడి లోహ మిశ్రమాలతో దళసరిగా ఒక రేకు తయారు చేయించి, దానిమీద యంత్రం చెక్కించి ఆ యంత్రంమీద మంత్రం రూపొందించి తన పూజాగృహంలో దానిని పూజించేవారు. ఈ యంత్రరేకుతో బాటు, శ్రీలక్ష్మీనృసింహ, శ్రీ వేంకటేశ్వర, ఆంజనేయస్వామి వగైరా లోహవిగ్రహాలు కూడా ఆమె పూజా మందసంలో పూజింపబడేవి. అవి మితమైన పరిమాణంలో వుండేవి. ఆమె ఇల్లు తిరుమల ఉత్తరమాడ వీధిలో శ్రీవరాహస్వామి గుడికి వెనుకవైపు వుండేది. ఆమె ఇంటికి తూర్పున తాళ్లపాకం వారి ఇల్లు వుండేది. పడమర అప్పట్లో సర్కారు అర్చకులైన అక్కారాం వేంకటరామయ్య దీక్షితుల ఇల్లు వుండేది. ఇరుగు పొరుగు సంబంధాలు అంత బాగున్నట్టు తోచదు. అయినా, ఆమె తన పూర్వకవుల స్తుతులలో అన్నమాచార్యులను పేర్కొన్నది. ఆమె హయగ్రీవ మంత్రోపదేశం పొంది కవయిత్రి అయినదంటారు.

ఆమెకు తిరుమలమీద రెండు పూదోటలుండేవి. ఒకటి ఆమె ఇంటికి దగ్గరలోనే వుండేది. మరొకటి గోశాల, డి.పి.డబ్ల్యు స్టోర్స్ ప్రాంతంలో అమ్మోరు బావికి ఆనుకొని వుండేది. ఈ అమ్మోరు బావి తరిగొండ వెంగమాంబదే. దాని గట్టుమీద ఒకరాగి చెట్టు వుంది. ఈ బావి యిప్పుడు వుందిగానీ, పూదోట దేవస్థానం వారి బాట గంగమ్మతోటలో కలిసిపోయింది. ఇంటికి దగ్గరగా వున్న పూదోటలో ప్రస్తుతం ఒక ప్రైవేటు కాన్వెంట్ స్కూలు వుంది. ఆ స్కూలు ఆవరణలోనే

ఆమె సమాధి, దానిమీద ఒక మండపం వున్నాయి. సమాధికి ఆనుకొని ఒక పెద్దబండ వుంది. దానిమీద కూర్చుని ఆమె తిరుమల శ్రీవారికి పూలమాలలు కట్టి సమర్పించేదట. ఆబండ- రెడ్ సాండ్ స్టోన్. తిరుమలలో అలాంటి శిలలు మామూలే కాని, అంత పరిమాణం గల చదునుగా వుండే బండ ఏదో ఒక పేటిలో భాగంగా వుండి వుంటుంది. దాని క్రింద సొరంగం వుందని అందులో పోతే, అది రెండు దారులవుతుందని ఎడమవైపుపోతే, తుంబురు తీర్థంలోని తరిగొండ వెంగమాంబ గుహకు పోతుందని, కుడివైపు పోతే శ్రీవారి ఆలయానికి రహస్యంగా పోవచ్చునని చెప్పేవారు. ఆబండ ఎత్తి చూస్తే బిలం పూడిపోయివుంది. సొరంగం కనబడలేదు. ఒకసారి ప్రఖ్యాత కవి, పండితుడు, పరిశోధకుడైన స్వర్గీయ జీరెడ్డి చెన్నారెడ్డి గారు వచ్చి యీ సమాధి మండపాన్ని చూసి, క్రిందికి త్రవ్వితే అలాంటి మండపమే క్రింద మరొకటి వుండవచ్చుననీ అందులో ఆమె వస్తువులు, ఆమె స్వయంగా రాసిన తాళపత్రప్రతులు వుండవచ్చునని, అలా చాలా చోట్ల బయట పడినాయనీ చెప్పారు. కానీ ఆ ప్రయత్నం ఎవరూ చేయలేదు. ఆ మండపం క్రింద త్రవ్వనూలేదు.

సమాధి పైన- అంటే మండపములో తులసి కోటవుంది. ఆ తులసి కోటకు తూర్పువైపు వెంగమాంబ పాదాలు శిల్పించిన శిలను అట్టిపెట్టారు. పశ్చిమవైపు ఒక ఆంజనేయస్వామి ప్రతిమను (ఎట్టిని సబ్బురాయి శిల్పం) తులసికోటకు ఆనించి ప్రతిష్ఠించారు. ఈ ఆంజనేయస్వామి అరచేయి ఎత్తుమాత్రం వున్నా అందులోని శిల్పకళా సూక్ష్మరీతులు అసాధారణమైనవి. ఈ తోటలో ఒక నేరేడు చెట్టు వుండేదట. దాని మొదలులో యీ విగ్రహాన్ని పెట్టి వెంగమాంబ పూజించేదట. ఆ చెట్టు ఎండిపోగా యీ విగ్రహానికి నీడ కరవై యిక్కడ ప్రతిష్ఠించారని ధర్మకర్త చెప్పారు.

అప్పటి ధర్మకర్త జి.వి.ఎల్. ఎన్. మూర్తి (గండేపల్లి వేంకటలక్ష్మి నరసింహమూర్తి). ఆయన స్నేహం లభించగా తరిగొండ వెంగమాంబ యింటిని

1973వ సం॥లో- అంటే 33 సంవత్సరాల క్రితం శోధించాను. అక్కడ దాదాపు 35 తాళపత్ర దాన పత్రాలు, వాటి నకళ్లు రాసిన ఒక నోటు పుస్తకం, ఆమె చరిత్ర రాసిపెట్టిన ఒక నోటు పుస్తకం, వంశ వృక్షం రాసి పెట్టిన ఒక పెద్ద కాగితం, మూర్తిగారి తండ్రి స్వర్గీయ గండేపల్లి కుప్పయ్య శర్మ 1941వ సం॥లో ప్రచురించిన ఒక కరపత్రం, 1939 సం॥లో ఎం. కృష్ణమాచారియర్ అనే జడ్జి గారిచ్చిన తరిగొండ వెంగమాంబ మఠానికి చెందిన సర్టిఫికెట్, పి. ముత్తు కృష్ణనాయుడు అనే జిల్లా మున్సిఫ్ 15-4-1946వ తారీఖున ఎండార్స్ చేసిన, లభ్యమయ్యాయి. ఇవి కాక, కాగితాలలో రాయబడిన రెండు మూడు భూదాన పత్రాలు, తలా తోకాలేని తరిగొండ వెంగమాంబ కృతులకు చెందిన, చిరిగిపోయిన తాళ పత్రాలు కూడా దొరికాయి. ఆమె స్వయంగా లిఖించిన ఒక గ్రంథం కూడా లభ్యం కాలేదు. అప్పుడు జీరెడ్డి చెన్నారెడ్డి గారు చెప్పినది నిజమేమో ననిపించింది. మనకు లభ్యమైన ఆమె రచనలన్నీ ఆమె స్వయంగా రాసినవి కావు. వాటి నకళ్లు మాత్రమే.

ఆమె జీవన కాలంలో 'అష్టఘంటాలు' అను పేరుతో ఎనిమిది మంది సంస్థానాధిపతుల లేఖకులు ఆమె రచనలను కాపీ చేసే వారట. అందువల్ల ఆ కాపీలు రాష్ట్రమంతటా వ్యాపించి మనకు లభ్యమయ్యాయి. ప్రస్తుత తి.తి.దే. తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టుకు చెందిన కె.జె. కృష్ణమూర్తి గారు అప్పట్లో తరిగొండ వెంగమాంబ మీద పరిశోధన చేస్తూ థీసిస్ రాయడానికి తాళపత్రాలలో నున్న దాన పత్రాలను అడిగారు. ఇచ్చాను. ఆయన పని పూర్తవుతూనే తిరిగీ తీసికొని వచ్చి యిచ్చారు. నా దగ్గర వుంచుకోకుండా ధర్మకర్త మూర్తిగారి దగ్గర అవి యిచ్చి, భద్రపరచమన్నాను. ఆయన తీసికొని పోయి ఎక్కడ పెట్టాడో ఏమో? అవి తిరిగి కనబడనే లేదు. అది తరిగొండ వెంగమాంబ మాయ అనిపించింది. నా దగ్గర వాటి నకళ్లు వున్నా, అవి పోగొట్టుకున్నందుకు బాధగా వుండేది. కుప్పయ్యశర్మగారు తన కరపత్రంలో ఆ దానాదుల ఆదాయం 1941వ సం॥ నాటికే నిలిచిపోయిందని రాయగా చదివి, ఆ బాధోపశమనం పొందాను. అంటే అవి వుపయోగపడని దాన పత్రాలు.

ఇక, తరిగొండ వెంగమాంబ చరిత్రము. ఈ రాతప్రతిని ఎవరు రాశారో తెలియదు గానీ, ప్రారంభంలో 'శ్రీ వేంకటేశ్వర భక్త విజయం' అని రాశారు. కాబట్టి ఆ పేరు గల పుస్తకం నుంచి గ్రహించారనుకోవచ్చు. వచనము, మధ్యలో పద్యము లున్నవి.

ఇక. వంశవృక్ష కాగితమును గురించి వెంగమాంబ బాలవితంతువు. ఆమెకు సంతానం లేదు. ఆమె చెల్లెలు మంగమ్మ లేదా చెంగమ్మ. దేవస్థాన కైంకర్యపట్టీ 1230 ఫసలీ నాటిది. అనగా క్రీ.శ. 1821 నాటిది. అందులో 'తరిగొండ వెంగమ్మ యిలాకా అయింర్బ వంగమ్మ' అని రాసివుంది. కాబట్టి, యీ వంశవృక్షము ఆమె వారసుడైన గంగాధరప్పది కావచ్చు. గర్నిమిట్ట గ్రామం. టేలర్ దొరగారి దర్యాప్తుకోసం దీనిని తయారు చేశారు. దీనివల్ల మనకు ఏ వుపయోగమూ లేదు. జడ్జీగారిచ్చిన సర్టిఫికేట్టు కూడా అంతే - మన వరకు నిరుపయోగం. లేదంటే, అందులో ఒక మాట వుంది. తరిగొండ వెంగమాంబ అప్పటికి 150 సంవత్సరాలకు మునుపు. జీవించి వుండినదని. 1939లో అలా రాశారు గాబట్టి, అప్పటికి 150 సం॥ మునుపు అంటే క్రీ.శ. 1789లో జీవించి వుంది- అన్నమాట. అది మాత్రం నిజం.

గండేపల్లి కుప్పయ్య శర్మగారి కరపత్రంలో ఆమె జననాన్ని గురించి పేర్కొనలేదు గానీ, సాయుజ్యాన్ని గురించి పేర్కొన్నారు. శాలివాహనశకం 1738 ఈశ్వరనామసంవత్సరం శ్రావణ శుద్ధ నవమినాడు వెంగమాంబ జీవన్ముక్తురాలయినదని, దీనిని ఆయన భక్త విజయాద్యనేక గ్రంథోదాహరణముల వలన. తెలిసికొన్నాడట. ఇది గ్రాహ్యముగా నున్నది. ఎందుకంటే దీనికి సమానమైన ఆంగ్ల తారీఖు 7-8-1817 సం॥. ఈమెకు దానములు లభ్యమైనది దాదాపు పాతిక సంవత్సరాలు- అనగా క్రీ.శ. 1785 నుంచి క్రీ.శ. 1809 వరకు మాత్రమే. ఇక ఆమె ఏడెనిమిది సంవత్సరాలలో సాయుజ్యము చెందబోతున్నదనగా దానములు ఆగిపోయాయి. దేవస్థానము వారు కూడ క్రీ.శ. 1802 నాటి 17 నంబరు దఫ్తరం బాబత్తులో గానీ, క్రీ.శ. 1818 నాటి సవాల్

జవాబ్ పట్టికలో గాని ఆమె పేరు వుదహరించకపోయినా, క్రీ.శ. 1821 నాటి కైంకర్య పట్టికలో ఆమె యిలాకా వారిని చేర్చారు. ఇది ఆమె కాలధర్మం చెందినాకనే సాధ్యం. సి.పి. బ్రౌన్ గారు 1840 ప్రాంతంలో ఆమె జీవించివున్నట్టు తెలిసిందని రాశారు. విద్యార్థి కల్పతరువు వారు 1850 లో ఆమె పుట్టినట్టు రాశారు. ఈ రెండు సాధ్యం కాదు. అప్పటి కామె జీవించివుంటే, తదుపరి వచ్చే ఈశ్వరనామ సం॥లో అనగా 1877లో సాయుజ్యం పొందియుండాలి. అంత దాకా అంటే 127 సం॥ జీవించినదని విశ్వసించలేము. కాబట్టి సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు పేర్కొనినట్టు, క్రీ.శ. 1750- 55 ప్రాంతంలో ఆమె జన్మించినట్టు క్రీ.శ. 7-8-1817న సాయుజ్యం పొందినట్టు, అనగా ఆమె దాదాపు 67 సం॥ జీవించినట్టు నిస్సందేహముగా చెప్పవచ్చు. వెంగమ్మ యోగిని కాబట్టి 127 సంవత్సరాలు జీవించి వుండవచ్చు గదా- అని అనుకుందామంటే అప్పటి కామె పుస్తకాలు అచ్చయి వుండాలి. ఎందుకంటే, తెలుగులో పుస్తకాల ప్రచురణ 1820 ప్రాంతంలోనే ప్రారంభమైంది. ఆమె రచనలు అచ్చులో - ఒకటి గూడ, ఆమె యింటిలో లభ్యం కాలేదు. ఇక యీ తేదీల కుస్తీ పట్లు యింతటితో వదలిపెడదాం.

## ముత్యాల హారతి

ముత్యాల హారితి అంటే ఒక ఇత్తడి తట్టలో మైనం లేదా గోదు పూసి, వెండి గుండ్లతో విష్ణు దేవుని దశావతారాలలో ఒక అవతార బొమ్మను స్వరూపం కనబడేటట్లు అతికించి, అందులో ఫల పుష్పాదులు, పసుపు, తాంబూలం పెట్టి కర్పూర హారతి యివ్వడం. రోజుకొక్క అవతారం వెండి గుండ్లతో ఏర్పఱచి శ్రీ వేంకటేశ్వరునికి రాత్రులందు ఏకాంత సేవా సమయమందు చివరి హారతిగా యిస్తారు.

మునుపెన్నడో తరిగొండ వెంగమాంబ హారతి పళ్లెం తీసికొని శ్రీవారి ఆలయంలోకి తిన్నగా వెళ్లిందట. ఒక వితంతువు తమను లెక్కచేయకుండా

నేరుగా గర్భగుడి వద్దకు పోవడం చూసిన అర్చకులు అప్రతిభులై ఆమెను ఆక్షేపించి హారతి యివ్వకుండా వెనక్కు పంపారట. ఆమె యీ సంఘటనకు ఆశ్చర్యపడి ఎవరిని ఏమీ అనకుండా మౌనంగా వెళ్ళిపోయిందట. తరువాత బ్రహ్మోత్సవాలు వచ్చాయి. తేరునాడు కదలివస్తున్న రథం ఆమె యింటి ముందుకు రాగానే ఆగిపోయిందట. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ఆ కొయ్యతేరు. కదలనేలేదు. తరువాత అర్చకులు తరిగొండ వేంగమాంబ యింటిముందు యిలా జరగడంతో దీనికి కారణం వూహించి, లెంపలేసుకొని, తమ తప్పిదాన్ని మన్నింపమని వేడుకొని ఆమెను హారతి యివ్వమనగా అప్పుడెవ్వరో భక్తులిచ్చిన ముత్యాలు చేతిలో వుండగా, వాటినలాగే తట్టలో పోసి కర్పూర హారతియిచ్చి స్వామిని వేడుకొని రథం కదిలేలా చేసిందట. అప్పటినుంచి ఆమెకు నిత్యం ఏకాంతసేవలో ముత్యాలహారతి యిచ్చు మిరాశీ శాశ్వతంగా లభించింది. ముత్యాలు విలువైనవి. అవి ఒక్కటొక్కటి అదృశ్యం కాగా వాటి సైజులో వెండి గుండ్లు తయారు చేయించి, ముత్యాల స్థానంలో వాటిని వాడటం అలవాటై పోయింది. వారసులంతా ఆ పనే చేశారు. ధర్మకర్తగా నున్న జి.వి.యల్. ఎన్. మూర్తిగారు హఠాత్తుగా మరణించారు. ఆయనకు మగ సంతానం లేదు గాబట్టి చాలామంది వారసులమని పోటి పడినారు. ఎవరు నిజమైన వారసులో దేవస్థానం వారు తేల్చుకోలేక పోయారు. అందువల్ల, ఆ ముత్యాల హారితి ప్రస్తుతం దేవస్థానం వారే యిచ్చుకుంటున్నారు. ఈ పరిణామానికి వెంగమ్మ సంతోషించి వుంటుంది.

మూర్తి అయ్యవారు జీవించి వున్నప్పుడు ఒకసారి ఆయనను అడిగాను.'ముత్యాలహారతి నేను కూడా తీసుకపోవచ్చా?' 'అని మీరు కూడా తీసుకపోవచ్చు. అభ్యంతరం లేదు. అయినా పరిశీలించి చూడండి. తీసుకపోగలరేమో?' అన్నాడు ఆయన. ఒకసారి ఆ పరిశీలించే భాగ్యంకూడా కలిగింది. రాత్రి ఒంటిగంట కానస్తోంది. దర్శనానికి యింకా జనాన్ని పంపిస్తూనే వున్నారు. చలికాలం, పైగా వర్షం పడుతోంది. ఈదురుగాలి వీస్తోంది. మూర్తి అయ్యవారు ముత్యాలహారతి తట్ట పట్టుకొని పడికావలిలో కూర్చుని వున్నాడు.

సగం తడిసి చలికి వణకుతూ ఏకాంతసేవకు ఎదురు చూస్తున్నాడు. అది ఎప్పుడు జరుగుతుందో అంతవరకు నిరీక్షిస్తూ వుండవలసిందే. తప్పదు. ఆలోగా శ్రీవారికి నిద్రవచ్చినా ఏకాంతసేవకోసం నిరీక్షించవలసిందే. మనవారు పరుండబెట్టినప్పుడు పడుకోవలసిందే. ఒక్కోసారి అర్ధగంటకూడ నిద్ర పోనివ్వరు. వెంటనే సుప్రభాతం ప్రారంభమవుతుంది. అది పుణ్య సముపార్జన కానీ, లేక విధి నిర్వహణ కానీ సేవాపథంలో వున్నవారు రోజూ అనుభవించే ఆధ్యాత్మిక తాపమిది. ఇక, నిద్రలేని ఆ దేవుని సంగతి ఆయనకే ఎఱుక! మరల నేనెప్పుడూ ముత్యాల హారతి పళ్లెం మాట ఎత్తలేదు.

శ్రీవారి ఆలయంలో రహస్యపూజలు నిర్వహిస్తున్న వెంగమాంబను ఆలయం మూయక మునుపే అందులో దాక్కుని కనిపెట్టిన జానకీదాస్ మహంత్ ఆమె భక్తికి మెచ్చి ముత్యాలహారతి అనుమతించాడని మరొక కథనం.

## నృసింహజయంతి

తరిగొండ వెంగమాంబ జన్మస్థానమైన తరిగొండలో శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయముంది. ఆయన మజ్జిగ చిలికే కుండలో ప్రస్ఫుటమైనందున ఆ వూరి పేరు తరికుండ ఐనదని అంటారు. వెంగమాంబకు బాల్యం నుంచి ఆయనే ఆరాధ్యదైవము. వారి ఇంటి వేలుపు కూడ. అందువల్ల ఆమె తన రచనలను ఆయన పేరుతోనే ప్రారంభం చేసేది. తిరుమల శ్రీవారు కూడ విష్ణుఅంశ కాబట్టి, ఆయనలోనూ ఆమెకు నృసింహుడే కనపడేవాడు. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ చతుర్దశినాడు స్వాతీ నక్షత్రంలో నృసింహజయంతి తిరుమల ఆలయంలో జరుగుతుంది. అది జరిగిన పదిరోజులకు శ్రీవారి ఉత్సవమూర్తులైన మలయప్పస్వామి శ్రీదేవీ భూదేవీ సహితంగా ప్రదక్షిణా మార్గంలో వెంగమాంబ ఇంటికి మెరవణితో వచ్చి పూజలు గైకొన్న తరువాత ప్రసాదవితరణ జరుగుతుంది. తరువాత స్థల పరివెట్టము (సన్మానం) మొదట తాళ్లపాకంవారికి, తదుపరి వెంగమాంబ వారికి జరుగుతుంది. కైంకర్యము పూర్తయ్యాక వారసుల కిచ్చిన

వెండిదండం పడికావలిలో తీసికొన్నాక, స్వామి ఆలయానికి వెళ్ళిపోతారు. ఆ సందర్భంగా అన్నదానం జరిగేది. ఈ అన్నదానం చేయడానికి ఆమెకు డబ్బు కావలసి వచ్చేది. అందువల్ల ఆమె దానాలు స్వీకరించేది. ఆమె స్వీకరించిన దానాల వరుమానం ఆమె జీవితకాలంలో వచ్చేదేమో కాని, ఆమె వారసుల కాలంలో రాలేదు. గండేపల్లి కుప్పయ్యశర్మ కరపత్రం ప్రకారం 1941 నాటికి ఒక్క పైసా కూడా ఆదాయం రాకుండా ఆగిపోయాయి. ఆస్తులు చేతులు మారడంవల్ల అలా అయిపోయిందని ఆయన ప్రకటించారు. అంటే, అన్నదానం నిలిచి పోయిందన్నమాట. ఇక వారసుల ఆదాయాలూ అంతంత మాత్రమే.

పై కారణాలవల్ల నృసింహ జయంతి రోజు అన్నదానం గండేపల్లి కుప్పయ్యశర్మకు గానీ, ఆయన కుమారుడు జి.వి.యల్. ఎన్. మూర్తికి గానీ తలకు మించిన భారమైంది. ఏదో అయిందంటే అయిందని అనిపించేవారు. ఇక యీ దాన పత్రాలవల్ల లాభ మేమిటి? ఇప్పుడు తరిగొండ వెంగమాంబ యిల్లే లేదు. ఆ మాతృశ్రీ మఠమూ లేదు. ఏ యితర పేరుతోనూ సన్యాసినుల మఠం కూడా లేదు. ఆమె యింటికి. వచ్చే దేవుడు యిప్పుడు ఎక్కడికి పోతున్నాడో తెలియదు. మిరాశీలు రద్దయిపోయినాయి. హిందూ దేవాదాయ ధర్మాదాయశాఖవారిని సకాలంలో సంప్రదించి వుంటే ఆ ఆస్తులు మఠానికి వచ్చి వుండేవి. తదనంతరం శ్రీవారి ఆలయానికి చెందివుండేవి. తండ్రీ కొడుకు లిద్దరూ స్వర్గస్థులైనారు. ఇప్పుడు వారసులే లేరు. గతం గతః.

### దానపత్రాలు

దాన పత్రాలు తాళపత్రాలలో 31 వుండేవి. 1917వ సం॥నకు, 1920 సం॥నకు చెందిన రెండు దానపత్రాల నకళ్లను కాగితం మీద రాసి పెట్టారు. ఇంకొకటి ఏమీ చదువలేనంత అస్పష్టంగా వుంది. నా దగ్గర వున్న నకళ్లలో 23 మాత్రం వున్నాయి. తక్కినవి ఒకే రకమైన దానాలు కాబట్టి, మచ్చుకు ఒకటి రాసి, తక్కినవి వదలి పెట్టారనుకుంటాను. ఈ దానపత్రాలన్నీ శాలివాహన

శకము 1707 కలియుగము 4886 నుంచి అనగా విశ్వావసు చైత్రమాసం నుంచి శకయుగము 1730. కలియుగము 4909 విభవ ఫాల్గుణమాసంవరకు ఆంగ్ల సంవత్సరాలలో క్రీ.శ. మార్చి 1785 నుంచి క్రీ.శ. 19-2-1809 వరకు- అనగా పాతిక సంవత్సరాల కాలంలో యివ్వబడిన దానాలకు సంబంధించినవి.

ఈ సందర్భంగా అప్పటి రాజకీయ పరిస్థితులను క్లుప్తంగా తెలిసికోవాలి. విజయనగర సామ్రాజ్యము ఎప్పుడో అంతరించి పోయింది. గోలకొండ కుతుబ్ షాహీల సైన్యం యీ ప్రాంతాన్ని ముట్టడించింది. ఔరంగజేబు వారిని ఓడించి యీప్రాంతాన్ని మొగల్ సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. గోల్కొండ సుల్తానులు వారికి సామంతులుగా తిరిగి యీప్రాంతాన్ని పొందినారు. తరువాత, కొన్ని రాజకీయ పరిణామాలలో ఆర్కాటు నవాబు యీ ప్రాంత అధికారియై, చంద్రగిరి పాలకునిగా తన తమ్ముడు దోస్త్ ఆలీని నియమించాడు. అతనిని, అతని కుమారుణ్ణి మరాఠా యోధుడు రాఘోజీ భాంస్లీ కల్లూరు కనుమలో జరిగిన యుద్ధంలో సంహరించినాడు. ఈ రాఘోజీ భాంస్లే తిరుమల శ్రీవారిని దర్శించి ఒక పెట్టెడు నగలు దానంగా యిచ్చాడు. ఆ పెట్టెను రాఘోజీ వారి పెట్టె అంటారు. ప్రత్యేక సమయాలలో వాటిని వాడుతారు.

ఒక వైపు హైదరాబాదు నిజాములు, మరో వైపు కర్ణాటక నవాబులు, మధ్యలో ఆంగ్లేయులు, ఫ్రెంచివారు (తమ కిష్టమొచ్చిన వారి వైపు స్నేహం చూపిస్తూ) ఇంకో వైపు మరాఠులు సందట్లో సడేమియా అన్నట్టు ఇంగ్లీషు వారికి హైదరాలీటిప్పు సుల్తానులకు మధ్య మైసూరు యుద్ధాలు-, ఈ రాజకీయ అనిశ్చిత పరిస్థితులలో ఎవరు రాజో, ఎవరు నవాబో, ఎవరు ఏ ప్రాంతాన్ని పరిపాలిస్తున్నారో ప్రజలకే అర్థం కాలేదు.

అందువల్ల, తరిగొండ వెంగమాంబ దాన పత్రాలలో రాజులు కనపడరు. రాణీల దానాలూ లేవు. చంద్రగిరిలో ఆర్కాట్ నవాబు మహమ్మదాలీ యొక్క మరొక సోదరుడు అబ్దుల్ వహాబ్ వున్నాడు. ఆయన దానం చేయలేని స్థితిలో-

అంటే, తరిగొండ వెంగమాంబ ఏమయినా దానం చేస్తే తీసుకునే స్థితిలో వున్నాడు. హైదరాలీ వాడిని బంధించి శ్రీరంగ పట్నం కోట చూసి రమ్మని పంపించాడు. క్రీ.శ. 1782లో జరిగిన యీ దండయాత్రలో చంద్రగిరి కోటను వశవరచుకోవడానికి యీ జిల్లాలోని జమీందారులు, పాళెగార్లు అందరూ హైదరాలీకి సహాయం చేసినారు. ముఖ్యంగా చిత్తూరు పాళేగారు, కాళహస్తి, కార్వేటినగరం, వెంకటగిరి జిమీందారులు యింకా చిన్నా బిన్నాపాళెగార్లైన కరకంబేడు, మొగరాల, కల్లూరు బంగారుపాళెం, కృష్ణాపురం వగైరాలు వాడికి అండగా నిలిచారు. వారు చేసిన ఘనకార్యంవల్ల శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం శిథిలమైంది. అక్కడ తాళ్లపాక పెద్ద తిరుమలాచార్యుడు చేసిన జీర్ణోద్ధరణ వ్యర్థమైంది. పద్మసాలీలు, జాంద్రవారు పద్మావతీదేవి సంబంధీకులమని పోరాడుకొన్నప్పుడు, నోరు విప్పి తాను పద్మసాలీల యింటి ఆడబడుచునని సాక్ష్యం చెప్పిన పద్మావతమ్మ గుడి నేలమట్టమైంది. ఆ సందర్భంగా తాళ్లపాక చిన్నన్న తొండవాడలో కట్టిన తిమ్మప్ప ఆలయం కూడా ధ్వంసమైంది. అలిపిరిలోని లక్ష్మీనారాయణస్వామి పెరియాళ్వారుతో బాటు శిథిలమైనాడు. కపిలతీర్థంలోని నమ్మాళ్వారు గుడి, ఆ దారిలోనే వున్న తిరుమంగై ఆళ్వారుగుడి, పేరూరు బండమీది వకుళ మాళిక- యిలా ఎన్నో గుడులు చిరునామా లేకుండా అదృశ్యమైనాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, పాళేగార్లకు లంచాలిచ్చిన గుడులు నిలబడినాయి. తక్కినవి- అంటే డబ్బులేని పేద గుడులు దగ్ధమైనాయి. ఈ ప్రాంతమే కొల్లబోయిన యీ పరిస్థితులలో తరిగొండ వెంగమాంబ మఠానికి లేదా కొన్ని దానపత్రాలలో సూచించినట్టు సన్యాసినుల మఠానికి దానాలు యిచ్చేవారెవరు? అయినా యిచ్చారు కొందరు. అందులో పెద్దదానం దిండిగల్లు జమిందారు ఆరణి విజయవెంకటపతి రాజా బహదూర్ వారిది. వదమధుర, చిత్తూరు- అను రెండు గ్రామాలు దానమిచ్చాడు. ఆదాయం 4 వేల రూపాయలు. ఖర్చు ఆయనే సూచించినాడు. నృసింహజయంతి అన్నదానానికి 2160 రూ., శ్రీవారి నిత్య కర్పూర హారతికి 480 రూ., నిత్యతళిగకు 360 రూ., మనోవర్తికి

అంటే మనసుకు తోచిన ఖర్చుకు 1000 రూ. మొత్తం వెరశి 4 వేలు రూపాయలు. ఆయన దానమిచ్చిన చిత్తూరు గ్రామం మన- చిత్తూరు కాదు. దిండిగల్లు దగ్గర ఎక్కడో వుంటుంది. ఈ దాన పత్రం తారీఖు బుధవారం 19-8-1795.

పై దానం, మరొకటి గోలకొండ యిలాకా దానం తప్పితే తక్కినవన్నీ చిత్తూరు జిల్లాకే పరిమితమై వున్నాయి. దిండిగల్లు జమీందారు దానం రూపాయాలలో చెప్పబడింది. అన్ని దానాలు అలా లేవు. ఆనాటి అస్తవ్యస్త పరిస్థితులలో అనేక రకాల నాణేలు చలామణిలో వున్నట్టు యీ దానపత్రాల వల్ల అవగతమవుతోంది. అపరంజిరూకలు, తిరుపతి వరహాలు శంఖురూకలు, పూల వరహాలు కుంపిణి రూపాయలు యిలాంటివి కనిపిస్తున్నాయి.

ఇంకో విశేషం. క్రీ.శ. 1794-1795 సం॥ నాటికి అలమేలు మంగాపురం అంటే శ్రీనివాస మంగాపురమే కానీ, తిరుచానూరు కాదు. దాని తాలూకా కేంద్రం నాగపట్ల. అంటే, ఆరేపల్లి రంగం పేట దాటుకొని కల్యాణి డ్యాంకు యివతల వచ్చే ఫారెస్టు చెక్ పోస్టు. నాగపట్ల పేట అంటే భాకరాపేట. శ్రీనివాసమంగాపురంలోని అమ్మవారి గుడి కూల్చివేయడంతో, అదివరకు తిరుచానూరులో వున్న అలమేలు మంగమ్మను గోలకొండ సైనికులు భిన్నం చేయడంతో ఆ స్థానంలో క్రొత్తగా ప్రతిష్ఠించబడిన తిరుపతమ్మ విగ్రహాన్ని పద్మావతీదేవిగా వ్యవహరించడంతో ఆంగ్లేయులు కాలం నుంచీ తిరుచానూరు అలమేలుమంగాపురంగా మారిపోయింది. పాత అలమేల మంగాపురం, శ్రీనివాసమంగాపురంగా అవతరించింది ఈ దానపత్రాల పుణ్యమా అని యీ చిక్కుముడి వీడింది.

వడ్లలో ఎన్ని రకాలో రెడ్లలో అన్ని రకాలు అంటారు. స్వర్ణముఖీ తీర ప్రాంత గ్రామాలలోని రెడ్లను 'గొడుగు నాటి లేదా గొడుగూరు నాటి రెడ్లు' అంటారు. ఈ మాట ఎవరికయినా చెప్పాలంటే యిబ్బందిగా వుంటుంది. పాకనాటి, పోకనాటి, పలనాటి రెడ్లున్నారు గానీ, యీ గొడుగూరునాటి రెడ్లు

కొత్తగా వుందే అనేవారు. తరిగొండ వెంకమాంబ దాన పత్రాలలో యీ మాట లున్నాయి – తిరువిడయాట్టం, ఉల్‌మండలం–అని. ఈ మాటలను విశ్లేషిస్తూ శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు యీ విధంగా రాసినారు. 'తిరువిడయాట్టం గ్రామాలంటే యిదివరకే దేవునికి చెందిన దేవదాన గ్రామాలు. ఉల్ మండలం అంటే అంతర్భాగం (ఇన్నర్ సర్కిల్). అంటే గొడుగూరు నాడు' అని. ఈ మాట తొలుత ఆయన వాడడం వల్లే తెలిసింది. లేకుంటే యీ పేరు ఎలా వచ్చిందో తెలిసేది కాదు. ఆయన యింకా యిలా అన్నారు. తిరుచానూరు పేరు తిరుక్కుడవూరు నాడు. 'కొడ్డై' అనే తమిళ పదానికి గొడుగు అని తెలుగులో అర్థం. అంటే తొండమండలంలోని 'తిరుక్కుడవూరునాడు' గొడుగూరు నాడు అని పిలువబడింది. ఈ విశ్లేషణ చదివినాక గొడుగు నాటి రెడ్లకు ఆ పేరు ఎందుకువచ్చిందో తెలిసింది.

మాతృశ్రీ వెంగమాంబ మఠానికి దానం చేసిన వారిలో గ్రామ మునసబులు, కరణాలు, వ్యయసాయదారులు (కాపులు), పురోహితులు, కోమటి శెట్లు, ఫణాలవారు (చిల్లర వర్తకులు), బేరిశెట్లు, నూట యిబ్బంద్రు నగరం వారు (పట్టణంలో ప్రముఖులైన 102 మంది వర్తకులు), పాళేగార్లు వున్నారు. ఈ పాళేగార్లలో కొందరు గ్రామ మాన్యాలు పొంది పోలీసు డ్యూటీలు చేస్తూ, ఆలయంతోబాటు అందరికీ రక్షణ కల్పించేవారుగా వున్నారు. దిండిగల్ జమిందారుని దాతృత్వం యిది వరకే పేర్కొన్నాం. ఈ జమిందారుని, పాళేగార్లను వదలిపెడితే, సామాన్య ప్రజానీకం తమకు వున్నా లేకపోయినా వున్నదాంట్లోనే కొంతదానం చేసేవారంటే– అది కూడా ఆమె మఠాన్ని వెదక్కుంటూపోయి– వారి దానగుణాన్ని, శ్లాఘించవలసినదే!

దాదాపు అన్ని దానపత్రాలలో వెంగమాంబను యిలా సంబోధించినారు. "శ్రీ తిరుమల తిరుపతియందు శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకులైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సాన్నిధ్యమున శ్రీ మదఖండ సచ్చిదానంద నిత్యపరిపూర్ణులైన శ్రీతరిగొండ లక్ష్మీనృసింహస్వామి దివ్య శ్రీపాదారవింద మధుకరాయమాన మానసులైన మాతృశ్రీ వెంగమాంబగారికి శ్రీనృసింహోత్సవ

అన్నదాన ధర్మమునకు...." అని ప్రారంభం చేసి, తరువాత వారి చిరునామా వగైరా, దానం చేస్తున్న వివరాలు మొదలగునవి రాసేవారు.

కొన్నిటిలో 'వరుషాశన' అని రాసేవారు. వరుషాశన అంటే ప్రతి సంవత్సరము అలా యిస్తామని. ఎక్కువ వత్రాలలో ముగింపు "మీ శిష్య పారంపర్యముగా, మా పుత్ర పౌత్ర పారంపర్యము గాను, ఆ చంద్రార్కస్థాయిగా నడిపించుక రాగలవారం. ఈ ధర్మమును ఎవరైనా ఆక్షేపణ చేసినట్లయిన కాశీలో గోబ్రాహ్మణ వధ చేసిన పాపాన పోగలరు. యిందుకు సాక్షులు హరిహరాదులు." ప్రతి దానపత్రం హరిహరాదులను సాక్ష్యంగా పేర్కొనింది. వారు సాక్షులుగా వుండికూడా, కాశీలో గోబ్రాహ్మణ వధ చేసిన పాపం ఆరోపించ బడినా కూడా ఏ ఒక్క దానం చెల్లుబడి కాలేదంటే ఏమనుకోవాలి? వారికీ విషయం తెలియదేమో ననుకోవాలి. ధర్మశాసన దానపత్రం పూర్తవుతూనే రాసే యీ శ్లోకం ఎక్కువ పత్రాలలో వుంది. "స్వదత్తాద్విగుణం పుణ్యం, పరదత్తానుపాలనం, పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలంభవేత్॥" ఈ శ్లోకంతో దానపత్రం పూర్తవుతూనే సాక్షులు సంతకాలు చేసేవారు. ఇదీ దాని క్రమము. ఇంకా కొన్నింటిలో ఎక్కువ శ్లోకాలు వున్నాయి.

హైదరాలీకి అనుకూలంగా పోరాడిన పాళే గార్లు స్థానిక ఆలయాల విధ్వంసనకు పరోక్ష కారకులైనా వెంగమాంబ మఠానికి విరివిగా దానాలు చేయడం గమనార్హం. కల్లూరి పాళేగారు కల్లూరి రంగపతిరాజు తన ఆధీనంలోని గ్రామాల పురోహితులు, కోమటి శెట్లు, కాపులు, ఫణాలవారు సంవత్సరానికి తలా ఒక అపరంజి రూక యిచ్చులాగ ఏర్పాటు చేసినాడు. పుల్లూరు మొగరాల పాళేగారు రఘునాథ నాయనివారు సంవత్సరానికి ఐదు తిరుపతి వరహాలు యిచ్చులాగున, బంగారుపాళెం పాళేగారు చంద్రశేఖరనాయనింవారు తన గ్రామాల వారు 12 వరహాల వరుషాశన దానం యిచ్చు లాగున, మాముండూరు పాళేగారు రాజశ్రీ కృష్ణమ నాయనివారు పుదిపట్ల దగ్గర 97 గుంటల భూమి, సువర్ణార్ఘ్యములతో ఆ చంద్రార్కముగా అంకితం చేశాడు. అదే మామండూరు ముఖ్యపాళేగారు

వెంకటప్పనాయనింవారు అదే పుదిపట్ల గ్రామంలో 77 గుంటల భూమి, వెంగమాంబ సన్యాసినుల మఠానికని చెప్పి దానం చేశాడు. కరకంబేడు, పాళేవారు వీరరాఘవప్ప నాయనివారు తిరుచానూరు సమీపం తనపల్లి నల్లమాని కాల్వలో 100 గుంటల భూమి ఆ చంద్రార్కముగా సమర్పించినాడు. ఇంకా యితరులు చేసిన కొద్ది కొద్ది భూదానాలు వున్నాయి. నూట యిబ్బంద్రు నగరం వారు, తిరుపతిలోనూ, పీలేరు, రంగంపేట, భాకరాపేట(నాగపట్లపేట)లోనూ అపరంజి రూకలే దానం చేశారు. మంగళంపేట నూట యిబ్బంద్రు నగరం వారు సంవత్సరానికి యింటికి ఒక శంఖురూకను దానం చేశారు. పెనుమూరుపేటస్థలం వర్తకులు 102 మంది కూడ అలాగే చేశారు. మాదిరెడ్డి పల్లికి చెందిన ఓ పేద రైతు తనకున్న కొబ్బరి తోటలో రెండు కొబ్బరి చెట్ల ఆదాయాన్ని మఠానికి దానం చేశారు. మరొక దానంలో 8వ వంతు ధాన్యం మఠానికి మాటయిచ్చారు.

క్రీ.శ. 1794- 95 ఈ రెండు సంవత్సరాలకు చెందిన 10 దానపత్రాలలో దాదాపు 15 గొడుగునాటి గ్రామాల వారు నెలకు ఒక యింటికి మానెడు బియ్యం (అరకేజీకి పైగా) యిచ్చు లాగున రాసివుంది. మానికలు, కుంచాలు యిటీవలి వరకు వాడుకలో వుండేవి. మానికలు నాలుగైతే ఒక కుంచం. అంటే బల్ల అవుతుంది. కొన్ని గ్రామాలవారు సంవత్సరానికి 4 కుంచాల బియ్యం యిస్తామంటే, తొండవాడ గ్రామస్థులు మాత్రం సంవత్సరానికి రెండు పుట్ల వడ్లు, 4 అపరంజి రూకలు కూడా దానం చేస్తామన్నారు. పుట్టి అంటే 40 కుంచాలు. ఇవి చోళుల కాలం నాటి కొలమానాలు అలాగే పరంపరగా 1960 వరకు కొనసాగాయి. ఇప్పుడూ కొన్ని గ్రామాలలో వాడుకలో వుండవచ్చు. కొన్ని చోట్ల వీశెలు, శేర్లు, మణుగులు వాడుకలో వుండేటివి. అవి తూకానికి సంబంధించినవి. ఇప్పుడు కేజీలు, లీటర్లు వచ్చి వాటిని మింగేశాయి.

మూడు దాన పత్రాలలో వెంగమాంబ యాత్రీకుల దాహం తీర్చుడానికి చలువ పందిరులు అప్పట్లో నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. రాజకీయ అల్లకల్లోల పరిస్థితులలో ఏ మాత్రం భయం లేకుండా యాత్రీకులు కొండకు

వచ్చిపోయేవారంటే వారి ధైర్యానికి మెచ్చుకోవాలి. వారి దాతృత్వాన్ని కొనియాడాలి. ఇంగ్లీషువారి మీదకోపంతో కొందరు పాళేగార్లు యాత్రీకులను కనుమదారిలో దోచుకున్నా, వారు ఆగలేదు. ఎలాగో ఒక లాగ మన్రోదొర వారిని మట్టుపెట్టి, శాంతిభద్రతలు కాపాడి ప్రజా బంధువు అయినాడు.

తిరుమలలో శ్రీ వేంకటేశ్వరుని తరువాత దానములు స్వీకరించిన ఘనత శ్రీ తరిగొండ వెంగమాంబదే. ఆమె ముక్తికాంతా విలాసిని! నిత్య స్మరణీయురాలు. ఆమె స్మృతి మన కొక స్ఫూర్తి.

# తిరుమల వేంకటేశ్వరుడు - తరిగొండ వేంగమాంబ

-- శ్రీ జూలుకంటి బాలసుబ్రహ్మణ్యం

"వినరన్న నే జూచు వేంకటేశ్వరుడు
మిన మిన మని చాల మెరిసేటిదేమొ

గట్టిగా తలమీద గదియించి, దాని
చుట్టు పూదండలు చుట్టుకున్నాడు

లలిమించు మొసలి పిల్లలవంటివేమొ
తళుకుగా చెవులకు తగిలించినాడు

పచ్చ పచ్చటిదేమొ బహుశాన మేన
అచ్చుగా నందందు అతికించినాడు.

గల్లని కూశేటి గట్లు శ్రీపాద
పల్లవములయందు భరియించినాడు.

గుండూటి దొక్కటి కూసేటి దొకటి
రెండుచేతుల ధరియించియుండాడు

ఎడమచేతను కత్తి యిరవంద బట్టి
కుడిచేత ధరణిపై గురిపెట్టినాడు

నల్లని మొయిలువర్ణము గలవాడు
తెల్లనై తగు పట్టెతిరుమణివాడు

కలికి చూపుల గొప్ప కన్నులవాడు
మొలకనవ్వులవాడు ముద్దులవాడు

పసపు బూసిన పాత పై హోయల్ మీర
విసువక వలెవాటువేసి వేడుకను."

తిరుమల దివ్యక్షేత్రంలో కొలువైవున్న ఆనందనిలయుడు అదివో! దర్శించండి! కన్నుల కరవెల్ల తీరునట్లుగా నిలువెల్ల కన్నులు చేసికొని దర్శించండి! అదిగో! గజ్జెలు, అందియలు గల బంగారు పాదాలు, నిగనిగ కాంతులతో మెరయు బంగారు దోవతి, దానిపై బిగించి కట్టిన నందక ఖడ్గం! మొలనూలు. వరదహస్తం! కటిహస్తం, శంఖచక్రాలు! వక్షఃస్థలంపై ధరించిన మణికౌస్తుభం! మెడలో కంటె హారాలు, భుజకీర్తులు, నొసట సింగారంగా మెరుస్తూ వున్న తెల్లని పచ్చకప్పూరపు నామం! ఇలా, మణికిరీట మకరకుండలాలతో, శంఖ చక్రాలతో వరద కటి హస్తాలతో, చిన్మయదరహాసంతో దర్శనమిస్తూ వున్న శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యమంగళ విరాణ్మూర్తిని రెప్పలార్పక దర్శించండి!

ఓహోహో! ఏమి వైభవం! ఏమివైభోగం!ఏమి అందం! ఏమి చందం! ఏమి సొంపు! ఏమి సోయగం! ఏమి మైమరపు! ఏమి తన్మయత్వం! ఇలా భువనమోహన సుందరుడైన బ్రహ్మాండనాయకుడు ఎందరికో తన దివ్యమంగళ విగ్రహ దర్శనాన్ని అనుగ్రహిస్తూ వున్నాడు. ఎందరినో. . . .ఎంద రెందరినో ఎన్నెన్నో విధాల ఆకర్షింపజేసుకుంటూవున్నాడు. ఎందరినో తన దగ్గరకు రప్పించుకుంటూ వున్నాడు. అలా, వచ్చినవారు అందరిలో ఆనంద నిలయుని చిరుమందహాసానికి మరులుగొన్న వారు కొందరు! మకర కుండలాల కాంతి నిగనిగలాడుతూవున్న చెక్కిళ్ల చక్కదనానికి చిక్కిన వారు మరికొందరు! తెల్లనైన నామాల సొంపుకు సోలినవారు ఇంకొందరు! ఆ స్వామివారి కడకంటి చూపులకు కరిగిపోయినవారు నరికొందరు! పై చేతుల్లో శంఖ చక్రాలను ధరించి, క్రింది కటి, వరదహస్తాల సొంపైన భంగిమలో నిలిచిన స్వామివయ్యారానికి వశులైనవారు మరెందరో! జన్మజన్మాల పాపపంకిలాన్ని దర్శనమాత్రంచేతనే పునీతంచేసే దివ్యపాద ద్వయ సౌందర్యానికి దాసులై వచ్చినవారు ఇంకెందరో! ఇలా ఒక్కటేమిటి! ఒక్కరేమిటి! ఆ స్వామివారిని నిలువెత్తున అణువణువుచేత సమ్మోహింపబడి, నిరంతరం, దేవతలు, యక్ష, కిన్నర, గంధర్వాదులు, . . . మానవులు తిరుమలయాత్ర చేస్తూనేవున్నారు. కన్నులారా కన్నులనిండా శ్రీనివాసుని సమ్మోహన

రూపాన్ని దర్శిస్తూనే వున్నారు. ఆ దివ్య సుందర రూపాన్ని చూడటానికి రెండుకన్నులు చాలక, ఆ అద్భుత తేజోరూపాన్ని ఒకేసారి రెండు కన్నులతో దర్శింపలేక, మనసా వాచా కర్మణా మరులుగొని మళ్లీ మళ్లీ తిరుమలేశుని సందర్శనానికి వస్తూనే వున్నారు.

అనంతమైన యుగాల్లో తిరుమలేశుడు తన అద్భుత సౌందర్యంచేత భక్తులను ఆకర్షించుకొని దివ్య సందర్శన భాగ్యాన్ని కలిగించటం మాత్రమే కాదు; ఆ యా భక్తుల ఆర్తిని పోగొడుతూ ఆర్తత్రాణపరాయణుడై ఆ పరమాత్ముడు ఆ పరంధాముడు చేసిన లీలలు ఎన్నో! ఎన్నెన్నో! మహిమలు మరెన్నెన్నో!

భక్త వరదుడైన బాలాజీ ఒక భక్తుని మట్టిమూకుట్లో సంకటి కూడును తృప్తిగా ఆరగించి, అతని సంకటాల్ని పోగొట్టాడని విని ఆనందించాం! ఒక భక్తునికి అడిగిన వెంటనే తన ఆయుధాల్ని దానం చేసి, వట్టి చేతులతో నిలబడి, ఇప్పుడు చేతులుచాచి అడిగిన ప్రతి భక్తునికి దండిగా చేతులు నింపి పంపుతూ వున్న ఈ అడుగడుగు దండాలవాని మెండైన చేతలను మన మందరం అనుభవించి ఆనందిస్తూనే వున్నాం!

ఎందరో భక్తుల సంసారదాహాలను తీర్చే ఈ తిరుమలప్పడు తానే దప్పికగొని, తిరుమలనంబి అనే భక్తునిచేత తిట్టించుకుంటూ తృప్తిగా నీళ్లుతాగి దప్పి తీర్చుకొన్నాడని కూడా విని ఆశ్చర్యపడ్డాం! ఎందరెందరికో ఎన్నెన్నో జన్మాంతర వాసనల్ని మటుమాయంచేసే మాయలగాడైన ఆనంద నిలయుడు సువాసనలను గుప్పించే అనంతాళ్వానులవారిచేతి విరులకు మరులు గొన్నాడని కూడా విని విచిత్రపడ్డాం! తన సంకల్పమాత్రం చేతనే సర్వజగత్తులను ఆడిస్తూవున్న ఆనందనిలయుడు తన బంగారు మందిరాన్ని విడిచి, బైరాగిమఠానికి వెళ్లి, ఒక సన్యాసితో గవ్వలాటను ఆడుతూ ఆనందించినట్లు కూడా విని, అద్భుతానికి లోనయ్యాం! కాని . . . కానీ . . .

తిరుమల గోవిందుడు గోముగా మారాముచేస్తూ . . . ఒక పరమ భక్తురాలు ఇచ్చే దివ్యమైన కర్పూర నీరాజనం కోసం మంకుపట్టు పట్టి మరీ

కాచుకొని వున్నాడని మీరు ఎప్పుడైనా విన్నారా! ప్రతిరాత్రీ ఏకాంతసేవ అయిన తర్వాత, బంగారువాకిళ్లు మూసిన వెంటనే అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన కొండల రాయడు నేరుగా ఆ భక్తురాలి ఇంటికే వెళ్ళి, ఆమె పాటలు పాడుతూవుంటే తాను ఆడుతూవుండేవాడనీ, ఇంకా, ఆమె చెప్పే కబుర్లకూ, కథలకూ, ఊ కొడుతూ వుండేవాడని మీకు తెలుసా! అలా కాలక్షేపం చేస్తూ ఒకనాడు, వేంకటేశుడు ఆమె చేతిలో తన పట్టు వలువను విడిచి వెళ్లిన సంఘటనను గూర్చి వినడం పరమాశ్చర్యంగా వుంది కదూ. ఇంతమాత్రమేనా! పరంధాముడు ప్రతిరాత్రి ఏకాంతసేవానంతరం బంగారువాకిళ్లు మూసిన తర్వాత, ఆనందనిలయంలోనికి యోగమార్గంద్వారా వెళ్లి, స్వయంగా తనను అర్చించే భాగ్యాన్ని ఆమెకు కలిగించాడట! ఇదెంత పరమాశ్చర్యం! ఒక సందర్భంలో ఆ భక్తురాలికి జరిగిన అవమానం తనదిగానే భావించి ఆ బ్రహ్మాండనాయకుడు తన రథోత్సవాన్నే ఆపివేశాడట! ఇది పరమాద్భుతమైన సంఘటన కదూ!

అంతటి మహద్భాగ్యాన్ని పొందిన పరమ భక్తురాలు ఎవరు? ఇది ఏ వేదకాలంనాటి గాథో? ఏ పురాణ కాలంనాటి గాథో? అని ఆశ్చర్యపడుతూ, ఆసక్తిగా ఆనందనిలయుని లీలల్ని వినదానికి ఆత్రుతగా వున్నారా!

సమస్త లోకాలను కనుసన్నలలో నడిపించే కొండలరాయణ్ణి తన పరమ భక్తిచేత వశంచేసికొన్న పరమభక్త శిరోమణి మాతృశ్రీ తరిగొండవెంగమాంబ!

ఆ పుణ్యవనిత కథ పురాణ కాలంనాటిది కాదు. వేదకాలం నాటిది అసలే కాదు. కేవలం రెండు వందలఏండ్ల నాడు జరిగిన దివ్యగాథ మాత్రమే, సనామధేయులైన భగవంతుడు శ్రీ వేంకటేశ్వరుడు - భక్తురాలు వెంగమాంబ. ఈ ఇరువురి నడుమ జరిగిన మధుర సన్నివేశా లెన్నో! వీనుల విందుగా వినండి మరి. వినే ముందు భక్తవరదుడైన ఆ బ్రహ్మాండనాయకుని ఒక్కసారి గట్టిగా స్మరిద్దాం.

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా!

గోవిందా! గోవిందా!! గోవింద!!!

## ముత్యాల హారతి

ప్రతిరోజు రాత్రిపూట చివరగా ఏడుకొండల స్వామికి ఏకాంతసేవ జరుగుతుంది. 'ఏకాంతసేవ' అంటే పవ్వళింపు సేవ అని అర్థం. శ్రీవారి గర్భాలయానికి ముందు వున్న శయనమండపంలో ఏకాంత సేవకుగాను, వెండిగొలుసులతో వేలాడదీసిన బంగారు నవారు పట్టె మంచంపై 'మనవాళ ప్పెరుమాళ్' (నిత్యనూతన వరుడు) అనబడే భోగ శ్రీనివాసమూర్తిని వేంచేపు చేయిస్తారు. ఆ సమయంలో ఆనందనిలయంలో శ్రీస్వామివారి మూలవిరాణ్మూర్తికి చిట్టచివరగా "ముత్యాలహారతి" అనబడే మాతృశ్రీ తరిగొండవెంగమాంబగారి మంగళకర్పూర నీరాజనం ఇవ్వబడుతుంది. పిదప అదే హారతిని బయటికి తీసుకొనివచ్చి పట్టెమంచంమీద పవ్వళించివున్న భోగశ్రీనివాసమూర్తికి ఇవ్వడం జరుగుతుంది. ఆ మంగళహారతి వెలుగుల్లో శ్రీస్వామివారు వెండి గొలుసులతో వేలాడదీసిన పట్టెమంచంపై ఊగుతూ వుండగా, అదే సమయంలో రాములవారి మేడ నడవలో శ్రీస్వామివారికి ఎదురుగా దండెను మీటుతూ తాళ్లపాక అన్నమాచార్యుల వంశీయులొకరు "జో అచ్యుతానంద! జో జో ముకుందా! రావె! పరమానంద! రామ!గోవిందా!" అంటూ జోలపాట కమ్మగా పాడుతారు. ఒక వైపు తరిగొండ వెంగమ్మగారి హారతి నందుకొంటూ, మరోవైపు తాళ్లపాక వారి లాలిపాటను వింటూ యోగనిద్రకు ఉపక్రమిస్తూవున్న మనోహర దృశ్యాన్ని, శ్రీ వేంకటప్రభువుల దివ్యతేజస్సును చూచి తీరవలసిందే కాని, వర్ణించడానికి మాటలు చాలవు. లేవు కూడ.

తిరుమల క్షేత్రంలో నేటికీ ప్రతిరోజు రాత్రి ఏకాంతాసేవా సమయంలో చివరగా శ్రీవేంకటేశ్వరస్వామివారికి తాళ్లపాక అన్నమాచార్యులవారి వంశీయులచే లాలిపాట, జోలపాట వినిపించబడుతుంది. అదే సమయంలో తరిగొండ వెంగమాంబవారి ముత్యాలహారతి జరుగుతుంది. ఇలా ప్రతిరోజు రాత్రి చివరగా ఇరువురు పరమభక్తులచే తిరుమల శ్రీవారు అందుకొంటూవున్న ఈ విశిష్ట సేవలను తెలిపే నానుడే "తాళ్లపాకవారి లాలి – తరిగొండవారి హారతి."

ప్రతిరోజు ఉదయం సుప్రభాత సమయంలో "మేలుకొలుపు" పాటను, అలాగే ఏకాంతసేవాసమయంలో లాలిపాటను, జోల పాటను వినిపించే పరమభక్తుడైన తాళ్లపాక అన్నమాచార్యుల గురించి విమానప్రదక్షిణంచేస్తూ శ్రీవారి హుండీకి ఎదురుగావున్న "తాళ్లపాకవారి సంకీర్తన భండారం" దగ్గరికి వెళ్ళినప్పుడు విశదంగా తెలుసుకుందాం.

## తరిగొండ వెంగమాంబ

తిరుమల పుణ్యక్షేత్రానికి పరిసరాల్లో ఎన్నో పుణ్యభూములు, దివ్య స్థలాలు నెలకొనివున్నాయి. ఎందరో మహనీయులు, యోగులు, అవధూతలు జన్మించారు. అలాంటి దివ్యస్థలమే తరిగొండ. తిరుపతికి పశ్చిమాన వాయల్‌పాడు అనే పట్టణానికి 4 మైళ్లదూరంలో వుంది ఈ తరిగొండ గ్రామం. క్రీ.శ. 1730 ప్రాంతంలో ఆ ఊళ్లో కానాలకృష్ణయ్య, మంగమ్మ అనే పుణ్యదంపతులు వుండేవారు. ఆ దంపతులు తమకు సంతానాన్ని ప్రసాదించవలసిందని వేంకటేశ్వరస్వామివారిని వేడుకొంటూ వేంకటాచలానికి యాత్ర చేశారు.

కోరిన వరాల రాయుడు, సంతానప్రదాత అయిన ఏడుకొండల వెంకన్న వారి కోరికను మన్నించాడు. తత్ఫలితంగా కొద్ది కాలానికే వారికి ఒక పుత్రిక కలిగింది. వేంకటేశ్వరస్వామివారి దయతో పుట్టినందువల్ల ఆ శిశువుకు 'వెంగమ్మ' అని స్వామివారి పేరు పెట్టి పిలిచేవారు. పుట్టినది మొదలుగా వరప్రసాది అయిన వెంగమ్మ నిత్యమూ భజనలతో భక్తితో కాలక్షేపం చేసేది. గంటలకొద్దీ ధ్యానంలో మునిగిపోతూవుండేది. ఇది మంచిమార్గమే అని తొలుత భావించినా, తర్వాత తర్వాత తల్లిదండ్రులకు విచారమయింది. ఆడపిల్ల, పెళ్లికావలసిన పిల్ల, పరాయి ఇంటికి వెళ్లవలసిన పిల్ల, పనీ, పాటా లేకుండా, చెయ్యకుండా నిమ్మళంగా ఇలా గంటలకొద్దీ కాలక్షేపం చెయ్యడం వారికి ఆందోళన కలిగించింది. ఈమె పరిస్థితి ఆ నోట ఆ నోట అంతటా వ్యాపించింది. వెంగమ్మ పిచ్చిదో, లేక

దయ్యంపట్టిందో, లేక ఏ భక్తుడో, భక్తురాలో ఇలా అవతరించిందో– అని పలు పలు విధాలుగా చూసినవారు అనుకొనేవారు. వారి బంధువులు అందరూ వెంగమ్మ భక్తికి సంతసించేవారే కాని, ఆమె అందానికి అందరూ మురిసిపోయేవారే కాని ఆమెను మనువాడటానికి మాత్రం ముందుకు వచ్చేవారు కారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా ఆలస్యం చేస్తే బాగుండదని, ఏమాత్రం క్షేమం కాదని తలచిన తల్లిదండ్రులు ఆమెకు వివాహ ప్రయత్నాలు చేయడానికి ప్రారంభించారు. 'నాకు పెళ్లేమిటి? వేంకటేశ్వరుడే నా భర్త. కనుక నాకు పెళ్లి ప్రయత్నాలు చెయ్యవద్దు'– అని వెంగమ్మ తల్లిదండ్రులను బ్రతిమలాడేది. కాని, కన్నకడుపు కదా, అలా గాలికి వదిలేస్తే ఎలా! ఆడపిల్ల బరువు బాధ్యతలు తెంచుకొని, ఒక అయ్యచేతిలో పెట్టి రామా! కృష్ణా! అని నిశ్చితంగా వుండవచ్చును కదా! అని భావించిన కృష్ణయ్య దంపతులు చిత్తూరుకు సమీపంలో నారగుంటపాళెం గ్రామానికి చెందిన ఇంజేటి వెంకటాచలపతి అనే యువకునకు ఇచ్చి బలవంతంగా పెళ్లిచేశారు. కలసి కాపురం చెయ్యకముందే, దైవవశాత్తు వెంగమ్మభర్త వెంకటాచలపతి మరణించాడు. పుట్టినింటిలోనే వున్న వెంగమ్మ ఇవేమీ పట్టించుకొనక, నిరంతరం శ్రీ వేంకటేశ్వరుడే తనభర్త– అని తలుస్తూ ఎప్పటిమాదిరే నిత్యసుమంగళిగా పూలూ, కుంకుమ, గాజులూ ధరిస్తూవుండేది.

ఈ పరిస్థితుల్లోనే తండ్రి కృష్ణయ్య మదనపల్లె వాస్తవ్యులైన రూపావతారం సుబ్రహ్మణ్యశాస్త్రి అనే గురువుగారిచేత వెంగమ్మకు ఉపదేశం చేయించాడు. బంగారుకు పరిమళం అబ్బినట్లుగా, అప్పటినుంచి, భక్తి మార్గంలో వున్న ఆమె చింతన నిరంతరం ఆధ్యాత్మికోపాసనచేత పరిపూర్ణమైనది. ఆమె అచిరకాలంలోనే తపస్వినిగా మారింది. ఆమె నోటినుంచి అలవోకగా కీర్తనలు వెలువడేవి. భక్తిశతకాలు ఎన్నో వల్లించేది. ఆమె రచనలను, తన్మయావస్థను చూచినవారు ఆమెను యోగినిగా భావించి 'వెంగమాంబ' అని గౌరవంగా పిలిచేవారు. భక్తిగా ఆరాధించేవారు.

ఇది సహించక కొందరు, సంప్రదాయజ్ఞులమని విర్రవీగేవారు కొందరు ఆమెను ఆక్షేపించేవారు. కృష్ణయ్య కుటుంబాన్ని వెలివేసినారు. ఇంతలో సంచారానికి వచ్చిన పుష్పగిరి పీఠాధిపతులైన శ్రీశంకరాచార్యులవారితో వెంగమాంబ విపరీతబుద్ధినిగూర్చి, సంప్రదాయవిచ్ఛిన్నతను గూర్చి వివరించారు. పుష్పగిరి పీఠాపతులు ఆమెను పిలిపించారు. వెంగమాంబకూడ టెంకాయలు, పూలు, పండ్లతోకూడిన పళ్లెంతో వెళ్లింది. పీఠంపై కూర్చొని వున్న శంకరాచార్యులకు వాటిని సమర్పించింది. కాని నమస్కారం మాత్రం చెయ్యక ప్రక్కన మౌనంగా నిలుచొని వుండగా, పీఠాధిపతులు 'అమ్మా! భర్తలేని స్త్రీ సుమంగళిగా వుండడం సంప్రదాయ విరుద్ధం కదా! నీవు ఎందుకు వాటిని పాటించడం లేదు'? అని ప్రశ్నించారు. "స్వామీ! నా భర్త శ్రీవేంకటేశ్వరుడు. నేను నిత్య సుమంగళిని. సరే మీరు చెప్పినట్లు తలను బోడిచేయించుకొన్నచో, మళ్లీ జుట్టు పెరగకుండ చెయ్యగలరా" అని ఎదురు ప్రశ్న వేసింది. దానితో నిరుత్తరుడైన పీఠాధిపతి, 'అది సరే! హిందూధర్మ పీఠాధిపతి అయిన నా కెందుకు నమస్కారం చెయ్యలేదు? అని మరో ప్రశ్న వేశాడు. వెంగమాంబ వెంటనే స్వామీ! మీరు లేవండి. మీరు కూర్చున్న పీఠానికి నమస్కారం చేస్తానని చెప్పి, అలాగే చేతులు జోడించి వందన మాచరించింది. అంతే! ఫెళ ఫెళమని చప్పుళ్లతో ఆ పీఠం కాలుతూ భస్మమై పోయింది. ఈ హఠాత్సంఘటనకు భీతిల్లి, తాను బతికి బయట పడినందులకు సంతసిస్తూ-పీఠాధిపతులు వెంగమాంబను గౌరవభావంతో పరిశీలించి, కొనియాడుతూ "ఆమె దైవాంశ సంభూతురాలు. మహాయోగిని అయిన ఆమెకు కట్టుబాట్లు అనవసరం. ఆమె ఇచ్ఛవచ్చినట్లు వుండనీయండి, ఆమెను సేవించి తరించండి" అని ఆ గ్రామీణులకు చెప్పి వెళ్ళిపోయినారు.

కుక్కతోక వంకర- అన్నట్లు, కొందరు దుష్టులు ఆమెను వేధించేవారు. ఇవేవీ పట్టించుకోని వెంగమాంబ, ఆ ఊళ్లోని గుడిలో తానే స్వయంగా నరసింహస్వామిని పూజించేది. ధ్యానించేది. ఒకరోజు ఆ గుళ్లోని అంజనేయస్వామి విగ్రహందగ్గర ధ్యానం చేసుకుంటున్న వెంగమాంబను చూచి సహించలేని అర్చకులు

"ఏ క్షేత్రానికో వెళ్లి తపస్సుచేసుకోక, మా ప్రాణం తింటున్నావు గదే!" అంటూ ఆమె తలజుట్టు పట్టుకొని బయటికి జరజర యీడ్చినారు. ధ్యానభంగమై, ఆమె చూచినచూపులకు బిక్క చచ్చిన అర్చకులు ఆమె పాదాలపై పడి శరణువేడినారు. అర్చకుని నోటినుండి వెలువడిన పలుకులు దైవ ప్రేరితాలుగా భావించి ఇరవై ఏండ్ల పడుచు అయిన వెంగమాంబ తరిగొండను విడిచి పెట్టి, అరణ్యమార్గంగుండా పయనించి తిరుమల కొండను చేరుకొంది. అదే ఆ పరమభక్తురాలు జన్మలో తొలిసారిగా తిరువేంకటాద్రిని దర్శించిన శుభ సందర్భం. దివ్యాతిదివ్యమైన ఆ క్షణంలో ఆమె నోటినుండి జాలువారిన తిరుమలక్షేత్ర కమనీయ దృశ్యం ఇది.

"ఘన గోపురములు ప్రాకార మంటపములు
తేరులు, సత్పుణ్యతీర్థములును
కమలాప్తకిరణ సంకలితంబులై ప్రకా
శించుచుండెడు హేమశిఖరములును
పావన పరివార దేవతాలయములు
మహిమ నొప్పు విరక్త మఠవరములు
రంగదుత్తుంగ మాతంగ తురంగముల్
కొమరారు బహుసాధు గోగణములు
ముద్దుగాఁ బల్కు శుక, పికములును, నీల
కంఠములును మరాళసంఘములు మఱియు
ఫలవనంబులు తులసికాదళ సుమములు
క్రిక్కిరిసియుండు వేంకటగిరి పురమున.

అప్పురియందు దివ్యతర
హాటక కుంభ విరాజమానమై
యొప్పు విమాన మధ్యమున
నుత్తమపూరుషుఁడై, మహాత్ముఁడై

ఒప్పొల కుప్పయై ధర మ -
హోన్నతుండై వెలుగొందుచుండు మా
అప్పుడు వేంకటేశ్వరుం
డహర్నిశమున్ కమలా సమేతుండై."

-వేంకటాచల మాహాత్మ్యం

తొలిగా తిరుమలక్షేత్రాన్ని చేరుకొన్న వెంగమాంబ శ్రీస్వామివారిని దర్శించి కీర్తించింది. ప్రతిరోజూ శ్రీనివాసుని దర్శించి సేవించుకొనేది. వెంగమాంబ ఆశువుగా వచ్చిన హృద్యమయిన పద్యాలతో, శతకాలతో వేంకటేశ్వరుని కమనీయంగా, భక్తిరసార్ద్రంగా పరవశించి స్తుతించేది. ఆమె భక్తికి ఎందరో తన్మయులయ్యేవారు. వర్చస్సుకు ఆకర్షితులై వందన మాచరించేవారు. అంతకు ముందే వెంగమ్మమహిమను, భక్తిని గూర్చిన వార్తలు తిరుమలక్షేత్రంలో చేరి వ్యాపించినందువల్లా, ఆమె తిరుమల చేరినతరువాత ఆ భక్తురాలి తన్మయావస్థను చూచినవారు వెంగమాంబను మహాయోగినిగా, భక్తురాలుగా కొనియాడేవారేకాని, నిలువ నీడలేక గుడి ఆవరణలోనే మండపాల్లోనే తలదాచుకొంటూవున్న వెంగమ్మ పరిస్థితిని మాత్రం ఎవరూ పట్టించుకొనేవారు కాదు.

ఇలాంటి సమయంలోనే ఆ పరమభక్తురాలు తిరుమలక్షేత్రంలోనే తనను స్థిరంగా వుండేట్లుగా అనుగ్రహిస్తూ ఒక ఆవాసస్థలాన్ని చూపించ వలసిందిగా శ్రీ వేంకటేశ్వరస్వామివారిని పరిపరివిధాలుగా ప్రాధేయపడింది, ప్రార్థించింది. ఆనాటి రాత్రి ఆలయ ప్రాంగణంలో నిద్రిస్తూవున్న వెంగమ్మకు కలలో శ్రీస్వామివారు కనపడి, "వెంగమ్మా!" మహిమాన్వితమైన ఈ వేంకటాచలక్షేత్రంలో నీవు ఉండదలిస్తే నాకేమి అభ్యంతరం లేదు. కాని నా వక్షఃస్థలంలో కొలువైవున్న వ్యూహలక్ష్మిని వేడుకో, ఆమె సమ్మతించినచో నీవు దండిగా వుండవచ్చు" అని పలికి, శ్రీమహాలక్ష్మిని ఉపాసించవలసిందని ఆదేశించినాడు. ఉదయం లేచిన వెంగమ్మ ఆశ్చర్యపడి ఆనందంతో శ్రీస్వామి వారి ఆజ్ఞగా అలమేలుమంగమ్మను ఉపాసించి, తిరుమలలో

వుండేందుకు దయ జూపమని ఆర్తిగా అడిగింది, వినమ్రంగా వేడుకొనింది.

ఆనందనిలయుడు, ఆయన వక్షఃస్థలంలోని అలమేలుమంగమ్మ వేరు వేరు కాదు కదా! ఇద్దరూ ఒక్కటే కదా! అంతేకాదు. భక్తులను రక్షించడంలో, అనుగ్రహించడంలో స్వామివారిని మించి అమ్మవారు, అమ్మవారిని మించి స్వామివారు పోటీపడుతుంటారు. ఒక్కొక్కప్పుడు భక్తుల పక్షాన తాను వకాల్తా పుచ్చుకొని స్వామివారిచేత ఒప్పించి అనుగ్రహింపచేస్తూ వుంటుంది జగన్మాత అలమేలుమంగ. ఇలా ఇద్దరూ కూడబలుక్కొని, భక్తులను సంపూర్ణంగా అనుగ్రహించి, ఆనందింపజేస్తూ వుంటారు. అలమేలుమంగా వేంకటేశ్వరు లిద్దరూ వెంగమ్మప్రార్థనను విన్నారు. అనుగ్రహించారు. తిరుమల క్షేత్రంలోనే స్థిరంగా ఆమెకు నివాసం ఏర్పాటు చేయ సంకల్పించారు. ఆ భక్తురాలికి గడియ గడియకు గుడి ఆవరణలోనో, పూట పూటన పరుల పంచనో తలదాచుకొనే అవస్థను పోగొట్టదలిచాడు శ్రీనివాసుడు. శ్రీస్వామివారు తన ఆంతరంగిక భక్తుడైన స్వామీహథీరాంబావాజీవారి శిష్య పరంపరంలో మహంతుమఠానికి అప్పటి అధిపతి అయిన ఆత్మారాందాసుకు (క్రీ.శ. 1745-50 ప్రాంతంలో) ప్రేరణ కలిగించాడు.

ఆత్మారాందాసు స్వయంగా వెంగమాంబ దగ్గరికి వెళ్ళి "అమ్మా! భగవంత్సంకల్పం ఏమిటోకాని, మీకు తిరుమల కొండమీద నివాసాన్ని ఏర్పాటు చెయ్యవసిందని ప్రేరణ కలుగుతున్నది. దయచేసి నా ద్వారా ఏర్పాటు చేయబడుతున్న సదుపాయాన్ని స్వీకరించి భక్తవరదుడైన శ్రీవేంకటేశ్వరుని సేవిస్తూ, భక్తులను కూడ తరింపజేయగల"రని ప్రార్థించినాడు. పిదప, శ్రీవారి తూర్పుమాడవీధి చివరన ఈశాన్యమూలలో శ్రీవారి రాతిరథం పక్కన ఒక పూరిగుడిశను నిర్మించి ఇప్పించినాడు. అంతేకాదు శ్రీవారి ఆలయంలోని వంటశాలలో పిండివంటల తయారీని పర్యవేక్షిస్తూవున్న శ్రీవేంకటేశ్వరుని తల్లియైన వకుళమాత పేరుతో ఒక పడి బియ్యాన్ని, దానికి తగిన ఇతర వంటవస్తువులను

ప్రతిరోజూ తరిగొండ వెంగమాంబకు పంపునట్లుగా మహంతు ఆత్మారాందాస్ తీర్మానించాడు. శ్రీవారి ఆలయ పరిపాలనను మహంతులు స్వీకరించడానికి (1843-1933) పూర్వం ఇంచుమించు నూరేండ్ల క్రిందట జరిగిన వృత్తాంతం ఇది. అయినా, అప్పటి మహంతులు పరమభక్తులుగా తిరుమల యాత్రికుల సేవచేస్తూ వున్నవారుగా ప్రసిద్ధిచెందియుండి, శ్రీవారి ఆలయంలోకూడ ప్రధానవ్యక్తులుగా ప్రముఖ పాత్రను నిర్వహించేవారు. అందువల్ల, అప్పటి మహంతు ఆత్మారాందాసు ఏర్పాటుచేసిన బియ్యంకట్టడిని, అప్పటి ఆలయ అధికారులు అంగీకరించి వెంగమాంబ కుటీరానికి నిత్యమూ దినవెచ్చంగా, శ్రీవారి ఆలయం ఉగ్రాణం నుండి పంపే ఏర్పాటుచేశారు. భక్తశిరోమణి వెంగమాంబకూడ తన ప్రార్థనను ఆలకించి అనుగ్రహించిన అలమేలుమంగా వేంకటేశ్వరుల దయకు సంతోషించి మహంతు ఏర్పాటుచేసిన సదుపాయాన్ని అంగీకరించింది.

తిరుమలలో ఆశ్రయం గురించి, ఆహారం గురించి నిశ్చింత అయిన వెంగమ్మకు ఇప్పుడు మరొక చింత పట్టుకొంది. అది ఎంతకు ఎడతెగని చింత, అదే ఏడుకొండలవానిమీద చింత! ఆ చింతతోనే ఎప్పుడు ఆనందనిలయాన్ని అంటిపెట్టుకొని వుండేది. ఆలయం మూసిన వేళలో మాత్రమే తన కుటీరంలో స్వయంపాకం చేసికొని శ్రీస్వామివారికి నివేదించి భుజించేది. ఇలా, తన సర్వస్వమూ తిరుమలేశుడే! కళ్లు తెరచినా, మూసినా కొండలరాయనిమీద ధ్యాసేగాని, అన్యం ఎరుగదు. ఆమె ధ్యానిస్తే సరి! సప్తగిరీశుడు ఎదుట నిలిచేవాడు. మాటలు చెపితే సరి! చక్కగా వింటాడు. ఊ కొడతాడు. ఆమె పాటలు పాడుతూవుంటే పరవశించి నాట్యం చేసేవాడట శ్రీనివాసుడు! ఇంతలో వెంగమ్మకు మరో కోరిక కలిగింది. ప్రతిరోజూ ఉదయం శ్రీవారి మూలమూర్తి అలంకరణకు పూలమాలల్ని సమర్పించాలనీ, ప్రతిసాయంత్రం చివరగా స్వామివారికి కర్పూర నీరాజనం ఇవ్వాలని భావించింది.

తులసీప్రియుడైన తిరుమలేశునికోసం తులసివనాన్ని పెంచదలచింది. తన కుటీరానికి వెనుక దిక్కున పడమటి వైపున ఒక తోటను ఏర్పాటు చేసింది.

అందుకోసం ఒక దిగుడుబావిని తవ్వించింది. కాని, ఆ బావిలో అడుగున విశాలమైన బండ అడ్డు తగిలింది. వెంగమాంబ ఆ బావిలోనికి దిగి, ఆ బండను పూజించి, గంగాభవానిని ప్రార్థించి, పైకి వచ్చింది. వెంటనే బావిలోని బండ బీటలు వారి గంగమ్మ పెల్లుబికింది. వెంగమాంబ చూపిన మహిమకు ప్రజలంతా వేనోళ్లపొగడి ఆరతు లిచ్చారు. ఆ దిగుడు బావి నీటిని పారించి, తీరికవేళల్లో వెంగమ్మ తులసీవనాన్ని పెంచింది. పూల మొక్కలు కూడ నాటింది. ఆ తోట ద్వారా సేకరించిన పూలను, తులసిని మనోహరంగా దండలుగా కూర్చి, ప్రతిరోజూ ఉదయం శ్రీస్వామివారి మూలమూర్తుల అలంకరణకు సమర్పించేది. శ్రీవారి సహస్రనామార్చనకు తులసిదళాల్ని సమకూర్చేది. అలాగే, ప్రతి సాయంత్రం స్వయంగా హారతి పళ్లెం తీసుకొని ఆనందనిలయానికి వెళ్లి స్వయంగా శ్రీస్వామివారికి హారతిని జరిపించేది.

వెంగమాంబ ఆనాడు తవ్వించిన దిగుడుబావిని నేడుకూడ తిరుమలలో చూడవచ్చు. పాపవినాశనకు వెళ్లే దారిలో శ్రీవారి ఏనుగులశాల వుంది. దానికి దగ్గర్లో అమ్మోరి బాయి (అమ్మవారి బావి) అనే వ్యవహారంతో వెంగమ్మ బావి వుంది. ఇందులోని నీళ్లను నేటికీ దేవస్థానంవారు తోటలను పెంచడానికి ఉపయోగిస్తూ వున్నారు.

వెంగమాంబ సమర్పించిన పూలమాలల్లో, తులసీమాలల్లో శ్రీనివాసుడు మరింత ఉత్సాహంగా వుంటూ భక్తులకు ఆనందాన్ని కలిగించేవాడు. సాయంత్రంపూట చివరగా వెంగమ్మ సమర్పించే కర్పూరనీరాజనపు వెలుగుల్లో వేంకటేశ్వరుడు వింత వింత వెలుగులతో ప్రకాశిస్తూ భక్తులకు దివ్యమైన అనుభూతుల్ని ప్రసాదిస్తూ మైమరపించేవాడు.

తీరికవేళల్లో వెంగమ్మ తులసీవనంలో ఒక పెద్ద చదునైన బండపై కూర్చొని భక్తుల పాలిటి ఆశ్రితపారిజాతమై భాసిస్తూవున్న శ్రీనివాసుని గూర్చి కవిత లల్లేది. పాటలు గానం చేస్తూ కాలంక్షేపం చేసేది.

ఇలా ఆయమ లేఖినినుండి జాలువారిన "విష్ణుపారిజాతం" అనే యక్షగానం శ్రీస్వామివారిని కీర్తించే గంధర్వగానమై వరలింది. ఈ యక్షగానం శ్రీనివాసునికే అంకితం ఇవ్వబడింది.

తరిగొండ వెంగమ్మ చూపుతూవున్న మహిమలవల్లా, రాస్తూవున్న భక్తిరచనలవల్లా ఆమెమీద తిరుమలవాసులకు, యాత్రికులకు, అత్యంత భక్తి ప్రపత్తులు ఏర్పడినాయి. సాక్షాత్తు శ్రీనివాసుడే ఆమెతో మాట్లాడేవాడనీ, ఆమె గానాన్ని పరవశించి వింటాడనీ, ఒక్కొక్కసారి నాట్యం చేసేవాడనీ, ప్రచారం కలిగి, ఆ వెంగమ్మను సాక్షాత్తు వేంకటేశుని అంశ కలిగిన మహనీయురాలిగా భావించి, కీర్తించి, తరించేవారు.ఆమెచేత ఆశీస్సులను పొందడం, సాక్షాత్తు స్వామివారి అనుగ్రహాన్ని పొందినట్లేనని భావించేవారు.

ఇలాంటి తరుణంలోనే తిరుమలస్వామివారి సేవల్లో ప్రముఖంగా పాలు పంచుకొంటూవున్న పరమభక్తులైన తాళ్లపాక అన్నమాచార్యుల వంశీయులు తరిగొండ వెంగమాంబను గూర్చి, ఆమె మహిమలను గూర్చి, ఆమె భక్తి రచనల గురించి విన్నారు. పైగా వెంగమాంబ తమ నందవరీక బ్రాహ్మణశాఖకు చెందిన దగుటవల్లా, పరమభక్తురాలగుటవల్లా తాళ్లపాకవారు ఆమెను ఆహ్వానించి, ఉత్తరమాడవీథిలో శ్రీవరాహస్వామి ఆలయం వెనుక తాము నివాసం ఉంటున్న తమ ఇంటిలో కొంతభాగాన్ని ఆమె వుండటానికి ఉచితంగా ఇచ్చారు. ఆ నాటినుంచి వెంగమాంబ తన పూరిల్లును వదలి తాళ్లపాక వారి అండన చేరింది. అక్కడ ఆ యింటి వెనుక కూడా వెంగమాంబ ఒక తులసీవనాన్ని పెంచుతూ శ్రీవారికి తులసీ మాలల కైంకర్యాన్ని నిర్వహిస్తూ అహరహం ఆనందనిలయుని సేవలోనే కాలాన్ని గడుపుతూ వుండింది.

ఆమె ఇంటి పక్కనే అక్కారాందీక్షితులు అనే శ్రీవారి సర్కారు అర్చకులు వుండేవారు. శ్రీవేంకటేశ్వరస్వామివారి ప్రధాన అర్చకులు కదా వారు! వారి ఐశ్వర్యమునకు కొదువేమి? సంపదతోపాటు, బంధుబలగమూ, అంగబలమూ,

మందీ మార్బలమూ సహజంగానే చేరిన అక్కారాం దీక్షితులు తిరుమలలో ప్రముఖులుగా పరిగణింపబడేవారు. అందువల్ల అహంకారమూ, గర్వమూ, దర్పమూ– అన్నీ ఆ అర్చకుణ్ణి ఆశ్రయించాయి. అంతే. నిత్యమూ తన లోకంలో తానువుంటూ, ఒకరి సొంటికి గాని సొద్దుకు గాని, పోకుండా శ్రీనివాసుని సేవల్లో జీవితాన్ని పండించుకుంటూ వున్న వెంగమ్మను చూచి అక్కారామయ్య అక్కస్సు పట్టలేక నిందించేవాడు. తిరుమలలో అందరూ నన్ను గౌరవిస్తూ వుంటే ఈమె నా మొగంవైపు అయినా చూడదే! పైగా అందరూ ఆమెను భక్తురాలుగా పొగడుతూవుంటే అతడు ఈర్ష్య పడ్డాడు. నేను శ్రీస్వామివారిని స్వయంగా తాకి పూజించే ప్రధాన అర్చకుణ్ణి కదా! నా కంటె భక్తురాలా ఏమి? అంటూ విపరీత బుద్ధితో వెంగమ్మను తూలనాడే వాడు. ఊరునుంచి తరుమగొట్టబడి, ఇక్కడ పెద్దభక్తురాలుగా చామణి అవుతున్నది అంటూ ఆమెను నిందించేవాడు. విధవరాలు సుమంగళిగా, పూలు కుంకుమ ధరించడం, శ్రీవారికి పుష్ప కైంకర్యం చేయడం, దేవస్థానం అధికారుల్లో ఆమెయందు భయము, భక్తి ఉండడం, పైగా తాళ్లపాకవారు ఆమెను ఆహ్వానించి, తమ పక్కనే గౌరవించి వుంచడం వంటి పనులవల్ల అర్చకులయిన రామదీక్షితుల మనస్సు ఇంకా క్రోధపూరితమయింది. ఆమె చెవిన పడేట్లుగా కూడ అర్చకులు ఆమెను నోటికి వచ్చినట్లు దూషించేవాడు. అయినా అలౌకిక ఆధ్యాత్మికజగత్తులో, అందులో, జకత్కల్యాణమూర్తి సుందరదరహాసంపై తదేక లగ్నమానసురాలై చరిస్తున్న వెంగమాంబకు ఆతనిమాటలుకాని, ఆతని చేష్టలుకాని ఆనలేదు, అంట లేదు. 'వినాశకాలే విపరీత బుద్ధిః' – అన్నట్లు అర్చకుని బుద్ధి ఇంకా వక్రించింది. ప్రతిరోజు ఉదయం, రాత్రి ఆమె తులసివనంలో ఎంగిలివిస్తళ్లు, తన బంధువులచేత వేయించేవాడు. ఈ దుష్టచర్యను ఆమె ఓర్పుతో సహించి ఒకటి రెండుమారులు సవినయంగా చెప్పిచూచింది. కాని 'కుక్కతోక వంకర' అన్నట్లు అర్చకుని పరిస్థితి అలాగే కొనసాగుతూ వుండేది.

ఒకనాడు వెంగమాంబ తిరుమల శ్రీనివాసప్రభువులకు నిలువెల్ల పూల మాలలు సమర్పించి, అర్చనాదులు అయిన తర్వాత శ్రీవారి ప్రసాదాన్ని స్వీకరించి,

భక్తిరసార్ద్రచిత్తయై వెర్రిగా ఆనందిస్తూ ఇల్లు చేరుకొంది. పెరటిలో ఒక పీఠంపై కూర్చొని, అక్కడినుంచే సూర్యకోటి భాసమానంగా ప్రకాశిస్తూ మైమరపిస్తూవున్న ఆనందనిలయవిమానశిఖరాన్ని తదేకంగా చూస్తూ ధ్యాననిమగ్నయైంది. సరిగ్గా అపరాహ్ణవేళ. ఆయమ సమాధిస్థితి లోనికి వెళ్లి ఆనందబాష్పాలు రాలుతూవుండగా బాహ్యస్మృతిని వీడింది. అలాంటి స్థితిలో పక్క ఇంటిలోని అర్చకులు, అతని బంధుగులు భోజనాలు ముగించి తమ పెరటిలోనుండి ఎంగిలివిస్తళ్లు వెంగమ్మ తులసివనంలోనికి విసరివేసినారు. సరిగ్గా ఆ ఎంగిలాకులు ధ్యాననిమగ్నయైన వెంగమ్మమీద పడ్డాయి.

శ్రీ వేంకటేశ్వరస్వామివారు ఎవరైనా తనను తిట్టినా, దూషించినా ఏమీ అనడట! అన్నీ భరిస్తాడట! కాని తన భక్తులనుమాత్రం ఎవరైనా సరే ఏమాత్రం దండించినా, దూషించినా, హింసించినా అణుమాత్రమైనా సహించడట! ఆ భక్తులు క్షమాబుద్ధితో వదలిపెట్టినా, ఆ భగవంతుడు మాత్రం వారిని శిక్షించిగాని వదలడు.

అలాగే, వెంగమ్మమీద పుల్లి విస్తరాకులు పడగానే ధ్యానభంగమైంది. వెంటనే వెంగమ్మను వేంకటేశుడు ఆవహించినాడు. అంతే! వెంగమ్మ కళ్లు ఎర్రబడ్డాయి. తీవ్రమైన దృక్కులతో అక్కారాం దీక్షితులను చూస్తూ! "ఓరీ పాపీ! నేటితో నీ వంశం సరి! నేటితో సమూలంగా కుప్పకూలిన వృక్షంవలె నశింతువుగాక" అని శపించింది. ఆమె ఉద్వేగంతో ఊగిపోయింది. వెంగమాంబ శాపాగ్నికి మిడుతలవలె ఎక్కడివారక్కడ రక్తం కక్కుకుంటూ చతికిల బడ్డారు. ఇలా అర్చకులు బంధుసమేతంగా యమయాతనలు పడుతూ నిర్జీవులవుతూవుండగా, వారిలో అర్చకులవారి కుమారుడొక్కడు అలాగే కాళ్లీడ్చుకుంటూ, మరణావస్థలో వెంగమ్మను చేరుకొని శరణు వేడినాడు. రక్షించమని ప్రాధేయపడినాడు. అప్పటికి వెంగమ్మ తీవ్రత తగ్గి "ఇప్పటినుంచి మీవంశంలో ఒక్కడొక్కడు మాత్రమే మిగులుగాక!" అని శాపతీవ్రతను తగ్గించింది. ఆ వచ్చినవాడు బ్రతుకుజీవుడా! అంటూ బతికి బట్టకట్టినాడు. ఆనాటినుంచి తిరుమల శ్రీవారి సర్కారు అర్చకుల ఇంటిలో ఒక్కరు మాత్రమే జీవిస్తూ, వంశం కొనసాగుతూవున్నది.

భగవంతుని దూషించటంకన్న భక్తుని దూషించటం, హింసించటం ఎంతో విపరీత ఫలాలను కలిగిస్తుంది కదా!

తిరుమల శ్రీవారి ఆలయం బ్రిటీషు వారి పాలనలో– అనగా ఈస్టిండియా కంపెనీ పాలనలో వుండగా, శ్రీస్వామివారిని వంశపారంపర్యంగా పూజించే మిరాశీ అర్చకులకు ఏ కారణంచేతో ఆలయంలో ప్రవేశించకూడని అనివార్య పరిస్థితి ఏర్పడినప్పుడు అలాంటి స్థితిలో ఆలయ కార్యక్రమాలకు, అర్చనలకు ఎలాంటి భంగం కలగకుండా మరొక వైఖానస అర్చకుని అప్పటి ప్రభుత్వం నియమించింది. అతనే "సర్కారు అర్చకుడు". అప్పటినుంచి సర్కారు అర్చకులు కొనసాగుతూ ఆలయ అర్చనల్లో పాల్గొంటూనే వున్నారు. నేడు 'సర్కారుహారతి', 'సర్కారు ఉత్సవం' అనే పదాలకు దేవస్థానంవారి హారతి, దేవస్థానం వారి ఉత్సవం– అని అర్థం చేసికోగలరు.

ఇది జరిగిన సాయంత్రం, వికల మనస్కురాలు అయిన వెంగమాంబ హారతిపళ్లెంతో శ్రీవారి ఆలయంలో ప్రవేశించి, విచారంతోనే కర్పూర హారతిని సమర్పించింది. ఇది గమనించిన ఆనందనిలయుడు సాక్షాత్తుగా ఆమెతో "వెంగమ్మా! ఇది నేను చేసిన కార్యం. కనుక నీవు ఎంతమాత్రం చింతించవలసిన పని లేదు. దుష్టులను దండించ వలసిందే. అందువల్ల, నిష్కారణంగా నిన్ను దూషిస్తూ నానాబాధలు పెట్టిన అర్చకునకు తగిన శిక్షే అది. అది నావల్లే జరిగింది. కనుక జరిగినది మరచిపోయి, ఇకమీద ప్రతిరోజు సాయంత్రం స్వయంగా నీవు వచ్చి హారతిని సమర్పించి నన్ను ఆనందింప చేయవలసింది." అని పలికినాడు. అంతటితో వెంగమాంబ మనసు తేలికపడి, అప్పటినుండి క్రమం తప్పకుండా ప్రతిరోజూ సాయంత్రం పూట కర్పూర నీరాజనాన్ని స్వయంగా శ్రీవారికి సమర్పిస్తూ ఆనందించేది. అంతేకాదు. శంఖ, చక్ర, కటి,వరదహస్తుడు, వజ్రకిరీటధారి, కర్ణ కుండల భూషణుడు, చిన్మయ హాసుడు, నాగాభరణుడు, నందకాయుధధారి, శ్రీవత్సముద్రాంకితుడు, పీతాంబరధారి అయిన ఆనంద నిలయుని దివ్య మంగళమూర్తి యెదుటనే గంటలకొద్దీ ధ్యానిస్తూ వెంగమ్మ అక్కడే కాలాన్ని

గడుపుతూ వుండేది. ఆలయ అధికారులుకూడ ఆమెను ఆవగించంతయినా అడ్డగించేవారు కారు. మీదుమిక్కిలి ఆమెకు భక్తిపూర్వకమైన మర్యాదలు చేసేవారు. ఆమె చర్యలు ఆలయ కార్యక్రమాలకు కొంత అంతరాయం కలుగుతున్నా, లేదా ఆలస్యం జరుగుతున్నా ఆమెను వారించకపోగా, పైపెచ్చు ఆమె ఆలయంలో ఉండడమే భక్తులు కూడా మహాభాగ్యంగా భావించేవారు; సంతోషించేవారు.

ఇలా జరుగుతూవుండడం వల్ల అర్చకులలో మళ్లీ నెరనెర ప్రారంభమైంది. రాను రాను కంటగింపై, ఆమె ఆలయానికి వచ్చినపుడంతా సూటిపోటి మాటలు అనేవారు అర్చకులు.

అది బ్రహ్మోత్సవ సమయం. శ్రీవారి అర్చక శిఖామణులు అత్యంత విశిష్టమైన, అమూల్యములైన వజ్రవైడూర్యమరకత మాణిక్యాది నవరత్నాల ఆభరణాలతో శ్రీవేంకటేశ్వరుని దివ్యమంగళ మూలవిరాణ్మూర్తిని మనోహరంగా అలంకరించారు. ఇంకా, సుగంధసుమనోహరమైన విరుల దండలతో వెంకన్నమూర్తిని నయనాభిరామంగా తీర్చిదిద్దారు. అలాంటి సమయంలో పరమభక్తురాలు అయిన వెంగమాంబ పూలమాలతోను, హారతి తట్టతోను వచ్చి కర్పూర నీరాజనాన్ని తనివితీరా సమర్పించింది. కన్నులారా ఆనాటి కొండలరాయని వింత వింత సోయగాల్ని దర్శిస్తూ, మైమరచిపోయింది వెంగమ్మ.

ఇది ఏమాత్రం సహించలేక అర్చకులు 'ఎంత భక్తురాలైనా ఇదేమి వింత! వితంతు స్త్రీ, వేంకటేశునికి హారతి ఇవ్వడమా! తగుదునమ్మా! అని, అర్చకులను మించి, తానే అర్చకురాలైనది. సిగ్గులేకపోతే సరి! ఎంత అపచారం! అపచారం! నవ్వినా తగినట్లు వుండవలె. అమంగళి అయిన స్త్రీ పూలూ, కుంకుమా ధరించి, సింగారించుకొని వచ్చి, నిత్య కల్యాణమూర్తి అయిన పెరుమాళ్లను పూజించకపోతే స్వామివారికి ఒరిగేది ఏమీలేదు, తరిగేదీ లేదు. నేటికి సరే! రేపటినుంచి ఈమెను కోవెల లోనికి రానీయకూడదు'- అని వెంగమ్మకు వినబడునట్లుగా నిందించారు. ఆ మాటలు విన్న వెంగమ్మ నిరుత్సాహంగా ఇల్లు చేరింది.

"తాను ఆలయానికి వెళ్లడం అందరికి బాధాకరమయితే, తానెందుకు వెళ్లాలి? వారికి ఎందుకు నొప్పి కలిగించాలి? ఇక మీదట నేటినుంచి ఆలయానికి వెళ్లటమే మానివేస్తాను. హారతిని తీసుకెళ్లనుగాక, తీసుకెళ్లను. కాని, శ్రీవేంకటేశ్వరుని దివ్యదర్శన భాగ్యం లేకుండా జీవించగలనా? ఇది మరీ దుర్భరమే! వారి మాటలనైనా భరించవచ్చుకాని, శ్రీవారి దర్శనం లేకపోవడం భరించగలనా? ఏది ఏమైనా, నేను వెళ్లకపోవడమే మంచిది. శ్రీవారి అర్చకుల మనస్సైనా శాంతిస్తుంది కదా" అని ఇలా పరిపరి విధాలా ఆలోచిస్తూ, ఇది తన దౌర్భాగ్యమేమో! కన్నులారా కొండలరాయని దర్శించలేని తన దురదృష్టం ఎంతటిదో కదా! అని- మనసును రాయి చేసికొని ఆలయానికి వెళ్లడం మానివేసింది వెంగమ్మ. ఇలా ఒకవారంరోజుల పాటు జరిగింది. శ్రీవారి అర్చకులు మహా సంతోషపడ్డారు. ఆ స్త్రీ తమ మాటలను విని రాకపోవడం వాళ్లకు ఆనందం కలిగించింది. వెంగమ్మకు మనం బాగా బుద్ధి చెప్పాం. ఇంక, ఇటువైపు తిరిగి చూడదుగాక, చూడదు- అని వారిలో వారు మురిసిపోయారు.

అర్చకుల మాటలు విని వెంగమాంబ ఆలయానికి రాకుండా వుండటం, ఆనందనిలయునికి ఆందోళన కలిగించింది, రేపు వస్తుంది, మాపు వస్తుంది. తులసిమాలలు సమర్పిస్తుంది, హారతిని ఇస్తుంది- అని ఎదురుచూచి, ఎదురుచూచి భక్తురాలికోసం నిరీక్షించాడు ఏడుకొండలవాడు. అర్చకులకు మళ్లీ బుద్ధి చెప్పదలచాడు. మరోమారు ఆమె గొప్పదనాన్ని చాటదలచినాడు అంతే.

మరునాడు బ్రహ్మోత్సవంలో చివరిరోజు, శ్రీవారి తేరు ప్రారంభమైంది. శ్రీదేవీ భూదేవీ సమేతంగా మలయప్పస్వామి రథారూఢుడై తిరుమల వీథుల్లో అశేష జనవాహినికి దర్శనమిస్తూ, క్రీగంట అందరినీ అనుగ్రహిస్తూ బయలు దేరాడు. ఈ రథోత్సవం క్రమంగా దక్షిణ, పశ్చిమ మాడవీథుల్లో ఏ అంతరాయం లేకుండా సాగింది. ఇక ఉత్తరమాడ వీథిలో తేరు ముందుకు సాగుతూ, ఉన్నపళంగా తరిగొండ వెంగమాంబ ఇంటిముందు ఆగిపోయింది. అర్చకులు, ఆలయ అధికారులు, యాత్రికులు, తిరుమలవాసులు రథాన్ని కదలించడానికి శతవిధాల

ప్రయత్నించారు. వారిదృష్టికి మేరుపర్వతం మాదిరి గోచరించి. ఆనందనిలయుని రథం ఆవగింజంతయినా కదలలేదు గాని, అందరికీ శ్రమమాత్రం మిగిలింది. ఇలా, గంటలకొద్దీ కాలయాపన జరిగింది. ఈ ఆలస్యంవల్ల ఆలయ కార్యక్రమాలకు భంగం కలిగింది. జరిగిన ఈ రథోత్సవ ఆటంకానికి ఎన్నో విధాల ఆలోచించి పరిశీలించిన పెద్దలు, "ఏ భక్తులకో, మహనీయులకో కష్టం జరగడంవల్లా, మనస్సు నొప్పిపడినందువల్లా, ఇలా జరిగి వుండవచ్చు"నని తీర్మానించారు. ఇలా నిశ్చయించడంతోనే, అర్చకులకు వారం కిందట తాము తరిగొండ వెంగమాంబను దుర్భాష లాడటం, అప్పటినుంచి ఆమె ఆలయానికి రాకపోవడం స్ఫురణకు వచ్చింది. ఇది నిజమే కావచ్చు. ఎందుకంటే ఈ రథంకూడా వెంగమ్మ ఇంటిముందే ఆగిపోయింది- అని అనుకుంటూ బిర బిర అర్చకస్వాములు వెంగమ్మ ఇంటిలోనికి వెళ్ళి సాష్టాంగ నమస్కారం చేసి, 'తల్లీ నీవు వచ్చి హారతి యిచ్చి స్వామిని ప్రార్థిస్తే రథం ముందుకు కదులుతుంది. తల్లీ! మమ్ము క్షమించవమ్మా! అని ప్రాధేయపడగా, 'నేను ప్రార్థిస్తే, హారతిస్తే రథం కదులుతుందని మీరు విశ్వసిస్తే తప్పక అలానే చేస్తాను' అంటూ వెంగమాంబ హారతి పళ్లెంతో బయటికివచ్చి, జగత్కల్యాణచక్రవర్తి అయిన శ్రీనివాసప్రభువులకు కర్పూరనీరాజనం ఇచ్చి, ముందుకు నిరాటంకంగా కదలమని ప్రార్థించింది. అంతే! సునాయాసంగా సప్తగిరులవంటి రథం జరజర ముందుకు సాగింది. ఆనాటినుంచి అర్చకులు మరింత భక్తి ప్రపత్తులతో ఆమెను ఆహ్వానించి, ఆమె వచ్చేంతవరకు వేచివుంటూ, ఆమెచేత స్వామివారికి కర్పూర నీరాజనాల్ని ఇప్పించేవారు.

ప్రతిరోజు ఉదయం తులసి మాలల సమర్పణ, మధ్యాహ్నం కవితా వ్యాసంగం, సాయంత్రం కర్పూర నీరాజనం, రాత్రి ఏకాంత సేవానంతరం ఇంటిలోనే తిరుమల స్వామివారితో సత్సంగము- ఇలా సాగుతూవుండింది వెంగమాంబ దినచర్య.

ఒకనాటి సాయంత్రంపూట. వెంగమాంబ యథాప్రకారంగా హారతి పళ్లెంతో శ్రీవారిసన్నిధికి వెళ్లింది. కర్పూర నీరాజనం సమర్పిస్తున్న వేళలో శ్రీ వేంకటేశ్వ రస్వామివారి మూలవిరాణ్మూర్తిలో దశావతారదర్శనమూ, పిదప బ్రహ్మాండ భాండాలలో ఆవరించియున్న శ్రీవారి విరాట్ తేజస్స్వరూపమూ చర్మ చక్షువులద్వారానే దర్శించి ధన్యురాలయ్యింది వెంగమ్మ! ఆనాటినుంచి ప్రతిరోజు చిట్టచివరదిగా వెంగమాంబగారి కర్పూరహారతి లేనిదే, రానిదే ఆలయం మూసివేయ కూడదని, ఆ కర్పూరహారతి అయిన తర్వాత మరే ఇతర హారతులు ఇవ్వరాదని, తర్వాత ఆలయం తలుపులు మూసివేయాలని శ్రీవేంకటేశ్వరస్వామివారు అధికారులకు స్వప్నంలోనూ, అర్చకస్వాములకు అర్చకముఖంగానూ ఆవేశించి ఆదేశించినారు. అప్పటినుంచి ప్రతిరోజు ఏకాంతసేవా సమయంలో చిట్టచివరనా పరమభక్తురాలు అయిన వెంగమాంబగారి "ముత్యాలహారతి" అయిన తర్వాతనే శ్రీవారిఆలయం మూసివేయబడుతున్నది.

తన తదనంతరం కూడ ఈ "ముత్యాల హారతి" కొనసాగేందుకు గాను తరిగొండ వెంగమాంబ, తన చెల్లెలి కూతురగు మంగమ్మను దత్తుగా స్వీకరించింది, నేటికిని ఆమె వంశంవారే వెంగమాంబగారి పేరుతో తిరుమల స్వామివారికి ప్రతిరోజు రాత్రి ఏకాంత సేవా సమయంలో చివరగా కర్పూర హారతిని సమర్పిస్తూవున్నారు.

ఇలా అడుగడుగునా ఆనందనిలయుడు తనయందు చూపిన, చూపుతూవున్న లీలలతో, మహిమలతో తరిగొండ వెంగమాంబ మరింత భక్తితో పరవశురాలవుతూ వచ్చింది. అందువల్ల ప్రతిక్షణం పరంధాముని కీర్తించేది. ప్రతి నిమిషం శ్రీవారిని జపిస్తూ వుండేది. అనుక్షణం ఆనందనిలయుని దర్శిస్తూ ఆనందపడేది. ఇలా ప్రతిరోజూ పగలంతా గడిచేది. రాత్రిపూట హారతి ఇచ్చిన తర్వాత వెంగమాంబ వేంకటేశునిపై కవిత లల్లేది. కావ్యాలు రాసేది. పగలంతా తన సన్నిధికి రప్పించుకొని సేవ చేయించుకొన్న శ్రీనివాసుడు రాత్రులందు ఆమె

ఇంటికే వచ్చేవాడు. ఆమె రాసే పాటలను పరవశించి వింటూ తిరుమలేశుడు ఆహా! అంటూ ఆనందంతో తలను ఊపుతూ వుండేవాడు. ఒక్కొక్కసారి ఆ నిత్యకల్యాణచక్రవర్తి తన మీది దండలనుండి విరులు రాలేట్టుగా నాట్యం చేసేవాడు. 'భళీ! వెంగమ్మా ఆ రచన అద్వితీయం. ఆ ఊహ ఎంతో రమణీయం. ఆ కల్పన ఎంత కమనీయంగా వుంది' . . . అంటూ స్వామివారు, ఆమె చెప్పే ప్రతిమాటనూ, రచననూ వ్యాఖ్యానించేవాడు. అలా ఆనందనిలయుని ప్రత్యక్ష సాక్ష్యంతో తరిగొండ వెంగమాంబ గళంనుండి కలంనుండి శ్రీకృష్ణమంజరి, రుక్మిణీ కల్యాణము, గోపికా నాటకము, జలక్రీడా విలాసము, అష్టాంగ రాయోగసారము, ముక్తికాంతా విలాసము, వాసిష్ఠ రామాయణము ఇత్యాది అమూల్య రచనలు, వేదాంతగ్రంథాలు, నాటకాలు, ద్విపదలు ఎన్నో . . . ఎన్నెన్నో వెలువడినాయి. అయినా శ్రీనివాసునికి తృప్తి కలగలా!

ఒకనాడు వేంకటాద్రిమీది కృష్ణుడు చిన్ని రూపంతో తప్పటడుగులు వేస్తూ, వెంగమాంబ దగ్గరికి వెళ్ళి "అమ్మా! అమ్మా! నాకు ఈ కతను విన్పించవూ! నీవేమో కత చెప్తూవుంటే, మరి నేనేమో ఊఁ కొడుతూ వింటా. సరేనా!"– అంటూ భాగవత గ్రంథాన్ని ఆమె చేతికిచ్చాడట! "నా చిన్నికృష్ణా! నీ మాట నే నెప్పుడైనా కాదన్నానా? నీవేది నాతో చెప్పిస్తే, అది చెప్తా. నీవు దేన్ని పలికిస్తే దాన్నే నేను పలుకుతా. సరేనా!" అంటూ ఆనాటి నుంచి వెంగమాంబ పగటిపూట శ్రీస్వామివారి సేవానంతరం, భాగవతమహాకావ్యాన్ని పండితులకేగాక, సామాన్య పామరజనులకు సైతం సులభంగా అర్థమయ్యేలా, అవగతమయ్యేలా ద్విపదలో రచన సాగించింది. రాత్రి ఏకాంత సేవానంతరం ఆలయాన్ని వీడి తన ఇంటికి ఏతెంచిన శ్రీవేంకటేశ్వరస్వామివారికి రుచ్యములైన పిండివంటల విందులతోపాటు, సాహితీవిందుకూడ చేసేది. ఆ స్వామికూడ ఆమె వడ్డించిన వంటలను ప్రీతిగా తింటూ, ఆమె నోటినుండి జాలువారే భాగవతకథ ద్వారా గడచిన అనంతయుగాల్లోని తన గాథలను వింటూ మైమరచేవాడు. మళ్లీ తెల్లవార సుప్రభాత సమయంలో ఆలయంలో ప్రత్యక్షమై భక్తులకు దర్శన మిచ్చేవాడు.

ఇలా జరుగుతూవుండగా, ఒకనాటిరాత్రి ఆలస్యంగా వచ్చిన స్వామి వారిని సేదతీర్చి, పాదసేవనం చేస్తూ వంగమాంబ "స్వామీ! శ్రీనివాసా! సర్వజగాల నేలే నా కన్నయ్యా! నన్ను గన్న తండ్రీ! నీవు ప్రతిరోజూ ఇలా రావడం అలా వెళ్లడం ఏమీ బాగాలేదు. నేను సహించలేకుండా వున్నాను. నీవు నిత్యమూ, నా దగ్గరేవుండి నన్ను విడవకుండా నీ సాన్నిధ్యాన్ని నాకు ప్రసాదించవలసింది" అంటూ పరి పరి విధాల ప్రార్థించింది. ప్రాధేయపడింది.

"తల్లీ! వెంగమ్మా! అలా ఎలా కుదురుతుంది? నాకు నీవంటి పరమ భక్తు లెందరో వున్నారని నీకూ తెలుసుగదా! మరి వారికి అందరికీ నా సాన్నిధ్యాన్ని ప్రసాదించాలి కదా! అదిగాక, ఎక్కడినుంచో, ఎక్కడెక్కడి నుంచో నానా వ్యయ ప్రయాసలను ఓర్చుకుంటూ నాసన్నిధికి నిత్యమూ వస్తూవున్న యాత్రికులకు, నన్ను నమ్ముకొని వస్తూవున్న భక్తులకు నిత్యదర్శన భాగ్యాన్ని కలిగించి తీరవలె గదా! వారి నందరినీ సంతృప్తిపరచి ఆనందంప జేయవలె కదా! అందువల్ల నీ కోరిక తీర్చడం ఎలా వీలవుతుందమ్మా!"– అంటూ చిరు నవ్వును చిందిస్తూ సందేహాన్ని వెలిబుచ్చాడు ఆనందనిలయుడు. అంత వెంగమాంబ వేంకటేశుని పట్టు పీతాంబరాన్ని గట్టిగా పట్టుకొని లాగుతూ, "నీ మాయమాటలు నాదగ్గర కట్టి పెట్టవయ్యా స్వామీ! నీవా, ఈ కల్లబొల్లి మాటలు చెప్పేది! నా దగ్గరా చెప్పేది! ఆదిమధ్యాంతరహితుడవు! సత్తా మాత్ర శరీరుడవు! స్వయంప్రకాశుడవు! జగదీశ్వరుడవు! సర్వాంతర్యామివి! ఎందెందు వెదకిన అందందు కలవాడవు! నీవు లేని ప్రదేశం కాని, అణువుగాని ఎక్కడైనా వున్నాయా? 'అణోరణీయాన్ మహతో మహీయాన్'– అనే ఉపనిషద్వాక్యానికి కట్టుబడినవాడవు నీవు కదా! మరి అలాంటి నీవా నన్ను మభ్య పెట్టేది? అందువల్ల నీ దొంగమాటలు, మాయ మాటలు కట్టిపెట్టి, ఓ స్వామీ! నీవు అంతటా వుంటూ కూడా, నాకు నీ ప్రత్యక్ష సాన్నిధ్యాన్ని తప్పక ప్రసాదించవలసిందే." అంటూ చేతులు జోడించి నమస్కరించింది.

అంత వెంగమాంబ మాటలకు వేంకటేశ్వరుడు అడ్డు తగులుతూ "అది కాదు వెంగమ్మా! . . ." అంటూ ఏదో చెప్పబోతూ వుండగా ఇంతలో శ్రీవారి ఆలయంలోని బంగారువాకిలి దగ్గర "కౌసల్యా సుప్రజా రామ! పూర్వా సంధ్యా ప్రవర్తతే."- అని శ్రీవారి అర్చకశిఖామణుల సుప్రభాత పఠనం తిరుమల గిరులంతా మార్మోగుతూ వినపడింది. అంతే! ఉలిక్కిపడుతూ వేంకటేశుడు ఉన్న పళంగా అంతర్ధానమై ఆలయంలో ప్రత్యక్షమయ్యాడు. ఇక్కడ వెంగమాంబ గట్టిగా చేతితో పట్టుకొన్న శ్రీస్వామివారి పట్టు పీతాంబరం సగం చినిగిపోయి ఆమె చేతిలో మిగిలిపోయింది. వెంగమ్మ శ్రీస్వామివారి ఆ శేషవస్త్రాన్ని మహాప్రసాదంగా భావించి, రెండుకన్నులకు అద్దుకొంటూ దానిని మడతపెట్టి, పూజలో భద్రంగా వుంచింది.

ఇక్కడ శ్రీవారి ఆలయంలో సుప్రభాతసమయంలో బంగారువాకిళ్లు తెరచి లోనికి వెళ్లిన అర్చకులు శ్రీవారి మూలవిరాణ్మూర్తిని ఆపాద మస్తకం చేతులారా, కన్నులారా సేవించుకొన్న తర్వాత పరిశీలించి చూడగా, అందులో శ్రీస్వామివారి పట్టు పీతాంబరం కొంతభాగం చిరిగిపోయి, కొంత వేలాడుతున్నట్లుగా గమనించి ఆశ్చర్యపోయారు. "చినిగిపోయిన సగం ఎక్కడ? దొంగలు పడ్డారా! ఇంకా ఏమైనా పోయాయా!" అని అంతటా శోధించారు. కాని ఒక్కవస్త్రం మాత్రమే చింపబడినట్లుగా నిశ్చయించి, అధికారులకు తెలియ జేశారు అర్చకులు. అధికారులు కూడ పెక్కువిధాలుగా పరిశీలించి, పరిశోధించి "ఇది దొంగలపని ఏమాత్రం కానే కాదు. దొంగలకు దొంగ అయిన వెన్నదొంగ, మహామాయలకాడైన "శ్రీనివాసుని మాయలలో ఇది కూడ ఒక మహిమ! అని నిర్ణయించి, తీర్మానించారు. తిరుమలక్షేత్రంలో ఎక్కడి కైనా, భక్తుల యిండ్లకు స్వామివారు వెళ్లి వుండవచ్చును. అక్కడ ఆ భక్తులతో ఆడిన పరాచికాలాట ఫలితమే ఇది కావచ్చు." అంటూ ఆలయ అధికారులు, అర్చకులు, మహంతు మఠాధిపతి . . . . . ఇలా అందరూ ఏకగ్రీవంగా నిశ్చితాభిప్రాయానికి వచ్చారు. "ముందుగా తిరుమలలో

భక్తులను విచారించి తెలుసుకుందాం" అనుకుంటూ, "అయినా తరిగొండ వెంగమాంబను మించిన భక్తులు ఎవరు వుంటారు? ముందుగా ఆ యమ్మ దగ్గరికి వెళ్లి అడుగుదాం" . . . . అని అధికారులు, అర్చకులు, అందరూ గుంపుగా వెంగమాంబ యింటికి వెళ్లారు. ఆ భక్తురాలికి భక్తిపూర్వంకంగా నమస్కారాలు సమర్పించిన పిదప, శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్యమంగళ మూలవిరాణ్మూర్తికి అలంకరించిన, పట్టు వలువను గూర్చి, అది చిరిగి పోయి సగం వస్త్రం కనపడకుండా పోయిన సంగతిని గూర్చి ఆమెకు విన్నవించుకున్నారు.

అంత, వెంగమాంబ ఏమాత్రం ఆసక్తిని కనపర్చక, అదేదో అతి సాధారణ విషయమే అన్నట్లుగా వింటూ "అలాగా! అయితే ఆ గదిలో దేవుని దగ్గర వుంది. అదే ఇదేమో! పరిశీలించి పట్టుకెళ్లండి"– అని చెప్పింది.

అర్చకస్వాములు అత్యంత విస్మయంతో, ఆసక్తితో వెంగమ్మ యింటిలోనికి వెళ్లి, పూజలోవున్న శ్రీవారిపట్టువస్త్రాన్ని పూర్తిగా విప్పిచూస్తూ ఆశ్చర్య పోయారు. ఆ పట్టుపీతాంబరమే ఇది! ఏమాత్రం సందేహంలేదు. కాని, ఇది చిరిగిపోకుండా సంపూర్ణంగా వుందే! అంటూ మరింత ఆశ్చర్య, ఆనందాలకు లోనయ్యారు. శ్రీవేంకటేశభగవానునికి, శ్రీవారి ఆంతరంగిక భక్తశిరోమణి అయిన వెంగమాంబకు– ఈ ఇరువురికి, మానవులకు ఏమాత్రం తెలియరాని, ఊహించలేని, అంతుబట్టని అలౌకిక లీలావిశేషాలు ఏవేవో నిత్యమూ జరుగుతున్నాయని భావనచేస్తూ, అవ్యక్తమైనటువంటి దివ్యానుభూతుల్ని చవిచూస్తూ, అర్చకులు, వెంగమాంబ అనుమతితో ఆ పట్టు వస్త్రాన్ని స్వీకరించి, దానిని వెండిపళ్లెంలో పెట్టుకొని మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి చూడగా, శ్రీవారిమూలమూర్తిపై అంతకు ముందున్న సగం వస్త్రంకూడా పూర్తిగా మాయమయ్యింది. ఇది దర్శించిన వారిని అందరినీ మరింత ఆశ్చర్యానికి లోనుచేసింది! వాళ్లందరి కళ్ళనుండి ఆనందబాష్పాలు రాలాయి. ఈ పట్టువలువ ఎంతో విలువైంది. స్వామివారికి ఎంతో ప్రియమైంది– అనుకుంటూ

అర్చకశిఖామణులు వెంగమాంబవద్దనుంచి తెచ్చిన పట్టువస్త్రాన్ని శ్రీవేంకటేశ్వరుని మూలమూర్తికి అలంకరించి, అర్చించి ఆరాధించారు. వెంగమాంబ సాక్షాత్తుగా వేంకటేశ్వరుని అవతారంగా భావిస్తూ, ఆమెను మరింత భక్తిప్రపత్తులతో భక్తులు సేవించేవారు.

మహాభక్తుడూ మహంతుమఠంఅధిపతీ అయిన ఆత్మారాందాసుల ఆదరణ పొందడం, రాతిబండపడిన బావిలో నీళ్లు వూరడం, మహనీయులైన తాళ్లపాకవారు చేరదీసి చోటుఇచ్చి ఆదరించడం, అర్చకులను శపించటం, శ్రీవారిరథోత్సవం ఆగిపోవడం, వెంగమాంబ హారతితో మళ్లీ కదలడం, శ్రీస్వామివారు వెంగమాంబహారతిని శాశ్వతంగా కోరడం, పట్టుపీతాంబరాలను స్వామివారు వెంగమాంబ యింట్లో వదలివెళ్లడం . . . వంటి సంఘటనలతో, ఇంకా ఆమె చేసిన రచనలతో ప్రజలలో, భక్తులలో, తరిగొండ వెంగమాంబ యందు అత్యంత భక్తిప్రపత్తు లేర్పడినాయి. ప్రతిరోజూ ఆమెను దర్శించుకొనేవారు. ఆమె ఆశీస్సులను పొందేవారు. వెంగమాంబ గొప్పతనం, మహిమ దేశమంతటా వ్యాపించాయి. ఎందరెందరో జమీందారులు, భూస్వాములు, పాళెగార్లు, సంస్థానాధీశులు, ఆమెకు దానాలు చేశారు. భక్తితో విరాళాలు ఇచ్చారు. భూములను ఇనాములుగా సమర్పించారు. ధనాన్ని కానుకలుగా చెల్లించారు.

వెంగమాంబ భక్తులద్వారా వచ్చిన ఈ ధనాన్ని యావత్తూ తిరుమల భక్తులకోసమే వినియోగించింది. పేదయాత్రికులకోసం అన్న సత్రాలను నిర్వహించింది. వేసవి కాలంలో చలివేంద్రలను ఏర్పాటు చేసింది. ప్రతిసంవత్సరం బ్రహ్మోత్సవంలో భక్తులకు అన్నదానం వంటి కార్యక్రమాలను ఇబ్బడిముబ్బడిగా వెంగమాంబ నిర్వహించేది. అలాగే ప్రతి ఏడాది వైశాఖ మాసంలో నృసింహ జయంతిని పురస్కరించుకొని పదినాళ్లపాటు పెద్దగా నృసింహుని జయంత్యుత్సవాలను ధార్మిక కార్యక్రమాలను తానే స్వయంగా జరిపించేది. ఈ ఉత్సవాల్లో భక్తులందరికీ ఉచితంగా ప్రసాద వితరణను ఏర్పాటుచేసేది

వెంగమాంబ. బాల్యంలో వెంగమాంబకు ఇష్టదైవం తరిగొండలోని నృసింహస్వామి. అందువల్లే, తాను ఈ ఉత్సవాలు నిర్వహించడమేకాక, తాను చేసిన ప్రతి రచనలోను, తరిగొండనృసింహునికి, తిరుమల శ్రీవేంకటేశ్వరునికి అభేదాన్ని కల్పించింది. వెంగమాంబ దృష్టిలో నృసింహుడూ వేంకటేశ్వరుడూ ఇద్దరూ అభిన్నులు. అందువల్లే నృసింహస్వామి జయంత్యుత్సవాల్లో సయితం శ్రీదేవి భూదేవీ సమేతంగా శ్రీ వేంకటేశ్వరుడు వెంగమాంబ యింటికి వేంచేస్తూ, పూజా నివేదనాదులందుకొంటూ వున్నాడు. ఇది నేటికీ తిరుమలలో జరుగుతూవున్న సంప్రదాయం కూడా.

అంతేగాక, వెంగమాంబ భక్తులిచ్చిన దానాలతో తాను రాసిన కావ్యాలకు రచనలకు ప్రతులుకూడా వ్రాయించేది. ఈమె స్థాపించిన మఠంలో "అష్టఘంటములు" అనే పేరుతో ఎనిమిదిమంది వ్రాయసకాండ్రు ఏర్పాటు చేయబడ్డారు. వీరంతా ఆమె రచనలకు ప్రతులను వ్రాసేవారు. వెంకటగిరి, కాళహస్తి, కార్వేటినగరం సంస్థానాధీసులు, కూచిపూడిభాగవతులు మున్నగు వారు వెంగమాంబ గ్రంథాల ప్రతులను అభ్యర్థించి, తీసికొని వెళ్ళేవారు.

వెంగమాంబ రచనలలో అత్యంత విశిష్టమయినదీ, అగ్రగణ్యమయినదీ. "శ్రీ వేంకటాచలమాహాత్మ్యము" అనే పద్యకావ్యం. జగత్కల్యాణ చక్రవర్తి అయిన శ్రీ వేంకటేశ్వరుని మహిమాన్వితమైన దివ్యగాథను వివరించే ఈ గ్రంథం, సుమారు పదునెనిమిదివందల గద్యపద్యాలతో ఆరు ఆశ్వాసాలు గలిగి సరళసుందరశైలిలో అలరారుతూ వుంది. వేంకటాచలక్షేత్రంలో . . . . . కథానాయకుడైన శ్రీ వేంకటేశ్వరుడు ప్రత్యక్షసాక్షిగాను, ఏకైక శ్రోతగానూవుంటూ ఊంకొడుతూ వుంటే, పరమభక్తురాలు అయిన వెంగమాంబగళంనుండి పెల్లుబికి, జాలువారిన రసపత్రువాహప్రబంధమే "శ్రీవేంకటాచల మాహాత్మ్యము". తరిగొండ వెంగమాంబ రచించిన ఈ కావ్యాన్ని పారాయణ చేస్తే పెండ్లికాని వారలకు వివాహమవుతుందనీ, ఇంకా, ఎన్నో సత్ఫలితాలు కలుగుతాయనీ, శ్రీ వేంకటేశ్వరుని అనుగ్రహం

కలుగుతుందనీ ప్రసిద్ధి యేర్పడి, తిరుమలకు వచ్చిన యాత్రికులు వేచివుండి ఈ వేంకటాచలమాహాత్మ్యగ్రంథానికి ప్రతులు తయారు చేసుకొని వెళ్లేవారంటే, ఈ గ్రంథప్రశస్తి యెందటిదో స్పష్ట మవుతూవుంది. అంతే కాదు. తెలుగులో వెలసిన వేంకటాచలమాహాత్మ్య గ్రంథాలలో దీనికున్న ప్రాచుర్యం మరే గ్రంథానికీ లేదనడం ఎంతమాత్రమూ అతిశయోక్తి కాదు. అత్యుక్తి అంతకంటే కూడ కాదు.

మహాభక్తురాలు, కవయిత్రి, మహామహిమాన్వితురాలు- అయిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబను నిరంతరం దర్శించే యాత్రికజనం నానాటికీ పెరగసాగింది. కొందరు ఆమెను దర్శిస్తేచాలు, జన్మ ధన్యమవుతుందని వచ్చేవారు. మరికొందరు ఆమెచేత ఆశీస్సులను పొందాలని వచ్చేవారు. ఇంకొందరు ఆమె చేసిన భక్తిరచనలను గురించి వచ్చేవారు . . . . . ఇలా నిత్యమూ తిరుమల యాత్రికులు స్వామిసందర్శనంతోపాటు, వెంగమాంబ దర్శనం కూడ చేసుకొనడానికి వచ్చేవారు. ఇందరితో ఇన్నివిధాలా దర్శించవచ్చే యాత్రిక జనం చేత భక్తజనంచేత క్షణం తీరికలేకుండా, తన ఆధ్యాత్మికసాధనకు భంగం కలుగుతుండగా, వెంగమాంబ దీనికి ఏదో ఒకపరిష్కారమార్గం అన్వేషించాలని అనుకొంటూవుండగా, ఆ రాత్రి యథాప్రకారం ఆమె వద్దకు ఆనందనిలయుడు వచ్చాడు.

'ఏమిటి నా బంగారుతల్లీ! నేడు అన్యమనస్కవై నన్ను గమనించని కారణం ఏమిటి? విడమరచి చెప్పు'- అని స్వామివారు అడిగారు. అంతట వెంగమాంబ "శ్రీనివాసా! రాను రాను పెరుగుతున్న జనసందోహపుసందడివల్ల నా ధ్యానానికి, నా సాధనకు భంగం కలుగుతూ విసుగువస్తున్నది. ఇక భరింపలేను. నన్ను నీలో ఐక్యం చేసికొనవే పరంధామా!" అంటూ బ్రతిమలాడింది. బహువిధాల ప్రార్థించింది.

"ఇంకా కొంతకాలం ఈ వేంకటాచలక్షేత్రంలో నీవు తపస్సాధన చెయ్యవలసివుంది. అందుకు అనువుగావుండే ఏకాంతమైన దివ్యస్థలాన్ని నీకు చూపిస్తానని చెప్పి, శ్రీనివాసుడు క్షణంలో ఆలయానికి ఉత్తరాన 12 మైళ్ల దూరంలోగల తుంబురుతీర్థానికి వెంగమాంబను చేర్చాడు. అక్కడ ఒక గుహను చూపుతూ "వెంగమ్మా! నీవు రోజూ పగలంతా నిశ్చింతగా తపస్సాధన చెయ్యి! ఇదిగో! ఈ గుహలోని బిలమార్గం ద్వారా ఆనందనిలయంలోనికి ఏతెంచి నన్ను ఆరాధించవలసింది" అంటూ ఆనతిచ్చాడు. ఆనాటినుంచి బంగారువాకిళ్లు మూసివేసిన తర్వాత రాత్రి తుంబురుతీర్థంలోని గుహయందలి బిలమార్గంగుండా వెంగమ్మ ఆలయానికి వస్తూ ప్రతిరాత్రి శ్రీస్వామివారిని అర్చించేది, ఆరాధించేది. ఇలా కొన్ని రోజులు గడిచాయి. పిదప అర్చకులు రాత్రి తాము చేసిన అర్చనలోని పూలు, పక్కకు తీసివేయబడి వుండడం, శ్రీస్వామివారి మూర్తియందు కొత్తపూలు వుండడం గమనించి, రాత్రి పూట ఎవరో భక్తులు వచ్చి, మళ్లీ పూజిస్తూ వున్నారని భావించారు. బహుశా తిరుమల నుంచి అదృశ్యమై ఎక్కడికో వెళ్లిన వెంగమాంబే ప్రతిరాత్రీ వచ్చి శ్రీవారిని అర్చిస్తూ వుండవచ్చునని బహువిధాల భావించారు.

అయిన ఈ విషయాన్ని శోధించి తీరవలసిందేనని తలంచి, చివరకు అప్పటి మహంతు ఏకాంతసేవానంతరం, బంగారువాకిళ్లు మూయడానికి ముందే శ్రీవారి ఆలయంలో ప్రవేశించి, ఒకమూల నక్కి, ఆగంతుకులకోసం కంటిలో వత్తి వేసికొన్నట్లుగా నిరీక్షిస్తూ వుండినాడు. సరిగ్గా అర్ధరాత్రి సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామివారి పాదాల ముందు ఒక బిలమేర్పడి, అందుండి అద్భుతమైన తేజస్సులు వెదజల్లుతూవుండగా పరమభక్తురాలు అయిన వెంగమాంబ పూజాద్రవ్యములతో పైకి వచ్చింది. అంతే ఆ అద్భుతప్రకాశాన్ని చూడలేక, వెంగమాంబదర్శనంతో ఆశ్చర్యపోయి, మూర్ఛ పోయినాడు మహంతు.

తెల్లవార సుప్రభాతానంతరం బంగారువాకిళ్లు తెరవగా, మూర్ఛపడి యున్న మహంతును సేదతీర్చి, అనునయించి ప్రశ్నించగా, నోట మాట రాక, మాటలాడలేక, నిదానంగా, ఆ మహంతు వెంగమాంబ రాకను, ఆమెను పూజను గూర్చి తెలియజేశాడు. 'ఆ భక్తురాలు ఇందే, ఈ తిరుమలలోనే ఎక్కడో వుంటూ రోజూ వచ్చి పూజించి వెళ్లుతున్న'దని చెప్పాడు. దీనితో భక్తులు మళ్లీ ఆమెకోసం తిరుమల గుట్టలు, పుట్టలు, కొండలు, కోనలు గాలించ సాగారు.

ఇదే సమయంలోనే తిరుమలక్షేత్రానికి ఒక విచిత్రమైన విప్రుడు వచ్చాడు. అతనికి కళ్లూ, నోరూ తప్ప, మిగతా శరీరమంతా పుండ్లతో, చీమూ, నెత్తురులూ కారుతూ, దుర్వాసనలతో కంపు కొడుతూ వుండినాడు. భార్యాపిల్లలు, బంధువులు, ఊరివారు, అతనిని చూసి, దరిజేరనీయక నిందించేవారు. తిట్టేవారు, 'దూరం, దూరం' అంటూ ఛీదరించుకొనేవారు. పాపం! ఆ బాపడు తన ప్రారబ్ధకర్మకు చింతిస్తూ శరీరబాధకన్నా, తనబంధువులు పెట్టే మానసిక బాధలకు ఓర్వలేక, తన వారిని, తన పూరిని విడిచిపెట్టి, చివరిగా శ్రీనివాసుని దర్శించి ప్రాణాలను వదలాలని సంకల్పించి, తిరుమలకు వచ్చాడు. ఆ దివ్యక్షేత్రంలోకూడ విచిత్రమైన, భయంకరమైన కుష్ఠరోగ పీడితుడైన ఆ బాపని, యాత్రికులు, ఆలయ అధికారులుకూడ వెడలగొట్టారు. ఇక గత్యంతరంలేక ఒకవైపు శరీరబాధ, మరోవైపు మానసిక బాధ, ఇంకోవైపు ఆకలి దప్పుల బాధ- ఇలా మూడుబాధలు ఒక్కసారిగా ముప్పిరిగొనగా, ఈ వేంకటాచలంలోనే ఆత్మహత్య చేసుకొనవలెననే దృఢ సంకల్పంతో అందందు తిరుగుతూ, చివరకు అనుకోకుండా తుంబురుకోనకు చేరుకున్నాడు. ఇలా నానాప్రయాసల కోర్చి, అక్కడికి దేకుతూ వెళ్ళిన ఆ విప్రునికి శరీరబాధ దుస్సహమై భరించలేక, 'గోవిందా! ఏడుకొండలవాడా! ఈ బాధ భరించలేకున్నాను స్వామీ! నాప్రాణాలు తీసివేసి, ఈ కష్టాలను తొలగించు స్వామీ! ఏడుకొండలవాడా! వేంకటరమణా! వేంకటరమణా!" అంటూ బిగ్గరగా రోదించినాడు. ఆ నిర్జనారణ్యంలో ఆ బ్రాహ్మడి ఏడుపు ఆ తుంబురుకోనంతా

ప్రతిధ్వనించింది. అంతే! అచ్చటి గుహలో తపస్సు చేసుకుంటూవున్న వెంగమాంబ చెవిలో ఈ ఆర్తనాదం పడింది. బయటికి వచ్చి, విప్రుని దీనావస్థను చూచి జాలిపడింది. "స్వామీ! వేంకటేశా! ఈ దీనుని ఆర్తిని పోగొట్టుమో దేవా!" అంటూ వెంగమ్మ వేంకటేశుని ప్రార్థిస్తూ, ఆకలి దప్పులచేత, శరీరబాధచేత దస్సియున్న ఆ బ్రాహ్మనికి తినడానికి మంచి రుచికరములైన పండ్లను ఇచ్చింది. ఎన్నినాళ్లనుండో తిండిలేక కనీసం పలకరించే దిక్కులేని ఆ పాంథుడు తనపాలిటి ఏ భాగ్యదేవతో, ఏవనదేవతో? అని భక్తిగా ఆమెకు నమస్కరిస్తూ, ఆమె ఇచ్చిన ఫలాలను ఆపురాపురుమంటూ కడుపారా తిన్నాడు. పిదప వెంగమాంబ "అయ్యా! నీ ఆర్తి నేటితో సరి. ఇక్కడ నన్ను చూసినట్లుగా ఎవరితోను, ఏసమయంలోను, ఎక్కడా చెప్పకు సుమా! ఒకవేళ నోరుజారావో, నీ తల వేయివక్కలు అవుతుంది జాగ్రత్త!" అంటూ కళ్లుమూసుకోమని చెప్పింది. అలా కళ్లుమూసు కున్న వ్యక్తి, కళ్లు తెరచేంతలో తిరుమల శ్రీవారి ఆలయం పక్కన స్వామిపుష్కరిణిలో తేలాడు. లేచిన ఆ బ్రాహ్మడు తన శరీరాన్ని తడిమిచూచుకొని ఆశ్చర్యపడ్డాడు. అదే సమయంలో పుష్కరిణిలో స్నానం చేస్తున్న భక్తులు పుష్కరిణిలో తేలిన ఆ భక్తునిచూచి ఆశ్చర్యపడ్డారు. పుష్కరిణిలోనుంచి పుట్టినందువల్ల, అతన్ని 'పుష్కరిణీజు'దని పిలుస్తూ అతని విషయాలను గుచ్చి గుచ్చి అడిగేవారు. ఆ పుష్కరిణీజుడు కూడ వెంగమాంబ పెట్టిన ఆంక్షవల్ల భీతుడై నోరు మెదపక తిరుమల క్షేత్రంలోనే వుండేవాడు.

మరికొందరు భక్తులు అంతకుముందు రోగ పీడితుడై తిరుగుతున్న బ్రాహ్మడే ఈ పుష్కరిణీజుడని గుర్తించి, అతను పొందిన ఈ కాయసిద్ధికి ఆశ్చర్యపోతూ కానుక లిచ్చేవారు; నమస్కరించేవారు. తమకు అట్టి సిద్ధిని, ఉపదేశించవలసిందని ప్రార్థించేవారు. 'వినాశ కాలే విపరీత బుద్ధిః' అన్నట్లు ఈ పొగడ్తలకు ఉబ్బిపోయిన పుష్కరిణీజుడు, తనకు అకారణంగా వచ్చిన సంపదకు అహంకరించి, చాలాకాలం గడిచింది కదా! ఏమవుతుందిలే! అన్న నిర్లక్ష్యంతో తుంబురుకోన ప్రాంతంలో తాను వెంగమాంబను చూచినట్లు, ఆమె దయవల్లే ఇలా మారినట్లు చెప్పినాడు. అంతే! ఆ క్షణంలోనే ఆ బాపని తల ముక్కలు చెక్కలై, విగతజీవి అయ్యాడు.

తపస్సంపన్నులైన మహనీయుల వాక్కులు ఎన్నటికిని వృథా కావు కదా!

మళ్లీ వెంగమాంబ ఉనికిని తెలిసికొన్న భక్తులు, యాత్రికులు మళ్లీ ఆమెను గూర్చి వెదకటానికి మొదలు పెట్టారు. ఆమెను దర్శించటానికి అఱ్ఱులు చాచారు. ఆమెతో మాట్లాడడానికి కుతూహలపడ్డారు. ఆమె నుండి ఆశీస్సులందడానికి ఆనందంతో అడవంతా గాలిస్తూ ఆమె ప్రశాంతతకు, ఏకాంతతకు భంగం కలిగింపసాగారు.

ఇలాంటి సమయంలో ఆ రాత్రి ఆనందనిలయంలో ప్రవేశించిన వెంగమాంబ "ఓ జగదేకప్రభూ! ఏకాంతంగా నన్ను ఉంచిన తుంబురుకోన కూడ మానవ సంచారంతో ఇప్పుడు అలజడిగా వుంది. ఇక నాకు ఏది దారి! అని పరి పరివిధాల శ్రీనివాసుని ప్రార్థించింది. అంత, స్వామివారు "వెంగమ్మా! ఇకమీదట నాకంటె నిన్ను వేరుగా వుంచటం భావ్యమని తలంచటం లేదు. అందువల్ల, నీవు తీవ్రమైన సమాధినిష్ఠలో ప్రవేశించు. పరమయోగినివై నీవు ఆ సమాధినుంచే, ప్రతిరోజు రాత్రి దివ్యమైన తేజోరూపంతో ఆనందనిలయానికి వచ్చి, నన్ను సేవించుకోవలసింది." అని అనుమతి ఇచ్చినాడు.

శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆజ్ఞ ననుసరించి, సహస్రచంద్రదర్శనం చేసిన వృద్ధతపస్విని తరిగొండ వెంగమాంబ తుంబురుకోన విడిచి, మళ్లీ తిరుమల తిరువీథుల్లో అందరికీ కనపడింది. భక్తులకు దర్శనమిచ్చి, ఆనందింపజేసింది. పిదప తనకు కాల మాసన్న మైనదని, శ్రీ వేంకటేశ్వరుడు తనను పిలుస్తున్నాడని, అందువల్ల సమాధిలోనే వుంటూ సిద్ధి పొందుతానని అందరికీ ఎరుక పరచింది. సరిగ్గా (1999) నేటికి 182 ఏండ్లక్రిందట, అంటే ఈశ్వర నామ సంవత్సరంలో, శ్రావణ మాసంలో శుద్ధ నవమినాడు సమాధిలో ప్రవేశించింది. వెంగమ్మ సజీవంగా సమాధిలో ప్రవేశించిన అనంతరం ఆమె ఆజ్ఞప్రకారం సమాధిని సుగంధ ద్రవ్యాలతో మూసివేసి, దానిపైన తులసీ బృందావనాన్ని నిర్మించారు. ఆనాటినుంచి నిత్యమూ భక్తులు ఆమె సమాధిని సేవిస్తూ వుండినారు. క్రీ.శ.

1817లో సమాధి నిష్ఠురాలై సిద్ధిపొందిన వెంగమాంబవారి బృందావనాన్ని నేటికీ తిరుమలక్షేత్రంలో శ్రీవరాహస్వామివారి ఆలయానికి ఉత్తరం దిక్కున అంటే తాళ్లపాకవారి, తరిగొండవెంగమ్మ గారి ఇంటికి దగ్గర్లోనే ఉత్తరం దిక్కున వందగజాల దూరంలోవున్న వెంగమాంబ తోటలో దర్శించవచ్చు. ఆమె బృందావనంపైన, ఆమె తొట్ట తొలుత తిరుమల చేరుకున్నసమయంలో దారిలో ఆమెను రక్షించిన "సందెకాపు మొగిలిపెంట"లో నుండిన ఆంజనేయస్వామివారి చిన్న విగ్రహం కూడ ప్రతిష్ఠింపబడింది.

తిరుమల వాసులు, కొందరు భక్తులు వెంగమాంబ సమాధికి ప్రతిరోజూ ప్రదక్షిణాలుచేస్తూ, సేవిస్తూ వుంటారు. ప్రతి శుక్రవారం, ప్రతి మంగళవారం, విశేషంగా అలికి, ముగ్గులు వేసి పూజిస్తూ వుంటారు. ఇక్కడ వ్యవహారంలో "తరిగణమ్మ"గా పిలువబడుతూ, మొక్కులందు కొంటూవున్న పరమభక్తురాలు అయిన తరిగొండ వెంగమాంబ నేటికీ భక్తులకు దర్శనమిస్తూవున్నదట! సేవించిన వారి కోరికలను తీరుస్తూ వున్నదట!

ఆ నాటినుండి ప్రతిరాత్రీ తరిగొండ వెంగమాంబ ఆ సమాధినుండి దివ్యమైన యోగరూపంతో ఆనందనిలయానికి వెళ్లి, శ్రీస్వామివారిని సేవిస్తూ వుంటుందట!. ఏది యేమైనా నేటికీ ప్రతిరోజు రాత్రి ఏకాంత సేవా సమయంలో "ముత్యాల హారతి" అనే కర్పూర నీరాజనం ద్వారా, శ్రీనివాసుడు వెంగమాంబను స్ఫురణకు తెస్తూ, ఆ కర్పూరహారతి వెలుగుల్లో దివ్య ప్రభలతో ప్రకాశిస్తూ, భక్తు లందరినీ మైమరపిస్తూ వున్నాడు. మధురానుభూతుల్ని పంచి పెడుతూవున్నాడు. అపూర్వమైన దివ్యానందంలో ముంచెత్తుతూ వున్నాడు.

భక్తులపాలిటి పెన్నిధి అయిన బాలాజీ అనుగ్రహంతో ఎప్పుడైనా శ్రీవారి ఏకాంతసేవలో ప్రత్యక్షంగా పాల్గొనే భాగ్యం కలిగినట్లైతే, తరిగొండవెంగమ్మ ముత్యాలహారతి వెలుగుల్లో ప్రకాశించే శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యమంగళ విరూణ్మూర్తిని, ఆ వెంటనే శయనమండపంలో, బంగారు తూగుటుయ్యాలలో

యోగనిద్ర కుపక్రమించే భోగశ్రీనివాస పెరుమాళ్ల దివ్యదర్శనాన్ని కన్నులారా చూస్తూ, ఆ వేంకటేశ్వరస్వామివారితో పాటు తరిగొండ వెంగమాంబవారిని స్మరిస్తూ ధన్యులు కండి! జీవితాన్ని పునీతం చేసికోండి! ప్రత్యక్షంగా ఏకాంత సేవలోపాల్గొనే మహదవకాశాన్ని కల్గించమని ఆ జగత్కల్యాణ చక్రవర్తిని ప్రార్థిస్తూ, అంతవరకు, అంటే- ఈ క్షణం నుంచే కన్నులుమూసికొని ప్రతి రాత్రీ ఆనందనిలయంలో వున్నట్లుగానే భావిస్తూ, తరిగొండ వెంగమాంబవారి "ముత్యాలహారతి" వెలుగుల్లో ముచ్చటగా మురిపిస్తూ, మైమరపిస్తూ వున్న కొండలరాయుని కోటి సూర్యప్రభాభాసమానమైన దివ్యమూర్తిని దర్శిస్తూ, పరమయోగిని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబగారి మంగళహారతి పాటతో అందరం గళం కలుపుదాం! ఆ గోవిందుని నిండైన, మెండైన అనుగ్రహానికి పాత్రుల మవుదాం!

"మంగళ మలమేలుమంగ చిత్తాబ్జ
సారంగ! యిదె నీకు జయమంగళంబు!
సురుచిరగుణ! నీకు శుభ మంగళంబు
సద్గురుండగు నీకు సర్వమంగళము!!"
గోవిందా! గోవిందా!! గోవిందా!!!

## తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# శ్రీ వేంకటేశ్వర నిత్యాన్నదాన ట్రస్టు

దాతలు, భక్తులు ఇచ్చిన విరాళాలతో ఈ ఎస్.వి. నిత్యాన్నదాన పథకం నడుస్తుంది.

ఈ పథకం క్రింది కనీసం రూ. 1,000 అంతకన్నా ఎక్కువ విరాళంగా ఇవ్వాలి. దాతలు తమ విరాళాన్ని జాతీయ బ్యాంకుల నుంచి జారీ చేయబడిన చెక్కులు, డిమాండు డ్రాఫ్టుల రూపంలో చెల్లించవచ్చు. ఈ చెక్కుల, డి.డి.లను ఎస్.వి. నిత్యాన్నదాన ట్రస్టు, తిరుపతి వారి పేర తీసుకొని సెక్రటరి మరియు ఉపకార్యనిర్వహణాధికారి, అన్నదాన ట్రస్టు, తి.తి.దేవస్థానం పరిపాలనా భవనం, తిరుపతి-517 501 వారికి పంపాలి. రూ. 1,000 కన్నా తక్కువ మొత్తంలో వచ్చే విరాళాలను శ్రీవారి హుండికి జమచేస్తారు. ఈ విషయాన్ని దాతకు తెలియపరచటం ఉండదు.

### పథకం పనిచేసే విధానం :

దాతల నుంచి వచ్చిన విరాళాలను జాతీయ బ్యాంకులలో ఫిక్సెడ్ డిపాజిట్లుగా ఉంచి, దానిపైన వచ్చే వడ్డీని మాత్రమే ఈ అన్నదానానికి వినియోగిస్తారు. ప్రత్యేకించి దాత పేరుతో గాని, దాత కోరిన రోజు గాని అన్నదానం జరపటానికి వీలు కాదు. ఈ పథకానికి విరాళం ఇచ్చిన దాతలు సంవత్సరమంతా తాము అన్నదానం చేస్తున్నట్లుగానే భావించాలి. ఈ విషయంలో దాతలకు వర్తమానం పంపటం కూడ వీలుకాదు. రూ. 5 లక్షలు అంత కన్నా తక్కువ మొత్తాలను విరాళం ఇచ్చే దాతలకు దర్శనం, వసతి తదితర సౌకర్యాలేవీ ఉండవు.

### రూ. 5. లక్షలు అంత కన్నా ఎక్కువ విరాళం ఇచ్చిన దాతలకు :

❖ ఎస్.వి. నిత్యాన్నదాన పథకానికి రూ. 5 లక్షలు అంత కన్న ఎక్కువ మొత్తాన్ని విరాళంగా ఇచ్చిన దాతలకు ఈ క్రింది సౌకర్యాలు లభిస్తాయి. ❖ సెక్షన్ 80 (జి) క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు. ❖ దాతపేరును తిరుమల అన్నదాన భవనం ముందు ప్రముఖంగా ప్రదర్శిస్తారు. ❖ దాతలకు శ్రీ వేంకటేశ్వరస్వామి మరియు శ్రీ పద్మావతి అమ్మవారి వెండి బొమ్మలకు బంగారుపూత పూసిన జ్ఞాపిక బహుకరింపబడుతుంది. ❖ ప్రతి సంవత్సరం దాతలకు ఒక దుప్పటి బహుకరిస్తారు. ❖ ప్రతి సంవత్సరం దాత శ్రీవారి దర్శనానికి వచ్చినప్పుడు పది చిన్న లడ్లు ఉచితంగా ఇస్తారు. ❖ దాతకు 3 రోజుల పాటు ఎ.ఆర్.పి. కౌంటరు ప్రాంతంలో వసతి, చెల్లింపుద్వారా వి.ఐ.పి. వసతి కేటాయిస్తారు. దాత 20 రోజుల ముందుగా తెలియపరచాలి. వసతిని బట్టి కేటాయింపు వుంటుంది. ❖ 5 మందికి వైకుంఠ 'క్యూ' కాంప్లెక్సు ద్వారా సంవత్సరానికి 3 రోజులు శ్రీవారి దర్శనము. ❖ ఈ సౌకర్యాలు దాతలకు మాత్రమే జీవితాంతం వుంటాయి. కంపెనీలు, ఫర్మ్‌లు, ఇద్దరు దాతలు అయినపుడు 20 సంవత్సరాలు వుంటాయి. ❖ దాతకు సప్తగిరి మాసపత్రిక జీవితకాలం పంపబడుతుంది.

**అన్నదానం :** ప్రస్తుతం సాధారణ రోజుల్లో 20 వేల మంది యాత్రికులకు, ఆదివారం, పండుగ రోజులలో 35 నుండి 40 వేల మంది యాత్రికులకు ఉచితంగా అన్నదానం జరుగుతుంది. ఇతర వివరాలకు-

కార్యదర్శి మరియు డిప్యూటీ ఇ.ఓ., ఎస్.వి. నిత్యాన్నదాన ట్రస్టు,

తి.తి.దే. పరిపాలనా భవనం, కె.టి.రోడ్డు, తిరుపతి-517 501, ఫోన్: 0877-2264538, 2264237

Published by Sri K.V. RAMANACHARI, I.A.S., Executive Officer
T.T.Devasthanams and Printed at Sri Parasaraya Press, Sri Vyasasramam.